

‘ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 142

సోమవారం 12-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**విజేత సౌరభ్ వర్మ**

హైదరాబాద్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ నెగ్గిన భారత ప్లేయర్ –స్పోర్ట్స్‌లో




**‘పన్ను’కు టైమైంది**

ఈ నెలాఖరు వరకు ఐటీఆర్ దాఖలు గడువు – బిజినెస్‌లో



ఆదివారం కర్ణాటక బెళగావి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతం నుంచి ఓ మహిళను హెలికాప్టర్ ద్వారా తరలిస్తున్న ఐఏఎఫ్

## ఆగని వరదలు

- భారీ వర్షాలతో కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ విలవిల
- సహాయక చర్యల్లో ఆర్మీ, నేవీ, కోస్ట్‌గార్డ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- కర్ణాటక, మహారాష్ట్రల్లో అమిత్ షా ఏరియల్ సర్వే
- హంపీలోకి చొచ్చుకొచ్చిన వరద.. పర్యాటకులు సురక్షితం - 5లో

## ‘బాహుబలి’ వెట్‌రన్ సక్సెస్

రామడుగు (చొప్పదండి): కాళేశ్వరం ప్రాజెక్టు 8వ ప్యాకేజీలో భాగంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద నిర్మించిన సర్జ్‌పూల్‌లో 5వ మోటార్ వెట్‌రన్ విజయవంతమైంది. బాహుబలి మోటార్లుగా పిలుస్తున్న ఇక్కడి మోటార్లలో ఐదో మోటార్ వెట్‌రన్‌ను ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. మోటార్ ఆన్ చేసిన 10 నిమిషాల తర్వాత 117 మీటర్ల ఎత్తులో ఉన్న డెలివరీ సిస్టర్న్ ద్వారా గోదావరి నీరు ఉబికి రావడంతో అధికారుల్లో ఆనందం వ్యక్తమైంది.




# జలదిగ్బంధంలో పాలమూరు

## కృష్ణ, భీమా, తుంగభద్ర నదుల మహోగ్రరూపం

- నారాయణపేట, జోగులాంబ, వనపర్తి జిల్లాల్లో వరద బీభత్సం
- 10 వేల ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- స్తంభించిన రవాణా.. జనజీవనం అస్తవ్యస్తం
- కృష్ణ మండలానికి తెగిన సంబంధాలు
- 11 గ్రామాలకు తుంగభద్రతో ముప్పు
- వరదపోటుతో జూరాల 62 క్రస్టు గేట్లు పూర్తిగా ఎత్తివేత
- పునరావాస కేంద్రాలకు పరీవాహక గ్రామాల ప్రజలు
- అప్రమత్తంగా ఉన్న అధికార యంత్రాంగం
- కలెక్టరేట్లలో హెల్ప్‌లైన్ సెంటర్ల ఏర్పాటు



వరదలో చిక్కుకున్న నారాయణపేట జిల్లా కృష్ణ మండలం వాసునగర్ గ్రామం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. భీమా దూకుడు ప్రదర్శిస్తోంది. వీటికి తుంగభద్ర కూడా తోడయ్యింది. ఈ మూడు ఒక్కటై ఉమ్మడి పాలమూరు జిల్లాపై ముప్పేట దాడికిదిగాయి. గంటగంటకూ పెరుగుతోన్న ఆయా నదుల ఉధృతి.. వాటి పరీవాహక గ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే నారాయణపేట, జోగులాంబ–గద్వాల, వనపర్తి జిల్లాల్లో కృష్ణానది బీభత్సం సృష్టించింది. వరద రూపంలో ముంచుకొచ్చిన ముప్పు 10వేలకు పైగా ఎకరాలను ముంచెత్తింది. 16 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. కృష్ణ మండల కేంద్రానికి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అధికారులు 38 గ్రామాల ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపూర్ గ్రామశివారులో ఉన్న చేపల చెరువుకు కృష్ణమ్మ పోటెత్తడంతో చెరువు నిర్వాహకుడు వరదలో చిక్కుకుపోయాడు. అధికారులు నాటుపడవ మీద అతన్ని ఒడ్డుకు చేర్చారు. పరీవాహక గ్రామాల్లో మిగతా 2వ పేజీలో ▶

### ముమ్మరంగా సహాయక చర్యలు

వరద ముప్పుతో నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తమయ్యారు. ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇటిక్యాల మండలంలో కృష్ణా నది పరీవాహక గ్రామాలు కొండపేట, యక్తాపురం, గార్లపాడు లోతట్టు గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ముందే ఇళ్లు ఖాళీ చేసి బంధువుల వద్దకు వెళ్లారు. కృష్ణ మండలం హిందూపూర్, వాసునగర్ వాసులకు కున్సి గ్రామం వద్ద పునారావసం కలిపించారు. కృష్ణ, మాగనూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో పశు వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు.



ఆదివారం చెన్నైలో అమిత్ షా, రజనీకాంత్‌ల ఆత్మీయ పలకరింపు

## ఉగ్రవాదాన్ని పెకలిస్తాం

- చెన్నైలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్య
- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సందేశాలతో ‘లిజనింగ్ లెర్నింగ్ లీడింగ్’ పుస్తకావిష్కరణ
- కార్యక్రమానికి హాజరైన సూపర్‌స్టార్ రజనీకాంత్
- కశ్మీర్ వ్యవహారంపై అమిత్ షాకు అభినందనలు
- ప్రధాని మోదీ, అమిత్ షా కృష్ణార్జునులని ప్రశంస

-5 లో

## 24 రెట్లు పెరిగిన సీబీఎస్‌ఈ పరీక్ష ఫీజు

- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) 10వ, 12వ తరగతుల ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పరీక్ష ఫీజును 24 రెట్లు అంటే ప్రస్తుతమున్న రూ.50 నుంచి అమాంతం రూ.1,200కు పెంచింది. జనరల్ కేటగిరీ విద్యార్థుల ఫీజును రూ.750 నుంచి రూ.1,500గా నిర్ణయించింది. - 5లో











ఆత్మీయ సత్కారం

ఆదివారం హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు కె. విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి

## మీరు సినిమా తీస్తే నేనే నిర్మిస్తా!

### కళాతపస్వి విశ్వనాథ్‌తో సీఎం కేసీఆర్

- విశ్వనాథ్ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి
- సమాజానికి మంచి సందేశం అందించే చిత్రం తీయాలని ఆకాంక్ష
- కేసీఆర్ రాకతో తన ఇల్లు పావనమైందన్న దర్శకుడు
- కుచేలుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్టుగా ఉందని వ్యాఖ్య
- మంచిపనులు చేసే కేసీఆర్‌కు దేవుని కృప ఉంటుందని ఆశీర్వాదం
- త్వరలోనే కొత్త సినిమా పాలసీ తెస్తామన్న సీఎం

2 లో

“నేను మీ అభిమానిని. చిన్నప్పటి నుంచి మీ సినిమాలంటే చాలా ఇష్టం. మీరు తీసిన ప్రతీ సినిమా చూశా. శంకరాభరణం అయితే 25 సార్లకు పైగా చూసి ఉంటా. దాదాపు అన్ని సినిమాలు అలాగే చూశా. సినిమా చూసిన ప్రతీసారి మిమ్మల్ని ఓసారి కలవాలనిపించేది. ఇన్నాళ్లకు ఆ కోరిక తీరింది. మీపై ఉన్న అభిమానమే నన్ను మీ దగ్గరకి తీసుకొచ్చింది. మిమ్మల్ని కలవడం, మీతో మాట్లాడటం అదృష్టంగా భావిస్తున్నాను.

- కేసీఆర్

## సాగర్ @ 202 టీఎంసీలు

- ప్రాజెక్టులోకి ప్రస్తుతం 6.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- సోమవారానికి 8.60లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం
- రెండు, మూడ్రోజుల్లో పూర్తి స్థాయి నీటిమట్టానికి..
- కృష్ణా, భీమా, తుంగభద్ర నదుల వరదతో జూరాలకు రికార్డు ప్రవాహాలు
- మరో 15 రోజులు కృష్ణా నదికి భారీ వరదలు కొనసాగే అవకాశం

4 లో






ఇదండీ సంగతి



...మీరెటు పోతే నేనూ అటే!



## తెలంగాణ ఏర్పాటు మీకు ఆమోదయోగ్యం కాదా?

- కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్
- ఏర్పాటు ప్రక్రియను ఎందుకు విమర్శిస్తున్నారు..
- సంస్థాగత ఎన్నికల వరకు సోనియానే కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు: కుంతియా

- వివరాలు 4లో

## అక్టోబర్‌లో ఓటర్ల జాబితా సవరణ

- 2020 జనవరి 1 అర్హత తేదీగా కార్యక్రమం
- అక్టోబర్ 15న ముసాయిదా జాబితా
- నవంబర్ 30 వరకు ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం - 14లో





## మళ్లీ అణ్వాయుధ పోటీ!

- రష్యాతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్న అమెరికా
- క్షిపణి పరీక్షలతో అగ్రరాజ్యాన్ని బెంబేలెత్తిస్తున్న ఉత్తర కొరియా
- చైనా కంట్లో నలుసులా మారిందని ట్రంప్ అసహనం
- భారత్, పాక్ మధ్య కశ్మీర్ మంటలు - వివరాలు 5లో

## క్లుప్తంగా...

### గవర్నర్ బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: బక్రీద్ పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ముస్లింలకు గవర్నర్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ అపార ప్రాముఖ్యతను కలిగి ఉందని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. త్యాగం, దేవునిపట్ల నిజమైన విశ్వాసం, పేదల పట్ల కరుణలకు ప్రతీకగా బక్రీద్ పర్వదినం నిలుస్తుందని గవర్నర్ వెల్లడించారు.

### కరుణకు ప్రతీక: కేసీఆర్



బక్రీద్ పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతిరూపంగా ప్రవక్త గొప్ప బోధనలను ఈ పర్వదినం గుర్తు చేస్తుందని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. త్యాగస్ఫూర్తి, కరుణ, సహనానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందని, బక్రీద్‌ను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, హోంమంత్రి మహమూద్‌అలీ కూడా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తి ప్రపత్తులతో, సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆయన ముస్లింలకు పిలుపునిచ్చారు.

### త్యాగం, సహనం బక్రీద్ సందేశాలు

**ఏపీ సీఎం జగన్ బక్రీద్ శుభాకాంక్షలు**



సాక్షి, అమరావతి: ముస్లిం సోదర సోదరీమణులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని ఆయన అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగను జరుపుకొంటారని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ లభించాలని సీఎం జగన్ ఆకాంక్షించారు.

### ఏసీబీపై దుష్ప్రచారం తగదు

**ఏసీబీ డీజీ పూర్ణచంద్ర రావు**



సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖపై దుష్ప్రచారం చేయడం తగదని ఏసీబీ డీజీ పూర్ణచంద్ర రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీ కేసుల్లో తగిన చర్యలు తీసుకోవడం లేదని తాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎలాంటి లేఖలు రాయలేదని ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. తాను లేఖ రాసినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, శాఖ పనితీరుపైనే తామంతా దృష్టి పెట్టి పని చేస్తున్నామని తెలిపారు.

### ప్రతీ కదలికపై నిఘా నేత్రం: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: నగరంలో ప్రతీ అనుమానాస్పద కదలికను గమనిస్తున్నామని తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదివారం ట్వీట్ చేశారు. మీ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వారి సమాచారం వెంటనే పోలీసులకు అందజేయాలని సూచించారు. సీసీ కెమెరాలతోపాటు, బాధ్యతాయుతమైన పౌరుల ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు అందుతూనే ఉంటుందని తెలిపారు.

### కొచ్చిన్‌కు రాకపోకలు పునఃప్రారంభం

హైదరాబాద్: కేరళలో వరదల కారణంగా రెండ్రోజుల నుంచి శంషాబాద్–కొచ్చిన్ మార్గంలో రద్దయిన విమానాల రాకపోకలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ఈ మార్గంలో ప్రయాణాలు సాగించే పలు విమానాలు వరదలతో రద్దవగా.. వాటిని షెడ్యూల్ సమయానికి ఎప్పటిలాగే నడపనున్నట్లు విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి.

### 'పీజీఈసెట్' వెరిఫికేషన్ గడువు 14కు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహిస్తున్న ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రవేశాల కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

### నేడు ఐసెట్ వెబ్ ఆప్షన్లకు ఆఖరు

సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన ఐసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థులు సోమవారంలోగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ప్రవేశాల కమిటీ తెలిపింది. మొత్తంగా 21,346 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా, అందులో ఇప్పటివరకు 11,624 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారని పేర్కొంది. వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి ఈనెల 14న సీట్లు కేటాయిస్తామని వెల్లడించింది.



నీట మునిగిన హిందూపూర్-కృష్ణ రహదారి



కృష్ణానగర్‌లో వరదలో మునిగిపోయిన పొలాలు



బీచుపల్లి బ్రిడ్జిని తాకుతూ వెళ్తున్న వరద నీరు

# జలదిగ్బంధంలో పాలమూరు

▶ మొదటి పేజీ తరువాయి

ముంపును ఎదుర్కొనేందుకు.. ఆయా జిల్లాల కలెక్టర్లు.. అధికార యంత్రాంగాన్ని పల్లెల్లో మోహరించారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ వరద ఉధృతిపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ఇటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, అలంపూర్, గద్వాల ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తమ పరిధిలో ఉన్న కృష్ణా పరివాహక ప్రాంతాల్లో తిరిగి నీట మునిగిన పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

**పదేళ్ల క్రితం పరిస్థితి పునరావృతం!**

పదేళ్ల తర్వాత నారాయణపూర్ ప్రాజెక్టు నుండి జూరాల ప్రాజెక్టుకు ఇంత భారీమొత్తంలో ఇన్‌ఫ్లో వచ్చింది. అక్టోబర్ 3, 2009న 10.19 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. సరిగ్గా పదేళ్ల తర్వాత మళ్లీ 8.54 లక్షల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆదివారం ఉదయం 6.30 గంటలకు వరద 7.55 లక్షల క్యూసెక్కులు ఉండగా.. మధ్యాహ్నం 3 గంటలకు 8.54 లక్షలకు చేరింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి, భీమానది కలిసి రావడంతో వరద మరింతగా పెరిగింది. దీంతో ప్రాజెక్టులో ఉన్న 63 క్రస్టు గేట్లలో ఒకటి మినహా మిగిలిన 62 గేట్లను పూర్తిగా ఎత్తేశారు. పెరుగుతున్న వరదలతో ప్రభావిత గ్రామాల ప్రజలు 2009లో జరిగిన పంట, ఆస్తి నష్టాన్ని తలుచుకుంటున్నారు.

**తుంగభద్ర ఉధృతితో 11 గ్రామాలకు ముప్పు**

శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు తుంగభద్ర డ్యామ్ నుంచి 2.26లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైంది. సోమవారం సాయంత్రం వరకు రాజోలి మండలం సుంకేసుల బ్యారేజీకి తుంగభద్ర వరద చేరుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆదివారం అలంపూర్ గొందిమల్ల గ్రామంలో ఉన్న కృష్ణా, తుంగభద్ర సంగమం వద్ద రెండు నదులు ఉగ్రరూపం దాల్చాయి. తుంగభద్ర నది పరీవాహక ప్రాంతాలైన ఉండవెల్లి మండలం పుల్లూరు, కలకోట్ల, మిన్నిపాడు, అలంపూర్ మండలంలో అలంపూర్, సింగవరం, మానవపాడు మండలం కొరివిపాడు, మద్దూరు, రాజోలి మండలంలో రాజోలి, తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు, అయిజ మండల పరిధిలోని పుట్కనూరు, రాజాపురం, వేణిసోంపూర్ గ్రామాల ప్రజలకు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

**10వేల ఎకరాల పంట నీటమునక**

గద్వాల మండలం రేకులపల్లి గ్రామశివారులో లోయర్ జూరాల కారణంగా దాదాపు 200 ఎకరాల పండ్ల తోటలు, పత్తి, వరి తదితర పంటలు నీట మునిగాయి. ధరూరు మండలంలో భీంపురం గ్రామానికి చెందిన 150 ఎకరాలలో వరి, పత్తి పంటలు మునిగాయి. ఇటిక్యాల మండలం వీరాపురం, కార్పాకుల, తిమ్మాపురం గ్రామాల్లో 850 ఎకరాల్లో వరి, చెరకు, పత్తి, మిరప, ఉల్లి పంటలు మునిగాయి. పెబ్బేరు మండలంలోని రాంపురం, రంగాపూర్, మునగమాన్‌దిన్నె, పెంచికలపాడు, ఈర్లదిన్నె గ్రామాల్లో వరి, కంది, వేరుశనగ, పంటలతో పాటు వరినారుమడులు నీట మునిగాయి. 49 ఎకరాల్లో పండ్ల తోటలు నీటమునిగాయి. అమరచింత మండలం నందిమల్ల గ్రామంలో సుమారు 50 ఎకరాల వరిపంట నీట మునిగింది. ఆత్మకూరు మండలంలోని రేచింతల, ఆరేపల్లి, మాలమల్ల, కత్తెపల్లి, తూంపల్లి, జూరాల గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. నారాయణపేట జిల్లా కృష్ణా పరీవాహక మండలాల్లో 4 వేలకు పైగా వరి, పత్తి పంటలు నీటమునిగాయి. కృష్ణా, మాగనూరు మండలాల పరిధిలోని వాసునగర్, హిందూపూర్, మొరహరిదొడ్డి, ముడుమాలు, తంగిడి, పుంజనూరు, మందిపల్లి, కొల్పూరు, గుడెబల్లూరులో 5వేల ఎకరాల్లో పంట మునిగింది.

**హెచ్చరికలు జారీ చేసిన గ్రామాలివే**

జోగులాంబ–గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం వీరాపురం, కార్పాకుల, తిమ్మాపురం గ్రామాలకు వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. వనపర్తి జిల్లా పరిధిలోని కృష్ణా పరీవాహక గ్రామాలైన నందిమల్ల, మూలమల్ల, జూరాల, ఆరేపల్లి, కత్తెపల్లి, తూంపల్లి, రేచింతల, రాంపురం, జనుంపల్లి, పెంచికలపాడు, బూడిదపాడు, తిప్పాయిపల్లి, గుమ్మడం, యాపర్ల, గడ్డబస్వాపురం, బెక్కెం, వెల్టూరు, కాలూరు, చెల్లెపాడు, అయ్యవారిపల్లి, కొప్పునూరు, మునగమాన్‌దిన్నె, ఈర్లదిన్నె ప్రజలకు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కాగా.. హెచ్చరికలు జారీ చేసిన 23 గ్రామాల్లో ఇప్పటి వరకు 11 గ్రామాల్లోని పంట పొలాల్లోకి వరద నీరు వచ్చింది.

### స్తంభించిన రవాణా

కృష్ణా మండలకేంద్రంతో పాటు దాని పరిధిలో ఉన్న వాసునగర్ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కృష్ణా, హిందూపూర్ మధ్యనున్న వంతెన మునిగిపోవడంతో మండలకేంద్రానికి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. హిందూపూర్ గ్రామంలోనూ వరద కారణంగా ఇళ్లన్నీ నీటిలో మునిగాయి. దీంతో ఆయా కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. జోగులాంబ–గద్వాల జిల్లా ధరూరు మండలంలో చింతరేవుల–భీంపురం అదే మండలం బీరోలు, గుర్రంగడ్డ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండలంలోని రేచింతల గ్రామానికి శాఖాపూర్ నుంచి వెళ్లే ప్రధాన రహదారి నీట మునగడంతో రాకపోకలు నిలిచాయి. అమరచింత మండలంలో జూరాల ప్రాజెక్టు వద్ద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రజలెవరూ అటు వైపు వెళ్లకుండా.. కంచె ఏర్పాటు చేశారు. కృష్ణా మండలం తంగిడిలోని శ్రీదత్తభీమేశ్వర ఆలయాన్ని నీరు చుట్టు ముట్టింది. ఆలయంలో చిక్కుకుపోయిన పూజారులను పోలీసులు ఒడ్డుకు చేర్చారు. ఇటిక్యాల మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రం వద్ద శివాలయం, రామాలయంలోకి వరద చేరింది. మక్తల్ మండలంలోని పంచదేవ్‌పహాడ్ వద్ద ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయంలోకి వరద వచ్చేంది.

### హెల్ప్‌లైన్ సెంటర్లు

గద్వాల కలెక్టరేట్‌లో 08546–274007, నారాయణపేట కలెక్టరేట్‌లో 08506–283444 హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఏ సమస్య ఉన్నా వెంటనే ఫోన్ చేయాలని ఇరు జిల్లాల కలెక్టర్లు శశాంక, వెంకట్రావ్ ప్రజలను కోరారు.

# మన ఐఐటీకి కొలువుల పంట!

- క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు అడ్డాగా ఐఐటీ హైదరాబాద్
- 22 మందికి అంతర్జాతీయ కంపెనీల్లో చోటు
- 261 మందికి వివిధ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు



సాక్షి, హైదరాబాద్: క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఐఐటీ–హైదరాబాద్ సత్తాచాటింది. హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులకు ఈ సంవత్సరం అధిక సంఖ్యలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లభించాయి. వివిధ కంపెనీల నుంచి మొత్తంగా 261 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫర్లను పొందగా, అందులో 22 మంది అంతర్జాతీయ కంపెనీల నుంచి భారీ ఆఫర్లను దక్కించుకున్నారు. పరిశోధనలకు ప్రత్యేక ప్రాధాన్యనిస్తూ తనదైన శైలిలో పురోగతి సాధిస్తున్న ఐఐటీ హైదరాబాద్ ఈసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును బీటెక్‌లో ప్రవేశపెట్టిన మొదటి ఐఐటీగా నిలిచింది. దీంతోపాటుగా ఎంటెక్‌లోనూ డేటా సైన్స్ మొదట ప్రవేశపెట్టిన ఐఐటీగా ఘనతను సొంతం చేసుకుంది.

**107 కంపెనీల ద్వారా ప్లేస్‌మెంట్లు**

ఐఐటీ హైదరాబాద్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లను నిర్వహించేందుకు 252 కంపెనీలు నమోదు చేసుకున్నాయి. అందులో ఇప్పటివరకు 107 కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్లను నిర్వహించాయి. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. మెర్కారీ, టయోటా రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ అండ్ అడ్వాన్స్‌డ్ డెవలప్‌మెంట్, వర్క్స్ అప్లికేషన్ అండ్ ఎస్ఎంఎస్ డేటాటెక్ వంటి సంస్థలు క్యాంపస్ ప్లేస్‌మెంట్లను చేపట్టాయి. ప్రస్తుతం ఐఐటీ హైదరాబాద్‌లో 16 విభాగాల్లో దాదాపు 2,855 మంది విద్యార్థులు ఉండగా, ఇంజనీరింగ్, సైన్స్, లిబరల్ ఆర్ట్స్ అండ్ డిజైన్ వంటి విభాగాల్లో 10 బీటెక్ ప్రోగ్రాంలు, 16 ఎంటెక్ ప్రోగ్రాంలు, 3 ఎంఎస్సీ ప్రోగ్రామ్‌లు, ఎంఏ ప్రోగ్రాం, పీహెచ్‌డీ వంటి ప్రోగ్రాంలను నిర్వహిస్తోంది. వాటిల్లో పరిశోధనలకు పెద్దపీట వేస్తూ క్యాంపస్ ప్లేస్‌మెంట్లను పెంచేందుకు, ఇక్కడి విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 50 వర్సిటీలతో ఒప్పందాలు చేసుకుంది. మరోవైపు ఇప్పటికే ఐ–టిక్, సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఫ్యాబ్లెస్ చిప్ డిజైన్ ఇంక్యుబేటర్ అనే మూడు టెక్నాలజీ ఇంక్యుబేటర్లను కూడా ఏర్పాటు చేసింది. గతేడాది ఈ సంస్థ విద్యార్థికి గూగుల్ సంస్థ రూ.1.2 కోట్ల ఆఫర్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## 15న సీఎం వైఎస్ జగన్ అమెరికా పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 15న కుటుంబంతో కలిసి అమెరికా పర్యటనకు వెళుతున్నారు. 24న తాడేపల్లికి తిరిగి వస్తారు. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న తర్వాత అదే రోజు ఆయన హైదరాబాద్ వెళ్తారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో రాత్రికి శంషాబాద్ విమానాశ్రయం నుంచి అమెరికాకు బయలుదేరతారు. సీఎం చిన్న కుమార్తె వర్షా రెడ్డిని అమెరికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ కోర్సులో చేర్పించేందుకు వెళుతున్నారని సమాచారం. 17న డల్లాస్‌లోని కే బెయిలీ హచిసెన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ఉత్తర అమెరికాలోని తెలుగు ప్రజలతో జరిగే ఆత్మీయ సమావేశంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి.

# పుట్టినరోజే మృత్యువాత

**ఉక్రెయిన్‌లో నదిలో పడి హైదరాబాద్ విద్యార్థి మృతి**



హైదరాబాద్: ఇంటర్న్‌షిప్ కోసం హైదరాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి ఉక్రెయిన్ వెళ్లాడు.. అది పూర్తి చేసుకుని తిరిగి రావడానికి టికెట్ కూడా బుక్ చేసుకున్నాడు.. మరికొద్ది గంటల్లో విమానం ఎక్కి ఇంటికి రానున్న తరుణంలో విధి వక్రీకరించింది. పుట్టినరోజునాడే ప్రమాదవశాత్తు నదిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్ నాంపల్లిలోని భాగ్యనగర్‌కాలనీకి చెందిన రాజేందర్‌సింగ్ భాటియా, జస్‌ప్రీత్ కౌర్‌ల కుమారుడు జస్‌ప్రీత్‌సింగ్ భాటియా(21) ముంబైలోని అమిటీ కళాశాలలో బీబీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల 40 రోజుల ఇంటర్న్‌షిప్ కోసం ఉక్రెయిన్ వెళ్లాడు. శనివారం అది పూర్తి కావడంతో హైదరాబాద్ వచ్చేందుకు టికెట్ కూడా బుక్ చేసుకున్నాడు. కొద్ది గంటల్లో నగరానికి బయలుదేరాల్సి ఉండగా.. పుట్టినరోజు కావడంతో స్నేహితులతో కలిసి ఉక్రెయిన్‌లోని ఫియో ఫానియా పార్క్ నది వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందాడు. ఈ విషయాన్ని అతడి స్నేహితులు జస్‌ప్రీత్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. జస్‌ప్రీత్ మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చర్యలు చేపట్టారని తెలంగాణ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమ్రుద్దీన్, వైస్ చైర్మన్ శంకర్‌లూక్ తెలిపారు. ఈ మేరకు ఉక్రెయిన్ అధికారులతో ఆయన మాట్లాడారని వెల్లడించారు.

# కాంగ్రెస్ తీరు మార్చుకోవడం లేదు

**సీనియర్ బీజేపీ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ విమర్శ**

భువనేశ్వర్: గత ఎన్నికల్లో వారసత్వ రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటికీ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదని మధ్యప్రదేశ్ మాజీ సీఎం, సీనియర్ బీజేపీ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ సోనియాగాంధీ, రాహుల్ గాంధీల నాయకత్వాన్నే కోరుకుంటోందని ఆదివారం ఆయన అన్నారు. నాయకులు సహజంగా ఎదగడానికి బీజేపీ ఒక ఉదాహరణగా నిలిచిందని, అయితే కాంగ్రెస్ మాత్రం కుటుంబ రాజకీయాలలోనే మగ్గుతోందని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇప్పటికీ సోనియా, రాహుల్ నాయకత్వాన్ని కోరుకోవడం ఆశ్చర్యంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఏఐసీసీ సాధారణ అధ్యక్షుడిని ఎన్నుకునే వరకు సోనియాగాంధీనే తాత్కాలిక పార్టీ చీఫ్‌గా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శనివారం తీర్మానించిన విషయం విదితమే. సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరప్రదేశ్, బిహార్‌తోసహా ప్రతిచోటా రాజవంశం, కుటుంబ, కుల రాజకీయాల పాలనలో ఉన్న రాజకీయ పార్టీలు ఓడిపోయాయని చౌహాన్ గుర్తుచేశారు.

# మీరు సినిమా తీస్తే నేనే నిర్మిస్తా!

- కళాతపస్వి విశ్వనాథ్‌తో సీఎం కేసీఆర్
- సమాజానికి మంచి సందేశం అందించే చిత్రం తీయాలని ఆకాంక్ష
- విశ్వనాథ్ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి
- కేసీఆర్ రాకతో తన ఇల్లు పావనమైందన్న దర్శకుడు
- కుచేలుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్టుగా ఉందని వ్యాఖ్య
- మంచిపనులు చేసే కేసీఆర్‌కు దేవుని కృప ఉంటుందని ఆశీర్వాదం
- త్వరలోనే కొత్త సినిమా పాలసీ తెస్తామన్న సీఎం

సాక్షి, హైదరాబాద్

ఉన్నత విలువలతో కూడిన ఎన్నో గొప్ప చిత్రాలు తీసిన దర్శకుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో సమాజానికి మంచి సందేశం అందించే మరో చిత్రం రావాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆకాంక్షించారు. విశ్వనాథ్ దర్శకుడైతే, నిర్మాణపరమైన విషయాలు తాను చూసుకుంటానని పేర్కొన్నారు. ఆయన ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని విశ్వనాథ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌తోపాటు ఆయన భార్య జయలక్ష్మి, కుమారుడు రవీంద్రనాథ్, కోడలు గౌరి, దర్శకుడు ఎన్.శంకర్ తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. విశ్వనాథ్ దంపతులను ముఖ్యమంత్రి పట్టువస్త్రాలతో సన్మానించారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులు కూడా సీఎంను సత్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్, విశ్వనాథ్ మధ్య సినిమాలు, సాహిత్యం, భాష తదితర అంశాలపై గంటకుపైగా ఆసక్తికరమైన చర్చ జరిగింది.

**శంకరాభరణం 25 సార్లు చూశా..**

'నేను మీ అభిమానిని. చిన్నప్పటి నుంచీ మీ సినిమాలంటే చాలా ఇష్టం. మీరు తీసిన ప్రతీ సినిమా చూశా. శంకరాభరణం అయితే 25 సార్లకు పైగా చూసి ఉంటా. దాదాపు అన్ని సినిమాలు అలాగే చూశా. సినిమా చూసిన ప్రతీసారి మిమ్మల్ని ఓసారి కలవాలనిపించేది. ఇన్నాళ్లకు ఆ కోరిక తీరింది. మీరు తీసే ప్రతీ సినిమా ఓ కావ్యంలాగా ఉంటుంది. మీరు సినిమాలను తపస్సుతో తీస్తారు. అందులో వాడే భాష, పాటలు, కళాకారుల ఎంపిక, సన్నివేశాల చిత్రీకరణ, సంభాషణలు.. ఇలా ప్రతీదీ గొప్పగా ఉంటాయి. కుటుంబమంతా కూర్చుని చూసేలా ఉంటాయి. అందుకే ఇప్పటికీ వీలు దొరికితే మీ సినిమాలు చూస్తాను. మీపై ఉన్న అభిమానమే నన్ను మీ దగ్గరకి తీసుకొచ్చింది. మిమ్మల్ని కలవడం, మీతో మాట్లాడడం అదృష్టంగా భావిస్తున్నాను. మీ సినిమాలు రాక పదేళ్లయింది. సందేశాత్మక, గొప్ప సినిమాలు ఈ మధ్య రావడంలేదు. మీరు మళ్లీ సినిమా తీయాలి. సహాయకుల ద్వారా మీ మార్గదర్శకత్వంలో సినిమా తీద్దామంటే నిర్మాణ బాధ్యతలు స్వీకరించడానికి నేను సిద్ధం. దయచేసి దీని కోసం ప్రణాళిక సిద్ధం చేయండి'అని కళాతపస్విని ముఖ్యమంత్రి కోరారు.

**గొంతు మార్చి మాట్లాడారని అనుకున్నా..**

'మీరు అడుగు పెట్టడంతో మా ఇల్లు పావనమైంది. మీరే స్వయంగా మా ఇంటికి రావడం మా అదృష్టం. రాత్రి మీరు నాతో ఫోన్లో మాట్లాడి ఇంటికి వస్తున్నానని చెబితే.. ఎవరో గొంతు మార్చి మాట్లాడుతున్నారని అనుకున్నాను. మీరే మాట్లాడారని తెల్సుకున్నాక రాత్రి 12 గంటల వరకు నిద్ర పట్టలేదు. మీరు చేసే పనులను, ప్రజల కోసం తపించే మీ తత్వాన్ని టీవీల్లో, పత్రికల్లో చూస్తున్నాను. నేరుగా చూడడం ఇదే మొదటిసారి. చాలా సంతోషంగా ఉంది. గతంలో మీలాగే ఒకసారి తమిళనాడు సీఎంగా ఉన్నప్పుడు ఎంజీఆర్ మాట్లాడారు. మళ్లీ మీ అంతటివారు మా ఇంటికి రావడం నిజంగా సంతోషంగా ఉంది'అని విశ్వనాథ్ సీఎంతో చెప్పారు.



కె. విశ్వనాథ్ కుటుంబ సభ్యులతో సీఎం కేసీఆర్

**ఆపరేషన్ అంటే భయం**

విశ్వనాథ్ తన ఆరోగ్య పరిస్థితి గురించి కేసీఆర్‌కు వివరిస్తూ.. 'ఆరోగ్యం బాగానే ఉంది. కానీ మోకాళ్ల నొప్పులున్నాయి. ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు అంటున్నారు. కానీ నాకు ఆపరేషన్ అంటే భయం. అసలు హాస్పిటల్ అంటేనే భయం. నా సినిమాల్లో కూడా ఎక్కడా ఆసుపత్రి సీన్లు పెట్టను. రక్తం అంటే భయం. ఇక ఆపరేషన్ ఏమి చేయించుకుంటాను. ఇలాగే గడిపేస్తా'అని కేసీఆర్‌కు తెలిపారు.

**తెలుగు మహాసభలు చక్కగా నిర్వహించారు**

తెలుగు భాష, సాహిత్యంపై కేసీఆర్‌కు చాలా పట్టు ఉందని, ప్రపంచ తెలుగు మహాసభలను చక్కగా నిర్వహించారని విశ్వనాథ్ కితాబిచ్చారు. 'తెలుగు మాట్లాడడమే కాదు.. మంచి కళాభిమానిగా గుర్తింపు పొందారు. అసలు మీకు సాహిత్యాభిలాష ఎలా పుట్టింది'అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఇందుకు ముఖ్యమంత్రి బదులిస్తూ.. తన గురువుల సాంగత్యం గురించి విశ్వనాథ్‌కు వివరించారు.

### మీ తపన విజయవంతమవుతుంది

విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి కూడా కేసీఆర్‌కు తన అభిప్రాయాలు చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పగా కట్టారు. రైతుల కష్టాలు తీరతాయి. కాళేశ్వరం నీళ్లు వస్తున్నప్పుడు మీ కళ్లల్లో ఎంతో ఆనందం చూశాను. నిజంగా చాలాగొప్ప ప్రాజెక్టు. రైతులకు సాగునీరు ఇవ్వాలనే మీ తపన విజయవంతమవుతుంది'అని చెప్పారు. గోదావరి, కృష్ణా నదుల్లో పుష్కలమైన నీళ్లున్నాయని.. వాటిని సరిగ్గా వాడుకుంటే రెండు రాష్ట్రాల రైతులకు మేలు కలుగుతుందని, ప్రస్తుతం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అదే పనిలో ఉన్నాయని కేసీఆర్ ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ కలుగజేసుకుని.. చాలా కష్టపడి ప్రాజెక్టులు కడుతున్నా మీకు విమర్శలు తప్పడంలేదు కదా.. ఎలా భరిస్తున్నారని సీఎంను ప్రశ్నించారు. రాజకీయాల్లో అన్నీ అలవాటై పోయాయని, ప్రజల కోసం వాటిని పెద్దగా పట్టించుకోకుండానే పనిచేసుకుని వెళ్లిపోతున్నానని బదులిచ్చారు. ప్రజల కోసం చేసే పనికి దైవ కృప ఉంటుందని, అది మీకు కూడా ఉంటుందని విశ్వనాథ్ సీఎం కేసీఆర్‌ను దీవించారు. హైదరాబాద్‌లో సినిమా పరిశ్రమ ఇంకా బాగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని, ప్రభుత్వం కూడా త్వరలోనే సినిమా పరిశ్రమ కోసం కొత్త పాలసీ తెస్తుందని కేసీఆర్ ఆయనకు తెలిపారు. అనంతరం విశ్వనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి కేసీఆర్ గ్రూప్ ఫోటో దిగారు. సీఎం వెంట మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

### కేసీఆర్‌కు అజ్ఞాత అభిమానిని

సీఎం కేసీఆర్ మర్యాదపూర్వకంగానే తన ఇంటికి వచ్చారని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని విశ్వనాథ్ స్పష్టంచేశారు. కేసీఆర్ కలిసి వెళ్లిన తర్వాత విశ్వనాథ్ మాట్లాడుతూ.. తనను ఓ అభిమానిగా ఆయన కలిశారని చెప్పారు. కేసీఆర్‌కు తాను అజ్ఞాత అభిమానినని చెప్పడాన్ని గర్వంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కుచేలుడి ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చినట్టుగా కేసీఆర్ తన ఇంటికి వచ్చారని వ్యాఖ్యానించారు. ఇరువురి మధ్య సాహిత్యానికి సంబంధించిన అంశాలపై చర్చ జరిగిందని తెలిపారు. కేసీఆర్‌లో ఇన్ని కోణాలు ఉన్నాయని తాను అనుకోలేదని, ఆయన మాటల వింటుంటే తనకు ఆశ్చర్యం కలిగిందని వెల్లడించారు. తన ఆరోగ్యం బాగుందని, ఇకపై తాను సినిమాలు తీయబోనని విశ్వనాథ్ స్పష్టంచేశారు.



# జీవజలం..

## కార్పొరేషన్లలో రోజూ మిలియన్ గ్యాలన్ల నీటి సరఫరా

## జనాభా పెరుగుతుండటంతో తప్పని కొరత

ఆహారం లేకుండా రెండుమూడు రోజులైనా ఉండగలమేమో గానీ.. నీరు తాగకుండా ఉండటం కష్టం. ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ 4 నుంచి 5 లీటర్ల నీరు తాగాలని వైద్యులు చెబుతుంటారు. తాగడానికే కాదు.. ఎన్నో రకాల అవసరాలకు మనకు నీరు విని యోగం తప్పదు. పల్లెల్లో ఎలా ఉన్నా.. పట్ట ణాల్లో మాత్రం రోజూ వేల లీటర్లు కావాలి. ఇక హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి కార్పొరేషన్లలో అయితే మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం. రాష్ట్రంలోని ఆరు కార్పొరేషన్లలో రోజూ ఆయా వాటర్ బోర్డులు ప్రజలకు అవసరమైన మేర నీటి సరఫరా చేస్తున్నాయి. అయినా కొన్ని చోట్ల మాత్రం కొరత తప్పడం లేదు. రోజురోజుకు నగర జనాభా పెరుగుతుండటంతో అంత మందికి నీటి సరఫరా కత్తిమీద సాము లాంటిదే... కార్పొరేషన్లలో నీటి సరఫరా తీరుపై ఓ లుక్కేస్తే....

**గ్రేటర్ హైదరాబాద్...**



8,564 మొత్తం పబ్లిక్ నల్లాలు | 1.25 కోట్లు మొత్తం జనాభా..

**వరంగల్..**



3,606 మొత్తం పబ్లిక్ నల్లాలు | 8.19 లక్షలు మొత్తం జనాభా..

**నిజామాబాద్**



350 పబ్లిక్ నల్లాలు | 3.11 లక్షలు జనాభా..

**కరీంనగర్**



350 పబ్లిక్ నల్లాలు | 3.5 లక్షలు జనాభా..

**రామగుండం**



0 పబ్లిక్ నల్లాలు | 2.29 లక్షలు జనాభా..

**ఖమ్మం**



443 పబ్లిక్ నల్లాలు | 4.2 లక్షలు జనాభా..






ఆదివారం సాగర్ ఎడమ కాల్వ నుంచి విడుదలైన కృష్ణమ్మకు పూజలు నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఏపీ మంత్రి అనిల్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



విడుదలవుతున్న నీరు

# రెండు పంటలకు ఢోకా లేనట్లే!

- భారీగా వరదతో గంటకో అడుగు చొప్పున పెరుగుతున్న సాగర్ మట్టం
- సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసిన జగదీశ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్
- నదుల అనుసంధానంపై ఇరు రాష్ట్రాల సీఎంల ప్రయత్నంపై ప్రశంసలు
- నేడు సాగర్ గేట్లు ఎత్తే అవకాశం

**నాగార్జునసాగర్:** కృష్ణా, గోదావరి బేసిన్లు కొత్తనీటితో కళక ళ్లాడుతున్నాయి. రెండు రాష్ట్రాల రైతులకు.. రెండు పంట లకు సరిపోయేంతనీరు జలాశయాల్లోకి చేరుతోందని తెలంగాణ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఆంధ్రప్రదేశ్ భారీనీటిపా రుదల శాఖామంత్రి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం కృష్ణ మ్మకు సారెచీరలతోపాటు పూలమాలలు, పసుపు కుంకు మతో వాయినమిచ్చారు. సీఎం కేసీఆర్ కృష్ణా, గోదావరి నదుల్లోని ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి తెలంగాణలోని బీడు భూములను సస్యశ్యామలం చేస్తున్నారని చెప్పారు. పక్కరాష్ట్రాలతో స్నేహపూర్వకంగా మెలిగి అభివృద్ధి చెందడం ఎలాగో సీఎం కేసీఆర్ ఆచరించి చూపారని పేర్కొన్నారు. కలిసిమెలిసి ఉంటూ.. సహజవనరులను సద్వినియోగం చేసుకుని ఇరురాష్ట్రాల రైతాంగానికి లబ్ధిచే కూరేలా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. భవిష్యత్‌లో తాగు, సాగునీటికి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నదుల అనుసంధానానికి ఇరు రాష్ట్రాల సీఎంలు నడుంబి గించారన్నారు.

**కలిసిఉంటే కలదు సుఖం: అనిల్ కుమార్**

ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ సీఎం కేసీఆర్‌లిద్ద రు.. కలిసి ఉంటే కలదు సుఖం అని నిరూపించారని ఏపీ భారీనీటి పారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. అభివృద్ధికి ఇది శుభపరిణామమన్నారు. సముద్రంలో వృధాగా కలిసి పోయే నీటిని సద్వినియోగం చేసుకోవడం సంతోషదాయకమన్నారు. సాగర్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరుతోందని త్వరలోనే నిండుతుంద న్నారు. ఈ పరిణామాలతో ఇరు రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకుపోయి.. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు.

**ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు కూడా..**

నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం గణపురం సమీ పంలోని ఏఎమ్మార్పీ ప్రధాన గేటు నుంచి ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గుంటకండ్ల జగదీ శ్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. పెద్దవూర మండలంలోని పూల్యాతండా సమీపంలోని పంప్‌హౌజ్ ద్వారా ఏఎమ్మా ర్పీ లో–లెవల్ వరద కాల్వకు 320 క్యూసెక్కుల నీటిని విడు దల చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాపరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయా దవ్, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, నల్లబోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి బ్యారేజీలో 65 గేట్ల ఎత్తివేత

**కాళేశ్వరం:** మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాల కారణంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదే వపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరికి వరద ఆది వారం నిలకడగా 9.39 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తోంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మి (మేడిగడ్డ) బ్యారేజీ, సరస్వతి (అన్నారం) బ్యారేజీల్లో గేట్లు ఎత్తడంతో నీరు దిగువకు తరలిపోతోంది. లక్ష్మి బ్యారే జీలో 65 గేట్లు ఎత్తిగా దిగువకు 3.26 లక్షల క్యూసె క్కుల వరద వెళ్తోంది. ఇన్‌ఫ్లో 3.26 లక్షల క్యూసెక్కు లుగా ఉంది. సరస్వతి (అన్నారం) బ్యారేజీలో మానేరు, సుందిళ్ల (పార్వతి) బ్యారేజీల నుంచి వచ్చే వరదతో ఉధృతి పెరిగింది. సరస్వతీ బ్యారేజీలో 5 గేట్లు ఎత్తగా దిగువకు 22,655 క్యూసెక్కుల వరద పోతోంది. ఇన్‌ఫ్లో 23,964 వేల క్యూసెక్కులుగా ఉంది.

**సాగర్‌కు భారీగా పెరిగిన వరద**

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువన ఉన్న నాగార్జున సాగర్ జలాశయానికి లక్షల క్యూసెక్కుల వరద నీటిని మోసుకొస్తోంది. మూడు రోజుల్లోనే భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సాగర్ రిజర్వాయర్‌లో గంటకో అడుగు చొప్పున గణనీ యంగా నీటిమట్టం పెరుగుతుండటంతో సోమవారం గేట్లు ఎత్తనున్నట్లు తెలిసింది. తెలంగాణ, ఏపీ మంత్రులు శాస్త్రో క్తంగా పూజలు చేసి రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు సమాచారం.

## ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో నారాయణ హవా

**సాక్షి, హైదరాబాద్:** హంగేరీలో నిర్వహించిన 13వ ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజి క్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులు సత్తాచాటినట్లు ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరె క్టర్ సింధూర నారాయణ ఓ ప్రకటనలో తెలి పారు. ఈ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు ఆదర్శ్ రెడ్డి, సాయితేజ వెండి, కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందించారు.

## బాలికపై సామూహిక లైంగిక దాడి

- ఆత్మహత్య చేసుకున్న బాధితురాలు
- పోలీసుల అదుపులో నిందితులు

**హసన్‌పర్తి:** పద్నాలుగు ఏళ్ల బాలికపై ముగ్గురు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడటంతో అవమానం భరించలేక ఆ బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం వరంగల్‌లోని సమ్మయ్యనగర్‌లో చోటుచేసు కుంది. లైంగిక దాడికి పాల్పడిన వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు స్థానికులు చెబు తున్నారు. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సమ్మ య్యనగర్‌కు చెందిన వెన్నెల (14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. శనివారం ఓ యువకుడు బాలికను బెదిరించి బైక్‌పై తీసుకెళ్లినట్లు బాధితురాలి నాన్నమ్మ లక్ష్మి తెలిపింది. సాయంత్రం 4.30 గంటలకు ఇంటికి వచ్చిన బాలిక అపస్మారక స్థితికి చేరుకుంది. బాలికను బైక్‌పై తీసుకెళ్లిన యువకుడు బెదిరించి మామిడి తోటలోకి తీసుకెళ్లి మత్తు ఇంజక్షన్ ఇచ్చి లైంగిక దాడికి పాల్ప డినట్లు వెన్నెల తెలిపినట్లు లక్ష్మి వివరించింది. ఆదివారం ఉదయం 7 గంటల స మయంలో నాన్నమ్మ లక్ష్మి బయటకు వెళ్లి పాల ప్యాకెట్ తీసుకుని వచ్చే సరికి వెన్నెల చీరతో ఉరేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దర్యాప్తులో బాలికను బైక్‌పై తీసుకెళ్లిన యువకుడిని పోలీసులు పట్టుకుని విచారించగా మరో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు తెలిసింది. మొత్తం ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచా రించగా తామే లైంగిక దాడికి పాల్పడినట్లు అంగీకరించినట్లు సమాచారం.

# మీ స్ఫూర్తే మాకు మార్గదర్శనం..

- మీ బాటలో పయనించే తెలంగాణ సాధించాం..: హరీశ్
- రాష్ట్రంలోనే తొలిసారి 1969 ఉద్యమకారుల సన్మాన కార్యక్రమం
- ప్రపంచంలోనే తెలంగాణ ఉద్యమం ప్రత్యేకమైందన్న మాజీ మంత్రి
- ఆచార్య జయశంకర్ ఆశయాన్ని సీఎం కేసీఆర్ నెరవేర్చారని వ్యాఖ్య

**ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట):** 'మీరు నాడు తొలిదశ తెలం గాణ ఉద్యమంలో చూపిన పోరాట స్ఫూర్తే మాకు మలి దశ తెలంగాణ ఉద్యమంలో దివ్య ఔషధంలా పని చేసిం ది. మీరు చూపిన బాటలోనే పయనించి తెలంగాణ సాధించాం..'అని 1969 తెలంగాణ ఉద్యమకారులను ఉద్దేశించి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ శ్‌రావు అన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం జరిగి 50 ఏళ్లు ముగిసిన సందర్భంగా నాటి ఉద్యమకారులను ఆది వారం ఘనంగా సన్మానించారు. సిద్దిపేట పట్టణంలో 'సమర స్ఫూర్తికి స్వర్ణోత్సవం'పేరిట జిల్లాకు చెందిన 70 మంది 1969 ఉద్యమకారులను ఘనంగా సన్మానిం చారు. అంతకుముందు పట్టణంలోని జయశంకర్ విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. అనంతరం సభలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపానికి, తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న హరీశ్‌రావు, ఫారుఖ్‌హుస్సేన్, దేవీప్రసాద్, నందిని సిధారెడ్డి, రామలింగారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు

**వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనదే**

అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. నాడు 1919లో నిజాం సర్కార్ హయాంలోనే నాన్‌ముల్కి ఉద్యమం ద్వారా తెలంగాణ ఆకాంక్షను నాటి ఉద్యమకారులు వెలువరిం చారని, అనంతరం 1952లో ఈ ఉద్యమ సెగలు పెరి గాయని చెప్పారు. 1969లో మరింత ఉధృతమైన ఉద్యమం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే దాకా ఆగలేద న్నారు. 1969లో 369 మంది ఉద్యమకారులు మరణిం చారని అధికారిక లెక్కలున్నా అంతకంటే ఎక్కువ మందే మరణించారని చెప్పారు. ఆ ఉద్యమకారుల్లో కొంత మందే నేడు జీవించి ఉన్నారని వారిని గౌరవించుకోవా ల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని, అన్నింటి కంటే తెలంగాణ ఉద్యమం ప్రత్యేకమైందన్నారు.

### ఉద్యమానికి వెలుగురేఖగా సిద్దిపేట

నాటి పాలకులు ప్రాంతీయ విభేదాలు చూపడం తోనే ఈ ఉద్యమం ఎగిసిపడిందని.. నీరు, నియామకా లు, నిధుల కోసమే ఈ పోరాటం జరిగిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాన్ని సీఎం కేసీఆర్ నెరవేర్చారన్నారు. ఎస్‌ఆర్‌సీ, శ్రీకృష్ణ కమిటీలకు తెలంగాణ ఆవశ్యకతను తెలుపుతూ జయ శంకర్ నివేదికలను అందించారని, దాంతో ప్రపంచం లో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ఉద్యమానికి పేరొ చ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేట వెలు గురేఖగా దిశను చూపించిందన్నారు. హైదరాబాద్ ఫ్రీజోన్, నిరాహార దీక్షలతో సిద్దిపేట ప్రాంత ప్రజలు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. 1969 తెలంగాణ ఉద్యమకారులను గౌరవించటం రాష్ట్రంలో నే తొలిసారని, ఇది తన ఆధ్వర్యంలో జరగడం చాలా ఆనందంగా ఉందని హరీశ్ చెప్పారు. 1969 చరిత్ర సిద్దిపేట జిల్లా అనే పుస్తకాన్ని ముద్రించాలని ఆయన ముఖ్యమంత్రి ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డిలను కోరారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్‌హుస్సేన్, సరోత్తంరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, బెవరేజ్ చైర్మన్ దేవీప్రసాద్, ఎలక్షన్‌రెడ్డి టీఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సూడా చైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఇండియన్ రైల్వే క్యాటరింగ్ & టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ సంస్థ - మినీ రత్న కేటగిరి - I)
**సౌత్ సెంట్రల్ జోన్**
#9-1-129/1/302, 3వ అంతస్తు ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, SD రోడ్, సికింద్రాబాద్ - 500003
CIN:U74899DL1999GOI101707

**ఇ-టెండరు కోరుతూ ప్రకటన**

GGM/SCZ వారు దిగువ తెలిపిన ఇ-టెండర్లు కోరుతున్నారు:

A. ఇ–టెండరు నం.IRCTC/SCZ/1/NIT/FFU-FP/2019/01 (2 ప్యాకెట్ విధానం క్రింద)నంద్యాల రైల్వే స్టేషన్ వద్ద ఫుడ్ ప్లాజా మరియు మలక్‌పేట, గిద్దలూరు, ఫలక్‌నుమా, చిత్తూరు, రేపల్లె, గుడివాడ, బలుగాం, టిట్లాఘర్, బర్గర్ రోడ్ మరియు మంత్రాలయం రైల్వే స్టేషన్ల వద్ద ఫాస్ట్ ఫుడ్ యూనిట్స్ ఏర్పాటు కోసం.
**ఇ–టెండరు ఆన్‌లైన్ దాఖలు కోసం ఆఖరి తేది & సమయం: 04–09–2019న 15.00 గం॥**

B. ఇ–టెండరు నం. IRCTC/SCZ/1/NIT/TSV/2019/01 (2వ ప్యాకెట్ విధానం క్రింద) IRCTC- సౌత్ సెంట్రల్ జోన్‌లో BZA-GNT-DHNE, BZA-BPQ, BZA-MAS, BZA-VSKP, NED-MMR, PAU-AK & PBN-PRLI, RU-WADI, SC-DHNE,SC-KZJ & SC-NDKD-GNT, SC/HYB-WADI & VKB-PRLI, SC-NED (NZB-KRMR), VZM-MSMD, RGDA-JDB/GNPR, TIG-SBP-JSG, BRAG/CTC-SBP) మరియు NGP-R-BSP-MSMD, JSG-ANP-SDL-KRBA సెక్షన్స్ వద్ద ట్రెయిన్ సైడ్ వెండింగ్ సర్వీసెస్ కాంట్రాక్టులు ఇచ్చేందుకు.
**ఇ–టెండరు ఆన్‌లైన్ దాఖలు కోసం ఆఖరి తేది & సమయం: 09–09–2019న 15.00 గం॥**

C. వరంగల్, ఔరంగాబాద్, గుంటూరు, తిరుపతి, కడప, నిజామాబాద్, నాందేడ్ సంబల్‌పూర్, విజయనగరం, రాయ్‌పూర్, దుర్గ్, గోండియా, రాయ్‌ఘర్ మరియు బందర రోడ్ రైల్వే స్టేషన్ల వద్ద రెఫ్రెష్‌మెంట్ రూమ్స్‌లో మరియు ధర్మవరం మరియు శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్స్ వద్ద జన్ ఆహార్‌లో కేటరింగ్ సర్వీసుల ఏర్పాటు మరియు ఆపరేషన్స్ మరియు నిర్వహణ కోసం సర్వీస్ ప్రొవైడర్ నియామకానికి ఇ–టెండరు.
**ఇ–టెండరు ఆన్‌లైన్ దాఖలు కోసం ఆఖరి తేది & సమయం: 17–09–2019న 15.00 గం॥**

వెబ్‌సైట్ <www.tenderwizard.com/IRCTC> లో
టెండరు డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు పాల్గొనవచ్చును.

పైన తెలిపిన ప్రకటన పైన ఏదైనా సవరణ/ అనుబంధం జారీచేయబడితే అది వెబ్‌సైట్ www.irctc.com మరియు www.tenderwizard.com/IRCTC లో మాత్రమే ప్రచురించబడును. దీని కోసం వార్తపత్రికలో ప్రెస్ అడ్వర్టయిజ్‌మెంట్ జారీచేయబడదు.

# మెడికల్ కాలేజీలుగా ఆస్పత్రులు

- జిల్లా దవాఖానాలకే అనుబంధంగా కాలేజీలు
- 75 కాలేజీలు ప్రారంభించాలని కేంద్రం నిర్ణయం... దరఖాస్తులకు ఆహ్వానం
- కరీంనగర్, ఖమ్మం దవాఖానాలకు అవకాశం!

**సాక్షి, హైదరాబాద్:** దేశంలో కొత్తగా 75 మెడి కల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంత పెద్ద మొత్తంలో కాలేజీలు, వాటి అనుబంధంగా ఆస్పత్రులు ఏర్పాటు చేయాలంటే భారీగా నిధులు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న జిల్లా దవాఖానాలకే అనుబంధం గా కాలేజీలు ఏర్పాటు చేయాలని భావిస్తు న్నారు. ఇందుకోసం ఇంతకుముందే 82 హాస్పి టళ్లను గుర్తించిన కేంద్రం, తాజాగా మరో 75 హాస్పిటళ్లను గుర్తించేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందుకు సంబంధించిన నిబంధనలను సైతం విడుదల చేసింది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల నుంచి దరఖాస్తు లను స్వీకరిస్తోంది. ఇందులో తెలంగాణలోని కరీంనగర్, ఖమ్మం జిల్లా హాస్పిటళ్లను కూడా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఇటీవల ఢిల్లీకి వెళ్లి, కాలేజీలుగా తీర్చిదిద్దేందుకు ఈ రెండు హాస్పిటళ్లకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు వివరించారు. కాలేజీల ఏర్పాటుకు ఈ రెండు జిల్లాల్లో ఉన్న వనరులను, అవసరాన్ని తెలియ జేస్తూ ఓ నివేదిక సమర్పించారు. కేంద్ర మంత్రి సైతం సానుకూలంగా స్పందించినట్టు వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. కాలేజీల ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో 75 శాతం కేంద్రమే భరిస్తుంది. 25% ఆయా



రాష్ట్రాలు భరించాల్సి ఉంటుంది. ఇక ఈశాన్య రాష్ట్రాలు, ప్రత్యేక కేటగిరీ ఉన్న రాష్ట్రాల్లోనైతే 90% నిధులను కేంద్రమే భరిస్తోంది. ప్రస్తుతం మెడికల్ కాలేజీలు లేని జిల్లాల్లో మాత్రమే కాలే జీల ఏర్పాటుకు సహకరించాలని కేంద్రం నిర్ణ యించింది. మన రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వరంగల్, మెదక్ (సిద్దిపేట) జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఇదివరకే ఉన్నాయి. ఈ ఏడాది నుంచి నల్లగొండ, సూర్యాపేటలోనూ కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీలు లేనిది కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో మాత్రమే. అయితే, రంగా రెడ్డి జిల్లాలో ఆరేడు ప్రైవేటు మెడికల్ కాలే జీలు, పక్కనే ఉన్న హైదరాబాద్‌లో ఉస్మా నియా, గాంధీ రూపంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కరీంన గర్, ఖమ్మం జిల్లా దవాఖానాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి అనుబంధంగా కనీసం 300 బెడ్లు ఉన్న హాస్పి టల్ అవసరం. ఈ రెండు దవాఖానాల్లోనూ 400లకుపైగా బెడ్లు ఉన్నాయి. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో కలిపి సుమారు 65 లక్షల మంది ప్రజలు జీవిస్తున్నారు. ఏ రకంగా చూసినా ఖమ్మం, కరీంనగర్ దవాఖానాలు కాలేజీలుగా తీర్చిదిద్దేందుకు అర్హమైనవేనని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

vedanta
transforming elements

NATIONAL COMPETITIVE BIDDING (NCB) FOR

PROVISION OF SUPPLY BASE AT KAKINADA

RAVVA BLOCK, ANDHRA PRADESH, INDIA

CAIRN
Cairn Oil & Gas
www.cairnindia.com
Cairn Oil & Gas, a vertical of Vedanta Limited
Registered Office: Vedanta Limited, 1st Floor, 'C' wing, Unit 103, Corporate Avenue, Atul Projects, Chakala, Andheri (East), Mumbai - 400093, Maharashtra, India
www.vedantalimited.com
CIN: L13209MH1965PLC291394

**EXPRESSION OF INTEREST (EOI)**

Cairn Oil & Gas, a vertical of Vedanta Limited, the Operator of Ravva Block on behalf of itself and its Joint Venture (JV) partners, invites interested contractors with proven capabilities & demonstrated performance in similar requirement to express their interest for prequalification to participate in the Competitive Bidding process for

**PROVISION OF SUPPLY BASE AT KAKINADA, ANDHRA PRADESH, INDIA**

The interested parties should evince interest to participate in the Expression of Interest by clicking on the "Evince Interest" link against the EoI listing on the Cairn website i.e. http://www.cairnindia.com and submit their contact details online. Further to this, interested suppliers would be invited to submit their response via Smart Source (Cairn's e Sourcing Platform) within 14 Days from this publication.

## క్లుప్తంగా...

### బీజేపీ ఆహ్వానం మేరకే ఆ పార్టీలోకి: మోత్కుపల్లి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, ఆ పార్టీ ఇప్పట్లో బలపడే సూచనలు కూడా కనిపించడం లేదని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం కానుందని జోస్యం చెప్పారు. తాను టీడీపీని వీడినప్పుడు టీఆర్‌ఎస్ ఆహ్వానిస్తుందని భావించానని, అయితే ఆ పార్టీ నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని తెలిపారు. ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి తనను పార్టీలోకి రావాలని ఆహ్వానించారని, వారి ఆహ్వానం మేరకు త్వరలోనే బీజేపీలో చేరతానని మోత్కుపల్లి స్పష్టం చేశారు.

### దళితుల ఐక్యతే అంబేడ్కర్ ఆశయం

**మాల మహానాడు అధ్యక్షుడు చెన్నయ్య**



సాక్షి, హైదరాబాద్: దళితులంతా ఐక్యంగా ఉండటమే అంబేడ్కర్ ఆశయమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం మింట్‌కాంపౌండ్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దళితులు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించే దిశగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత కృషి చేయాలన్నారు. వర్గీకరణ పేరుతో దళితుల్లో భేదాభిప్రాయాలు తీసుకొచ్చే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. వర్గీకరణతో ఐక్యత నశిస్తుందని, దళితుల అభివృద్ధి ఆగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా శ్రీనివాస్, కనకాల దేవిక తదితరులు పాల్గొన్నారు.

### టీఎస్‌ఎస్‌పీలో అవకతవకల్లేవు: బిస్త్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్‌ఎస్‌పీ) పదోన్నతుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని టీఎస్‌ఎస్‌పీ అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ తెలిపారు. 'టీఎస్‌ఎస్‌పీలో ప్రమోషన్ల గలాటా'పేరుతో ఆదివారం 'సాక్షి'ప్రచురించిన కథనానికి వివరణ ఇస్తూ బెటాలియన్లలో ప్రమోషన్లలో అంతా పారదర్శకమేనని, ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. సర్వీసు, పోస్టింగు, విధులు, కుటుంబ పరంగా ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఉన్నతాధికారులం అందుబాటులో ఉంటామని, మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఆయన వివరించారు.

### సీనియర్ ఐపీఎస్‌ల హరితహారం..

సాక్షి, హైదరాబాద్: సీనియర్ ఐపీఎస్ అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలసి 'తెలంగాణకు హరితహారం'కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం ప్లెజెంట్ వ్యాలీలోని ఐపీఎస్ అధికారుల గృహసముదాయంలో వేప, జామ, సీతాఫలంతోపాటు వివిధ రకాలకు చెందిన 300 మొక్కలు నాటారు. జీహెచ్‌ఎంసీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఐపీఎస్ అధికారులు కృష్ణప్రసాద్, రాజీవ్‌త్రివేది, వీకే సింగ్, సీవీ ఆనంద్, శిఖాగోయల్, స్వాతి లక్రా, అనిల్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, విజయ్‌కుమార్, అమిత్‌గార్గ్, అకున్‌సబర్వాల్ తమ కుటుంబీకులతో కలసి పాల్గొన్నారు.

### సోనియా ఎంపిక పార్టీ పునర్నిర్మాణానికి దోహదం

**కాంగ్రెస్ విధేయుల ఫోరం**

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షురాలిగా మళ్లీ సోనియాగాంధీని ఎంపిక చేయడాన్ని కాంగ్రెస్ విధేయుల ఫోరం స్వాగతించింది. రాహుల్ గాంధీ రాజీనామా అనంతరం గందరగోళంలో ఉన్న పార్టీ కేడర్ తాజాగా సోనియా నియామకంతో సవాళ్లను ఎదుర్కొని పార్టీని పటిష్టం చేసేందుకు సన్నద్ధమవుతోందని ఫోరం నేతలు మర్రి శశిధర్ రెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఎం.కోదండ రెడ్డి, జి.నిరంజన్, ఎ.శ్యామ్ మోహన్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా సోనియా ఎంపిక పార్టీ పునర్నిర్మాణానికి దోహదపడుతుందని, ప్రియాంక తోడ్పాటుతో సోనియా ఆ దిశలో ముందుకెళ్తారని ఆ ప్రకటనలో వారు ఆకాంక్షించారు.

### ఎన్నారై మృతికి సీఆర్ ఫౌండేషన్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: ఇటీవల అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రత్యూష్‌రెడ్డి (34) మృతికి సీఆర్ ఫౌండేషన్ సంతాపం ప్రకటించింది. ఈ నెల 8న అమెరికాలోని చికాగోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. కమ్యూనిస్ట్ నేత, మాజీ ఎంపీ నల్లమల గిరిప్రసాద్, మాజీ మంత్రి పి.నరసారెడ్డిలకు ప్రత్యూష్ మనుమడు కాగా, ఆయన తల్లి వాణిశ్రీ సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తోన్న వుమెన్ వెల్ఫేర్ సెంటర్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

# కేన్సర్ 'అలర్ట్'!

**ఏడాదికేడాది విస్తరిస్తున్న మహమ్మారి**

- ఆరోగ్యశ్రీలో మొదటిస్థానం.. దాదాపు పావు శాతం కేన్సర్ చికిత్సలే
- మరోవైపు ఎంఎన్‌జే ఆసుపత్రికి వెల్లువెత్తుతున్న రోగులు
- ప్రతి ఏటా కొత్తగా నమోదవుతున్న పదివేల కేన్సర్ పేషెంట్లు
- జీవనశైలి ప్రభావం చూపడంవల్లే అంటున్న నిపుణులు




సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రంపై కేన్సర్ దండెత్తుతోంది. ఒకప్పుడు ఎక్కడో ఒక కేన్సర్ రోగి కనిపిస్తే, ఆ వ్యాధి సర్వసాధారణమైంది. ఫలితంగా కేన్సర్ మరణాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మన శరీరంలో జన్యుపరివర్తనలో జరిగే మార్పులను జీవనశైలి అలవాట్లు తీవ్రంగా ప్రభావితం చేయడం వల్లే కేన్సర్ వస్తుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీంతో కేన్సర్ల విషయంలో జన్యుపరివర్తన మార్పులను గుర్తించే పరిశోధనలు ఊపందుకున్నాయి. దీనికి సంబంధించి మాలిక్యులర్ స్టడీస్ ద్వారా పరిశోధనలు జరుగుతున్నాయి. మొత్తంగా జన్యుపరివర్తనపై జీవనశైలిలో మార్పులు, మానసిక ఒత్తిడి, రసాయనాలు, పురుగుమందులతో కూడిన ఆహారం కేన్సర్‌కు దారితీస్తున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు.

**ఆరోగ్యశ్రీలో దాదాపు పావుశాతం కేన్సర్ చికిత్సలే..**

కేన్సర్ పేదలపాలిట శాపంగా మారింది. ఆరోగ్యశ్రీలో జరుగుతున్న చికిత్సల్లో మొదటి స్థానంలో కేన్సర్ చికిత్సలే ఉన్నాయి. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్యశ్రీ కింద 2.74 లక్షల వివిధ రకాల వ్యాధులకు శస్త్రచికిత్సలు జరిగితే, అందులో ఏకంగా 64,845 కేన్సర్ వ్యాధులకు చికిత్సలు జరిగాయి. అంటే ఏకంగా 23.61 శాతం కేన్సర్ చికిత్సలు కావడం గమనార్హం. అలాగే 2017–18 ఆర్థిక సంవత్సరంలో వివిధ వ్యాధులకు జరిగిన చికిత్సలు 3.09 లక్షలు కాగా, అందులో కేన్సర్ చికిత్సలు ఏకంగా 71,273 ఉన్నాయి. కేన్సర్ తర్వాత రెండో స్థానంలో కిడ్నీ వ్యాధులకు ఆరోగ్యశ్రీలో చికిత్సలు జరుగుతున్నాయి.

**ఎంఎన్‌జేకి ప్రతిఏటా 10 వేల కొత్త కేసులు..**

ఇక రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రికి ప్రతి ఏటా కొత్తగా 10 వేల మందికిపైగా కేన్సర్ రోగులు వస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఔట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, ఫాలో అప్ పేషెంట్లు అందరికీ కలిపి 2014 సంవత్సరంలో 5.78 లక్షల రకాల వైద్య సేవలు అందించగా, గతేడాది ఆ సంఖ్య 9.19 లక్షలకు చేరింది. కేన్సర్ వ్యాధి రోజురోజుకు మరింత విస్తరిస్తుందనడానికి ఈ లెక్కలే నిదర్శనం.

### జీవనశైలి అలవాట్లు మార్చుకోవాలి



జీవనశైలి అలవాట్లు జన్యుపరివర్తనపై తీవ్రమైన ప్రభావం చూపడం వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు అలవర్చుకోవాలి. పొగతాగడం, మద్యం సేవించడం చేయకూడదు. గుట్కా జోలికి పోకూడదు. కూరగాయలతో కూడిన భోజనం తినాలి. ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. ఆడవాళ్లు అప్పుడప్పుడు రొమ్ము పరీక్షలు చేయించుకుంటే మంచిది. ఏదైనా చిన్నపాటి జబ్బు మూడు వారాలకు మించి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

–డాక్టర్ సౌమ్య కోరుకొండ, సర్జికల్ ఆంకాలజిస్ట్, యశోద ఆసుపత్రి, సికింద్రాబాద్

### ప్రమాద ఘంటికలు



రాష్ట్రంలో కేన్సర్ రోజురోజుకూ విస్తరిస్తోంది. కేన్సర్ విస్తరణకు ప్రధాన కారణం జీవనశైలిలో మార్పులు సంభవించడం. మరోవైపు మానసికంగా తీవ్రమైన ఒత్తిడితో జీవిస్తుండటమే. అలాగే ఆహార పంటల్లో విచ్చలవిడిగా రసాయనాలు, పురుగు మందులు వాడుతున్నారు. ఏమి తింటున్నామో కూడా మనకు తెలియడంలేదు. దీంతో శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గి కేన్సర్‌కు దారితీస్తోంది. అలాగే వాయు కాలుష్యమూ కేన్సర్ కారకాల్లో ఒకటిగా ఉంటోంది. మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. మాంసాహారం, వేపుళ్లు తినడం తగ్గించుకుంటే మంచిది.

–డాక్టర్ జయలత, డైరెక్టర్, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి

# రెండు నాల్కల రాజకీయాన్ని మానుకోవాలి

- తెలంగాణ ప్రజల విజ్ఞతను తక్కువ అంచనా వేయొద్దు
- కేటీఆర్‌కు ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ హితవు



సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రెండు నాల్కల రాజకీయాన్ని మానుకోవాలని, ఎల్లకాలం పరిస్థితులు ఒకేలా ఉండవని, తెలంగాణ ప్రజల విజ్ఞతను తక్కువ అంచనా వేయొద్దని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ హితవు పలికారు. తెలంగాణ వికాస సమితి సభలో 'ప్రశ్నించే స్థితి లేకపోతే ప్రజాస్వామ్యానికి ప్రమాదం'అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఆరు ప్రశ్నలు సంధించారు. నాతో నుంటే దేశభక్తులు, లేకపోతే దేశద్రోహులా అని బీజేపీని కేటీఆర్ ప్రశ్నించారని, మరి టీఆర్‌ఎస్‌లో చేరి మీకు భజన కొడితేనే తెలంగాణ వాదులు, ప్రశ్నిస్తే తెలంగాణ ద్రోహులు అని దౌర్జన్యంగా ఎలా ముద్ర వేశారని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు, క్షేత్రస్థాయి నేతలను కొనుగోలు చేసి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించినప్పుడు కేటీఆర్‌కు ఈ సూత్రం గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ధర్నా చౌక్ ఎత్తివేసి ప్రశ్నించే గొంతుకలను పోలీసులతో అక్రమ కేసులు బనాయించి, బెదిరించి జైళ్లలో పెట్టినప్పుడు, అసెంబ్లీ, కౌన్సిల్‌లో ప్రతిపక్షమే లేకుండా చేయాలని ప్రయత్నించినప్పుడు ఏమైందని నిలదీశారు. మత రాజకీయాలొద్దని ఇప్పుడు నీతి సిద్ధాంతాలు చెప్తున్న కేటీఆర్ పచ్చి మతోన్మాద ఎంఐఎంతో ఎలా అంటకాగుతున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మత రాజకీయాలకు పాల్పడితే నోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, నీతి ఆయోగ్, ట్రిపుల్ తలాక్, సమాచార హక్కు సవరణ, 370 ఆర్టికల్ రద్దు లాంటి అంశాల్లో బీజేపీకి ఎందుకు మద్దతిచ్చారని దాసోజు ప్రశ్నించారు.

**టీఆర్‌ఎస్, బీజేపీలవి చీకటి రాజకీయాలు**

వాపును చూసి బీజేపీ బలుపు అనుకుంటోందని, ఇక్కడ ఆ పార్టీకి అంత సీన్ లేదని శ్రవణ్ ఎద్దేవా చేశారు. బీజేపీ, టీఆర్‌ఎస్‌లు కలిసి చీకటి రాజకీయాలు చేస్తున్నాయని, ఈ నాటకాలన్నీ తెలంగాణ ప్రజలను మోసం చేయడానికేనని విమర్శించారు. ఆ పార్టీల నేతలకు కాంగ్రెస్ పార్టీని కానీ, తమ నేతలను కానీ విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌ని విమర్శించే అర్హత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు లేదని, దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుడు ఉత్తమ్ అన్న విషయాన్ని వారు గమనించాలని ఆయన సూచించారు.

**మీదాకా వస్తే కానీ తెలియలేదా: విజయశాంతి**

తన వరకు వస్తే కానీ అసలు తత్వం బోధపడదు అన్నట్లుగా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వేదం ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. భావోద్వేగంతో కేటీఆర్ ఇప్పుడు మాట్లాడుతున్నారని, ఇన్నాళ్లూ వ్యవహరించిన నియంతృత్వ ధోరణి సంగతేంటని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా అసలుతత్వం టీఆర్‌ఎస్‌కు బోధపడినందుకు సంతోషమని, ఇప్పుడైనా ఆ పార్టీ అగ్రనాయకత్వం తన వైఖరిని మార్చుకోవాలని ఆమె సూచించారు.



నాగార్జున సాగర్‌లో..



జూరాలలో..

# సాగర్@202 టీఎంసీలు

- ప్రాజెక్టులోకి ప్రస్తుతం 6.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- రెండ్రోజుల్లో పూర్తి స్థాయి నీటిమట్టానికి..!
- కృష్ణా, భీమా, తుంగభద్ర నదుల వరదతో జూరాలకు రికార్డు ప్రవాహాలు

సాక్షి, హైదరాబాద్: ఎగువన కృష్ణా, భీమా, తుంగభద్ర నదులు ఉప్పొంగుతుండటంతో రాష్ట్రంలోని కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. జూరాల, శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఇప్పటికే శ్రీశైలానికి వచ్చిన ఇన్‌ఫ్లోను దిగువకు వదులుతుండటంతో నాగార్జునసాగర్‌కు వరద ఉధృతి గంటగంటకు పెరుగుతోంది. దీంతో సాగర్‌లో శనివారం నీటి నిల్వ 162 టీఎంసీలుగా ఉండగా.. అది ఆదివారం రాత్రికి 202 టీఎంసీలకు చేరింది. వరద ఉధృతి 8.60 లక్షల క్యూసెక్కులకు పెరిగే అంచనాల నేపథ్యంలో రెండ్రోజుల్లో ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది.

**నిండేందుకు రెండు, మూడ్రోజులే!**

మహారాష్ట్రలో నదీ పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో కృష్ణా బేసిన్‌లోని చిన్నచిన్న వాగులు, ఉపనదులన్నీ పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్‌లకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం ఆల్మట్టిలోకి ఏకంగా 6.17లక్షల క్యూసెక్కు (56 టీఎంసీ)ల మేర వరద వస్తుండగా, నారాయణపూర్‌లోకి 6 లక్షల క్యూసెక్కులు (54.54 టీఎంసీల) వరద వస్తోంది. ఈ నీరంతా దిగువ జూరాలకు వస్తోంది. మరోపక్క జూరాలకు ఎగువన భీమానదిపై ఉన్న మహారాష్ట్రలోని ఉజ్జయినీ జలాశయానికి ప్రవాహాలు పోటెత్తుతున్నాయి. ఉజ్జయినీ పూర్తిగా నిండటంతో జలాశయం గేట్లెత్తి 85వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో జూరాలకు ఆదివారం రికార్డు స్థాయిలో 8.65లక్షల క్యూసెక్కులు (78.63 టీఎంసీలు)ల మేర వరద వస్తుండగా.. అంతే మొత్తాన్ని దిగువన శ్రీశైలానికి వదులుతున్నారు. శ్రీశైలానికి ప్రస్తుతం 6.53లక్షల క్యూసెక్కుల (59.36 టీఎంసీలు) వరద నమోదైంది. అయితే తుంగభద్ర నది ఉప్పొంగుతుండటంతో ప్రాజెక్టు నుంచి గరిష్టంగా 2.29లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు వదిలారు. ఈ వరద శ్రీశైలంను చేరుతుండటంతో సోమవారం నుంచి వరద 8.50 లక్షల క్యూసెక్కులను దాటే అవకాశముందని నీటిపారుదల వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం నుంచి 8.52 లక్షల క్యూసెక్కులు (77.45 టీఎంసీలు) వరదను దిగువ సాగర్‌కు వదులుతున్నారు. దీంతో సాగర్‌లో వరద ఉధృతి గంటగంటకు పెరుగుతోంది. ఆదివారం రాత్రికి ప్రవాహాలు 6.50 లక్షల క్యూసెక్కులు (59 టీఎంసీ)ల వరద సాగర్‌లోకి వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నిల్వలు వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతంసాగర్‌లో 312 టీఎంసీలకు నిల్వ 202 టీఎంసీలకు చేరింది. ఆదివారం ఒక్కరోజే 40 టీఎంసీల మేర కొత్తనీరొచ్చి చేరింది. వరద ఉధృతి కొనసాగుతుండటంతో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల అవసరాలకు, విద్యుదుత్పత్తి ద్వారా 38,016 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. కుడికాల్వ కింది అవసరాలకు 1,043 క్యూసెక్కులు, మరో కెనాల్‌కు 2,419 క్యూసెక్కులు, ఏఎంఆర్‌పీకి 2వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. సోమవారం నుంచి వరద ఉధృతి పెరిగే అవకాశాల నేపథ్యంలో ప్రాజెక్టు రెండు, మూడ్రోజుల్లోనే పూర్తిస్థాయి మట్టాలకు చేరుకోనుంది. ఇక గోదావరిలోని ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి ప్రవాహాలు క్రమంగా తగ్గుతున్నాయి.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా.. (సాయంత్రం 6 గంటల వరకు)**

| ప్రాజెక్టు | పూర్తి నీటినిల్వ | ప్రస్తుత నీటినిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 101.03 | 6,17,000 | 5,40,000 |
| నారాయణపూర్ | 37.646 | 26.27 | 6,00,000 | 6,11,260 |
| జూరాల | 9.657 | 5.50 | 8,65,000 | 8,52165 |
| శ్రీశైలం | 215.807 | 193.41 | 6,53,344 | 7,78,427 |
| తుంగభద్ర | 100.86 | 88.66 | 2,14,436 | 2,29,873 |
| ఉజ్జయినీ | 117 | 117.24 | 59,918 | 85,800 |
| నాగార్జునసాగర్ | 312.045 | 200 | 6,50,000 | 38,016 |
| కడెం | 7.60 | 6.64 | 4,014 | 659 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.54 | 5,570 | 5,570 |
| ఎస్సారెస్పీ | 90.31 | 15.93 | 5,926 | 389 |

# తెలంగాణ ఆమోదయోగ్యం కాదా?

- ఏర్పాటు ప్రక్రియను ఎందుకు విమర్శిస్తున్నారు..
- కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్
- సంస్థాగత ఎన్నికల వరకు సోనియానే తాత్కాలిక చీఫ్: కుంతియా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఏర్పాటు మీకు ఆమోదయోగ్యం కాదా..? అంటూ టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై హోంమంత్రి అమిత్ షా పదే పదే విమర్శిస్తూ వ్యాఖ్యానించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆదివారం మధ్యాహ్నం ఇక్కడి ఏఐసీసీ కార్యాలయంలో ఆయన పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్, ఏఐసీసీ కార్యదర్శులు బోస్ రాజు, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, పార్టీ నేత మహేశ్ గౌడ్ తదితరులతో కలసి మీడియాతో మాట్లాడారు. 'రాహుల్ గాంధీ అత్యంత క్లిష్ట సమయంలో నాయకత్వం వహించి కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచారు. రాజీనామా చేసిన నేపథ్యంలో వారి సేవలకు ధన్యవాదాలు తెలుపుతూ సోనియాగాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా రావడాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ ప్రజల హృదయాల్లో సోనియాగాంధీకి ప్రత్యేక స్థానం ఉంది. మొన్న జరిగిన లోక్‌సభ సమావేశాల్లో హోంమంత్రి మాట్లాడిన తీరు నిర్ఘాంతపరిచింది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను విమర్శించడం ఆశ్చర్యపరిచింది. రాష్ట్ర ఏర్పాటులో హోం శాఖ అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వ్యక్తిగా చెబుతున్నా.. కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ సందర్భంలో తెలంగాణ ప్రక్రియను విమర్శిం చారు. తెలంగాణ ఏర్పాటుపై 2009 డిసెంబర్‌లోనే హోంమంత్రి ప్రకటించారు. అఖిలపక్ష సమావేశాలు జరిపారు. జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ఏర్పాటు చేసి సంప్రదింపులు జరిపారు. అందరితో చర్చించిన తర్వాతే తెలంగాణ ఏర్పాటు చేసిన సంగతి హోంమంత్రికి తెలియాలి. దర్వాజాలు బంద్ చేసి



తెలంగాణ ఇచ్చారని వ్యాఖ్యానిస్తూ వచ్చారు. ఏ బిల్లు పెట్టినా ఓటింగ్ జరిపే సమయంలో తలుపులు మూసేస్తారు..'అని చెప్పారు.

**నెహ్రూపై తప్పుడు ప్రచారమా..**

పదే పదే ప్రధాని, హోంమంత్రి, చోటా మోటా బీజేపీ నేతలు కూడా నెహ్రూపై వ్యాఖ్యానించడం సరికాదని ఉత్తమ్ అన్నారు. 'దేశ స్వాతంత్య్రం కోసం పదేళ్లు జైల్లో ఉన్న నెహ్రూపై తప్పుడు ప్రచారం చేయడం, చరిత్రను వక్రీకరించడం చాలా బాధగా ఉంది. ఆర్టికల్ 370 వర్తింపజేయడం ఆ నాటి కేబినెట్ నిర్ణయం. 70 ఏళ్ల తర్వాత ఇప్పుడు దానిని విమర్శించడం, వారి గొప్పతనాన్ని తగ్గించేలా మాట్లాడటం సమాజంలోని అన్ని వర్గాలు ఖండిస్తున్నాయి. కశ్మీర్ సమస్యను నెహ్రూ తయారుచేశారన్న అమిత్ షా వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు ఖండిస్తున్నారని చెబుతున్నా.. హైదరాబాద్, జునాగఢ్‌ను సర్దార్ వల్లభాయ్ పటేల్ విలీనం చేశారని, కశ్మీర్ సమస్య నెహ్రూ తెచ్చారని ప్రచారం చేస్తున్నారు. వీరు ఒకే కేబినెట్‌లో ఉండి అవి చేస్తే చరిత్రను వక్రీకరిస్తున్నారు. అన్ని నిర్ణయాలు కలసికట్టుగా తీసుకున్నవే. వారిద్దరూ కాంగ్రెస్ నేతలే..'అని పేర్కొన్నారు.

**బీజేపీ బలంతో వచ్చినవి కావు: కుంతియా**

అంతకుముందు కుంతియా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్‌కు తదుపరి సంస్థాగత ఎన్నికలు జరిగేంతవరకు తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీ ఉంటారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ సమర్థంగా పనిచేశారు. దేశవ్యాప్తంగా పోరాటాల్లో పాల్గొన్నారు. ఎన్నికల్లో ఓటమికి ఆయన బాధ్యత లేదని సీడబ్ల్యూసీ అభిప్రాయపడుతూ అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడింది. ఆయన తన రాజీనామా వెనక్కి తీసుకోవాలని దేశ వ్యాప్తంగా 200 మంది నేతలు శనివారం సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు తమ అభిప్రాయం తెలిపారు. కానీ రాహుల్ అందుకు సిద్ధంగా లేరు. సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీని ఎన్నుకుంది. టీపీసీసీ దీనిని స్వాగతిస్తోంది. తెలంగాణ ఏర్పాటు కేవలం సోనియా వల్లే సాధ్యమైంది. తెలంగాణలో ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. కాంగ్రెస్ శ్రేణులు సమర్థంగా పనిచేసి విజయం సాధిస్తాయి. కాంగ్రెస్ ఖాళీ అవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బీజేపీకి వచ్చిన ఆ నాలుగు సీట్లు బలం వల్ల వచ్చినవి కావు. ఆదిలాబాద్ ఎంపీ గెలవడానికి కారణం ఆయన గోండుల నాయకుడు.. నిజామాబాద్‌లో రైతులంతా కవితను ఓడించాలని నిర్ణయించుకోవడంతో అక్కడ బీజేపీ గెలిచింది. మా పార్టీ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు పోయినా ముగ్గురు ఎంపీలు గెలిచారు. మా పార్టీ తప్పనిసరిగా బలపడుతుంది..'అని అన్నారు.

# మళ్లీ అణ్వాయుధ పోటీ!



| దేశం | వార్‌హెడ్లు |
|---|---|
| రష్యా | 6,490 |
| అమెరికా | 6,185 |
| ఫ్రాన్స్ | 300 |
| చైనా | 290 |
| యూకే | 200 |
| పాకిస్తాన్ | 160 |
| భారత్ | 140 |
| ఇజ్రాయెల్ | 90 |

అణ్వాయుధ వ్యాప్తిని అరికట్టలేకపోతే, కొత్త దేశాలూ ఆయుధాల తయారీ మొదలు పెడతాయి. పెద్ద దేశాలు మరిన్ని ఆయుధాల్ని సమకూర్చుకునే ప్రయత్నం చేస్తే, చిన్నదేశాలు వాటినే అనుసరిస్తాయి

–జోసెఫ్ సిరిన్‌కోయిన్, ప్లోషేర్స్ ఫండ్, ప్రపంచ భద్రతా వ్యవహారాల సంస్థ విశ్లేషకుడు

**అమెరికా, రష్యా మధ్య కుదిరిన ఐఎన్‌ఎఫ్ (ఇంటర్మీడియెట్ రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్‌ట్రీటీ) ఒప్పందం రద్దయింది. న్యూ స్టార్ట్ (వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం)కు కాలం చెల్లిపోయిందని ట్రంప్ సర్కార్ గర్జిస్తోంది. ఉత్తర కొరియా మరోసారి క్షిపణి పరీక్షలు నిర్వహించి అమెరికాకు సవాల్ విసిరింది. చైనా, ఇరాన్‌లు అదే బాటలో నడుస్తున్నాయి. భారత్ కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేయడంతో పాక్, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇవన్నీ దేనికి సంకేతం? ప్రపంచ దేశాల్లో మరోసారి అణ్వాయుధాల పోటీకి తెరలేస్తుందా?**

### రష్యాతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్న అమెరికా
### క్షిపణి పరీక్షలతో అగ్రరాజ్యాన్ని బెంబేలెత్తిస్తున్న ఉత్తర కొరియా

ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో ఆయుధ నియంత్రణ మంత్రాన్ని ప్రపంచ దేశాలు జపించాయి. అణ్వస్త్రవ్యాప్తి నిరోధానికి గట్టి కృషి చేశాయి. ఇప్పుడా పరిస్థితులు మారిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఉద్రిక్తతలు చూస్తుంటే మళ్లీ దేశాల మధ్య ఆయుధ పోటీకి తెరలేస్తుందనే భావన వ్యక్తమవుతోంది. అమెరికా –రష్యా, ఉత్తరకొరియా –అమెరికా, భారత్ –పాక్, ఇజ్రాయెల్ –ఇరాన్‌ల మధ్య జరుగుతున్న పరిణామాలు ఆయుధ పోటీని పెంచుతున్నాయనేది నిపుణుల అభిప్రాయం. కశ్మీర్‌కి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయగానే పాక్ బుసలు కొట్టింది. రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఉద్రిక్తతలు మంచివి కాదని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. దౌత్యపరమైన మార్గాలు విఫలమైతే ఎంతకైనా తెగిస్తామంటూ పాక్ ఆర్మీ హెచ్చరించింది. పాక్ వద్ద 140–150 అణు వార్‌హెడ్‌లు ఉంటే, భారత్ దగ్గర అణు 130–140 వార్‌హెడ్లు ఉన్నాయి. ఈ ఉద్రిక్తతలతో రెండు దేశాలు రక్షణ బడ్జెట్‌ను మరింత పెంచుతాయని అంచనాలున్నాయి. సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా అణ్వాయుధ తయారీ సామర్థ్యం ఉందని చెబుతుండటం ప్రమాద ఘంటికలు మోగిస్తోందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**అగ్రరాజ్యం కేంద్రంగానే..**

అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో జరిగిన ఒక్కో ఒప్పందానికి ట్రంప్ సర్కార్ మంగళం పాడేస్తోంది. ఐఎన్‌ఎఫ్‌ను రద్దు చేసిన అగ్రరాజ్యం.. 2021లో ముగిసిపోనున్న న్యూ స్టార్ట్ ఒప్పందాన్నీ పొడిగించబోమంటోంది. మరోవైపు చైనా తనకు ప్రథమ శత్రువుగా మారుతోందని అగ్రరాజ్యం గుర్రుగా ఉంది. చైనా అత్యంత ఆధునిక క్షిపణుల్ని సమకూర్చుకోవడం, వాణిజ్యపరంగా కూడా సవాల్ విసురుతూ ఉండడంతో అమెరికా మరింత ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడానికి సన్నాహాలు ప్రారంభించింది. 'మాకు, రష్యాకు మధ్య ఆయుధ పోటీ రాబోయే రోజుల్లో మరింత తీవ్రం కానుంది. ఈ పోటీని తగ్గించే ఒప్పందాన్ని ట్రంప్ సర్కార్ తుంగలో తొక్కేసింది. రెండు దేశాల్లోనూ ఆయుధాల తనిఖీ బృందాలు ఏమీ చేయడం లేదు. అమెరికా ఐసీబీఎంలు, జలాంతర్గాములు, బాంబుల తయారీకి ప్రయత్నిస్తోంది. ఈ ఖర్చు ట్రిలియన్ డాలర్లకు చేరుకొని తడిసిమోపెడు కానుంది' అని ఒకప్పుడు అణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందంలో భాగస్వామి అయిన రిచర్డ్ బర్ట్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుధాలను తగ్గించుకునే చర్యలు చేపట్టినప్పటికీ ప్రపంచంలో ఉన్న అణ్వాయుధాల్లో అమెరికా, రష్యా దగ్గరే 90 శాతం ఉన్నాయి. ఈ రెండు దేశాల సైన్యంలో ఉన్న 8వేలకు పైగా వార్‌హెడ్‌లతో ప్రపంచాన్ని సర్వనాశనం చేయొచ్చు. ఇప్పుడు పెద్ద దేశాలే అణ్వాయుధాలు, ఆధునీకరణ అంటూ ఉంటే, చిన్న దేశాలు కూడా పోటీకి సై అంటున్నాయి.

– న్యూయార్క్ టైమ్స్ సౌజన్యంతో

## క్లుప్తంగా...

### ఇకపై అమెరికాతోనే చర్చలు: ఉత్తర కొరియా

**సియోల్:** ఉత్తర కొరియా మరోసారి ఆయుధ పరీక్షలను నిర్వహించింది. తమ నేత కిమ్ జొంగ్ ఉన్ శనివారం కొత్త ఆయుధ పరీక్షలను స్వయంగా పర్యవేక్షించారని ఆ దేశ మీడియా వెల్లడించింది. అమెరికాతో కలిసి సైనిక విన్యాసాలు సాగిస్తున్న దక్షిణ కొరియాతో చర్చలు జరిపేది లేదని, ఇకపై అమెరికాతో మాత్రమే చర్చలుంటాయని స్పష్టం చేసింది. అమెరికాతో త్వరలో చర్చలు జరగనున్నాయన్న వార్తల నేపథ్యంలో ఉత్తరకొరియా ఆదివారం ఈ సంచలన వ్యాఖ్యలు చేసింది. అమెరికా, దక్షిణ కొరియాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న సైనిక విన్యాసాలు ముగిసిన తర్వాత అణు నిరాయుధీకరణపై చర్చలు జరిపేందుకు సిద్ధమంటూ కిమ్ సంసిద్ధత వ్యక్తం చేశారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే ఉ.కొరియా ఈ మేరకు స్పందించింది.



### పార్లమెంటుకు కొత్త కాంతులు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు భవనం శోభను మరింత పెంచేందుకు రంగులు మారే 875 ఎల్‌ఈడీ బల్బులను ప్రభుత్వం అమర్చింది. ఈ బల్బులను ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించనున్నారు. ఇతర లైట్లతో పోలిస్తే ఈ బల్బులు 80 శాతం విద్యుత్తును ఆదా చేస్తాయని లోక్‌సభ అధికారులు చెప్పారు. పార్లమెంటు అందాన్ని ఈ బల్బులు మరింత పెంచుతాయనీ, మరింత ఎక్కువ దూరం నుంచి కూడా పార్లమెంటు కనిపించేలా చేస్తాయని అధికారులు తెలిపారు.

### ఇన్‌క్రెడిబుల్ ఇండియాకు 'వైల్డ్ లైఫ్' థీమ్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా పర్యాటకాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా'కార్యక్రమానికి 'వైల్డ్ లైఫ్'ను ఇతివృత్తంగా ఎంచుకోనున్నట్లు పర్యాటక మంత్రి ప్లహాద్ పటేల్ వెల్లడించారు. డిస్కవరీ చానల్‌లో ప్రసారమయ్యే 'మ్యాన్ వర్సెస్ వైల్డ్'కార్యక్రమంలో ఇటీవల ప్రధాని మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం 180కి పైగా దేశాల్లో సోమవారం ప్రసారం కానుంది. మోదీని ప్రపంచదేశాలకు పరిచయం చేసిన ఈ కార్యక్రమం థీమ్‌ను ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రచారానికి వినియోగించుకోనున్నట్లు ప్లహాద్ తెలిపారు.

### డెలివరీ చేయలేం..!

'జొమాటో' బాయ్స్ ఆందోళన

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరంలో కొందరు 'జొమాటో' డెలివరీ బాయ్స్ సోమవారం నుంచి ఆందోళనలు చేపట్టనున్నారు. గోమాంసం, పంది మాంసం డెలివరీ చేయలేమంటూ నిరసనలకు దిగుతున్నారని జొమాటో తెలిపింది. హౌరాలో కొందరు నిరసన చేపడుతున్నట్లు తెలిసిందని, వారి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తామని జొమాటో తెలిపింది. 'ఈ ఉద్యోగం ఎలాంటిదో వారు అర్థం చేసుకోవాలి. భారత్‌లోని భిన్నత్వం ఇందులో ప్రతిబింబిస్తుంది. డెలివరీ చేయాల్సింది శాకాహారమా.. మాంసాహారమా అన్న విషయంలో తేడా చూపలేము. ఇది అర్థం చేసుకోవాలి' అని స్పష్టం చేసింది.

### జేజేపీ-బీఎస్పీ పొత్తు

**న్యూఢిల్లీ:** హరియాణాలో మరో పొత్తు విరిసింది. త్వరలో అక్కడి అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు జననాయక్ జనతా పార్టీ (జేజేపీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రకటించాయి. ఈ ఏడాది చివర్లో జరగనున్న 90 స్థానాలున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ 50 స్థానాలు, జేజేపీ 40 స్థానాల్లో పోటీ పడనున్నాయి. ఆదివారం విలేకరుల సమావేశంలో జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా, బీఎస్పీ ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర మిశ్రాతో కలిసి పొత్తును ప్రకటించారు.

# సవాళ్లను అధిగమిస్తారా?

### సోనియా గాంధీ రాకపై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు
- పార్టీ బలోపేతం అవుతుందని ఓ వర్గం ధీమా
- పెదవి విరుస్తున్న మరో వర్గం

**న్యూఢిల్లీ:** 134 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియాగాంధీ(72) తాజాగా ఎన్నికయ్యారు. ఈ ఏడాదిలో హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నేతలను ఏకతాటిపైకి తెచ్చేందుకు వీలుగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత రాజకీయ సవాళ్లను సోనియానే సమర్థవంతంగా ఎదుర్కోగలరనీ, ఆమె నాయకత్వంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. బీజేపీ అగ్రనేత అటల్‌బిహారీ వాజ్‌పేయి చేతిలో వరుస ఓటములు ఎదురైనా కుంగిపోకుండా కాంగ్రెస్ పార్టీని రెండు సార్లు సోనియా విజయతీరాలకు చేర్చిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఈ సంక్షోభ సమయంలో సోనియా నాయకత్వం కాంగ్రెస్‌కు అత్యంత ఆవశ్యకమనీ, పలువురు నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నైతికస్థైర్యం నింపాలంటే సోనియాగాంధీయే సరైన వ్యక్తని చెబుతున్నారు.

**అధ్యక్ష ఎన్నికలు త్వరగా జరపాలి**

అయితే సోనియా మరోసారి కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడంపై మరికొందరు నేతలు పెదవి విరుస్తున్నారు. 'గాంధీ కుటుంబం చేతిలో అధికారం ఉన్నంతకాలం పార్టీలో నాయకత్వ మార్పు సాధ్యం కాదు. తాజా నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీని నడపాలంటే గాంధీ కుటుంబమే దిక్కన్న వాదనలకు బలం చేకూరింది. ఇందులోంచి బయటపడాలంటే కాంగ్రెస్ పార్టీ చాలా ముందుకెళ్లాల్సిన అవసరముంది' అని వారంతా చెబుతున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ఎన్నికలను త్వరగా చేపట్టడంతో పాటు పార్టీ కార్యకలాపాలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ఇంకొంతమంది కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

**సీనియర్ల టైమ్ వచ్చింది..**

కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగిన 20 నెలల్లో రాహుల్ పార్టీలో యువ నాయకత్వానికి పెద్దపీట వేశారు. సచిన్ పైలట్, జ్యోతిరాదిత్య సింధియా వంటి యువ నేతలను ప్రోత్సహించారు. మూసవిధానాలను మార్చుకుని పార్టీ ముందుకు దూసుకెళ్లాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అయితే మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చిన రాహుల్, గుజరాత్‌లో చెప్పుకోదగ్గ ఫలితాలను సాధించారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ 52 సీట్లకు పరిమితం కావడంతో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ ఏడాది మే 25వ తేదీన రాజీనామా చేశారు. తాజాగా సోనియాగాంధీ రంగ ప్రవేశం నేపథ్యంలో మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోనీ, కమల్‌నాథ్, మణిశంకర్ అయ్యర్, అహ్మద్ పటేల్, మురళీ దేవరా, అంబికా సోనీ, కపిల్ సిబల్, సల్మాన్ ఖుర్షీద్, పి.చిదంబరం, ఖర్గే వంటి సీనియర్లు పార్టీలో కీలకపాత్ర పోషించే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక సింధియా, పైలట్ వంటి యువనేతలు పక్కకు తప్పుకోవాల్సిందేనని వ్యాఖ్యానిస్తున్నారు. సీనియర్, యువ నాయకత్వం మధ్య సమన్వయం పాటిస్తూ సోనియా గాంధీ కాంగ్రెస్‌ను ముందుకు తీసుకెళ్లే అవకాశముందని ఆ పార్టీకి చెందిన ఓ నేత తెలిపారు. అలాగే యూపీఏ–1, యూపీఏ–2 ప్రభుత్వాల్లో భాగస్వాములుగా ఉన్న పాత మిత్రుల(రాజకీయ పార్టీల)ను కలుపుకుని వెళ్లడం, కొత్త వారిని ఆహ్వానించడం సోనియాగాంధీ వల్లే సాధ్యమవుతుందని చెప్పారు. హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర ఈఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని పుంజుకునేలా చేయడం సోనియా ముందున్న ప్రధాన సవాలని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారాన్ని ముందుండి నడిపించడంతో పాటు గెలుపుగుర్రాలకు టికెట్ ఇవ్వడం సోనియా ముందున్న మరో సవాలని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా సోనియా ఇటలీ మూలాలను బీజేపీ ప్రచారాస్త్రంగా మలుచుకుని విమర్శల దాడికి దిగే అవకాశముందని కూడా ఆయన పేర్కొన్నారు.



శనివారం రాత్రి జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి వస్తున్న సోనియా గాంధీ

# కశ్మీర్‌పై ఉగ్రదాడికి కుట్ర..!

- ఏడుగురు ఉగ్రవాదులు చొరబడ్డారన్న నిఘా వర్గాలు

**శ్రీనగర్:** కశ్మీర్‌లో ఈద్ పండుగ సంబరాలపై లేదా స్వాతంత్ర్య దినోత్సవాలపై భారీ దాడులు జరిపేందుకు ఉగ్రవాదులు కుట్రపన్నుతున్నారనీ, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఏడుగురు ఉగ్రవాదుల బృందం భారత్‌లోకి ప్రవేశించిందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. భారత ప్రభుత్వంపై నిందను మోపేందుకు మసీదుల్లో ప్రార్థనలపై ఈ దాడులు జరగొచ్చని తెలిపాయి. ప్రపంచ ఉగ్రవాదిగా ముద్రపడ్డ మసూద్ అజార్ ఈ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చీఫ్‌గా ఉన్నాడు. ఉగ్రవాద దాడి జరిపి వీలైనంత ఎక్కువ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలిగించాలంటూ పాకిస్తాన్ ప్రభుత్వ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) జైషే మహ్మద్‌కు సూచించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టి కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారుస్తూ కేంద్రం సరిగ్గా వారం క్రితం సంచలన, చారిత్రక నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. మరోవైపు ఆదివారం పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ట్వీట్ చేస్తూ, కశ్మీర్‌లో కర్ఫ్యూ ఎత్తివేసిన తర్వాత ఏం జరుగుతుందోనని ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తోందనీ, సైనిక బలగంతో స్వాతంత్ర్య పోరాటాన్ని అణచివేయలేరని పేర్కొనడం గమనార్హం. అంతర్జాతీయంగా పాక్‌కు ముస్లిం దేశాలు సహా ఏ ఒక్కరూ మద్దతు తెలపకపోవడంతో, తాజాగా ఉగ్రవాద దాడికి దిగి, భారత్‌కు చెడ్డపేరు తీసుకురావాలని అనుకుంటోందని నిఘా వర్గాలు తెలిపాయి. బనిహాల్, పిర్ పంజాల్ పర్వతాల దక్షిణ భాగం నుంచి ఉగ్రవాదులు దేశంలోకి ప్రవేశించారనీ, రాజౌరీ లేదా పూంచ్ జిల్లాల్లోకి వాళ్లు చొరబడి ఉంటారని చెప్పాయి.

**వ్యాపారులకు వెయ్యి కోట్ల నష్టం..**

శ్రీనగర్‌లో ఆంక్షల కారణంగా వారం రోజుల్లో వ్యాపారులు రూ. వెయ్యి కోట్లు నష్టపోయుంటారని సంబంధిత వర్గాలు చెప్పాయి. ఆంక్షల కారణంగా ప్రజలెవ్వరూ బయటకు రాకపోవడంతో రోజుకు రూ. 175 కోట్ల నష్టం వచ్చిందని కశ్మీర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సభ్యుడొకరు చెప్పారు. పండుగ నేపథ్యంలో ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉంది. బ్యాంకులు, ఏటీఎంలు, కొన్ని మార్కెట్లు ఆదివారం తెరిచే ఉన్నాయి.

# సీబీఎస్‌ఈ పరీక్ష ఫీజు బాదుడు

### 10, 12వ తరగతుల ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు 24 రెట్లు పెంపు

**న్యూఢిల్లీ:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) 10వ, 12వ తరగతుల ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పరీక్ష ఫీజును 24 రెట్లు అంటే ప్రస్తుతమున్న రూ.50 నుంచి అమాంతం రూ.1,200కు పెంచింది. అదేవిధంగా జనరల్ కేటగిరీ విద్యార్థుల ఫీజును రూ.750 నుంచి రూ.1,500గా నిర్ణయించింది. ఈ మేరకు సీబీఎస్‌ఈ గత వారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ఫీజు చెల్లింపు ప్రక్రియ మొదలు కావడంతో పాత రుసుము చెల్లించిన విద్యార్థులు పెంచిన మొత్తాన్ని కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. పెంచిన ప్రకారం ఫీజును గడువులోగా చెల్లించని విద్యార్థులను 2019–20 వార్షిక పరీక్షలు రాసేందుకు అనుమతించబోమని తెలిపింది. తాజా విధానం ప్రకారం.. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విద్యార్థులు ఐదు సబ్జెక్టులకు పరీక్ష ఫీజు రూ.1,200 చెల్లించాలి. ఇంతకు ముందు ఇది రూ.350 మాత్రమే. జనరల్ కేటగిరీ వారికి ఇప్పటి వరకు ఉన్న ఫీజు రూ.750ను రూ.1,500కు పెంచింది. ఈ విధానం 10, 12వ తరగతుల విద్యార్థులకు వర్తిస్తుంది. 12వ తరగతి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అదనంగా ఒక సబ్జెక్టు పరీక్ష రాయాలంటే గతంలో ఎలాంటి ఫీజు ఉండేది కాదు. ఇకపై వారు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ విద్యార్థులు కూడా అదనపు సబ్జెక్టు కోసం రూ.150 బదులు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, 100 శాతం అంధ విద్యార్థులకు మాత్రం సీబీఎస్‌ఈ పరీక్ష రుసుమును మినహాయించింది. మైగ్రేషన్ ఫీజును కూడా రూ.150 నుంచి రూ.350కి పెంచింది.

# ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలిస్తాం

- చెన్నైలో హోం మంత్రి అమిత్ షా
- వెంకయ్య సందేశాలతో 'లిజనింగ్ లెర్నింగ్ లీడింగ్' పుస్తకావిష్కరణ



'లిజనింగ్, లెర్నింగ్ లీడింగ్' పుస్తకం ఆవిష్కరణ అనంతరం తొలి ప్రతిని వెంకయ్యకు అందజేస్తున్న హోంమంత్రి అమిత్ షా

**సాక్షి, చెన్నై:** కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలిస్తామని హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కశ్మీర్ అభివృద్ధి, సంక్షేమంపై ఇక పూర్తి స్థాయిలో కేంద్రం దృష్టి పెడుతుందని ఆయన చెప్పారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి రెండేళ్ల పయనంలో సాగిన పర్యటనలు, సందేశాలు, ఉపదేశాలు, కార్యక్రమాలతో కూడిన 'లిజనింగ్ లెర్నింగ్ లీడింగ్' పుస్తకావిష్కరణ ఆదివారం చెన్నైలో జరిగింది. సమాచార, ప్రసారాల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ నేతృత్వంలో రూపొందించిన ఈ పుస్తకాన్ని అమిత్‌షా ఆవిష్కరించారు. తొలి ప్రతిని వెంకయ్య అందుకున్నారు. విద్యార్థి దశ నుంచి ఉపరాష్ట్రపతి స్థాయి వరకు వెంకయ్య చేసిన రాజకీయ, ప్రజాసేవ గురించి అమిత్ షా వివరించారు. ఆర్టికల్ 370 రద్దు అంశాన్ని ప్రస్తావిస్తూ కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని స్పష్టం చేశారు. వెంకయ్య ఇన్నాళ్ల తన పయనాన్ని గుర్తుచేసుకుంటూ రాజకీయంగా తప్పుకున్నా, ప్రజాసేవలో, ప్రజాపయనంలో విశ్రాంతి లేదని వ్యాఖ్యానించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ నటుడు రజనీకాంత్.. వెంకయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గొప్ప ఆధ్యాత్మిక వాదిగా ఉన్న వెంకయ్య పొరపాటున రాజకీయాల్లోకి వచ్చేశారని చమత్కరించారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్, సీఎం పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం తదితరులు హాజరయ్యారు.

**అమిత్ షాకి రజనీ ప్రశంసలు**

కశ్మీర్ వ్యవహారం, ఆర్టికల్ 370 రద్దు విషయమై హోం మంత్రి అమిత్‌షాను రజినీకాంత్ అభినందించారు. ప్రధానమంత్రి మోదీ, అమిత్‌షా కృష్ణార్జునులని కొనియాడారు. 'నరేంద్ర మోదీ, అమిత్ షా ద్వయం కృష్ణార్జునుల ద్వయం వంటిది. అయితే వీరిద్దరిలో కృష్ణుడు ఎవరో, అర్జునుడు ఎవరో మనకు తెలీదు' అని రజినీకాంత్ అన్నారు. త్వరలో రాజకీయ పార్టీని స్థాపించి, 2021లో తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తానని రజినీకాంత్ గతంలో చెప్పడం తెలిసిందే.

# ఆగని వరదలు

- భారీ వర్షాలతో అల్లాడుతున్న కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్
- సహాయక చర్యల్లో ఆర్మీ, నేవీ, కోస్ట్‌గార్డ్, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు
- కర్ణాటక, మహారాష్ట్రల్లో హోంమంత్రి అమిత్ షా ఏరియల్ సర్వే
- హంపీలోకి చొచ్చుకొచ్చిన వరద.. పర్యాటకులు సురక్షితం

**న్యూఢిల్లీ/తిరువనంతపురం/బెంగళూరు/ముంబై:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాల ప్రభావంతో ఆయా రాష్ట్రాల్లోని వాగులు, వంకలన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. వరదలు, కొండచరియలు, గోడలు విరిగిపడటం తదితర కారణాలతో ఆదివారం నాటికి కేరళలో 72 మంది చనిపోగా, మధ్యప్రదేశ్‌లో 32 మంది మహారాష్ట్రలో 35 మంది, గుజరాత్‌లో 31 మంది, కర్ణాటకలో 31 మంది ప్రాణాలు కోల్పోయారు. చనిపోయారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 201కు చేరుకుంది. మరోవైపు సహాయ చర్యలను ముమ్మరం చేసేందుకు వీలుగా ఎన్డీఆర్‌ఎఫ్, ఆర్మీ, కోస్ట్ గార్డ్, నేవీ బృందాలతో పాటు వాయుసేనను(ఐఏఎఫ్) హెలికాప్టర్లను కూడా కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. రోడ్డుమార్గాలు ధ్వంసమైన ప్రాంతాల్లో ప్రజలకు అధికారులు హెలికాప్టర్ల ద్వారా ఆహార పదార్థాలు, తాగునీరు అందజేస్తున్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపుపొందిన హంపీలోకి వరదనీరు చొచ్చుకురావడంతో అధికారులు పర్యాటకుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**అమిత్ షా ఏరియల్ సర్వే..**

కర్ణాటకలో ఎడతెరిపిలేని వర్షాలు ప్రజలను భయపెడుతున్నాయి. భారీ వర్షాల కారణంగాఆదివారం నాటికి కర్ణాటకలో 31 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చేరుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కర్ణాటక సీఎం యడియూరప్ప, ఇతర ముఖ్యనేతలతో కలిసి బెళగావి, బాగల్‌కోటే, ఇతర వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. సర్వే అనంతరం షా స్పందిస్తూ..'ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయి' అని ట్వీట్ చేశారు. వర్షాలు కొంచెం తెరిపినిచ్చినప్పటికీ కొండచరియలు విరిగిపడే ప్రమాదముందనీ, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని కేరళ సీఎం పినరయి విజయన్ సూచించారు. తన నియోజకవర్గమైన వయనాడ్‌కు చేరుకున్న రాహుల్ గాంధీ ఓ పునరావాస కేంద్రంలోని బాధితులను పరామర్శించారు. బాధితులకు తక్షణసాయం అందించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

**కేంద్రం వివక్ష చూపుతోంది: కాంగ్రెస్**

వరద ప్రభావిత రాష్ట్రాలకు సాయం విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ విమర్శించింది. పార్టీ ప్రతినిధి జైవీర్ షేర్‌గిల్ మాట్లాడుతూ..'వరదలు లేకున్నా ఉత్తరప్రదేశ్‌కు రూ.200 కోట్లు కేటాయించి, వరదలతో అతలాకుతలమైన అస్సాంకు రూ.250 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గతేడాది భారీ వర్షాలు, వరదలతో కేరళకు రూ.10వేల కోట్ల ఆస్తి నష్టం జరిగితే రూ.3 వేల కోట్లుమాత్రమే ఇచ్చారు' అని వ్యాఖ్యానించారు.



### సూపర్ పోలీస్..

**సాక్షి, అమరావతి :** గుజరాత్‌లో వరదలో చిక్కుకున్న చిన్నారులను కాపాడేందుకు ఓ పోలీస్ తన ప్రాణాన్ని పణంగా పెట్టాడు. మోర్బీ జిల్లా కల్యాణ్ పూర్ గ్రామంలోని పాఠశాలలో 43 మంది చిన్నారులు చదువుతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలతో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ఉపాధ్యాయులు, పిల్లలు అక్కడ చిక్కుకుపోయారు. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ వరద ఉధృతికి బోట్లు ముందుకు కదలకపోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. కానిస్టేబుల్ పృథ్వీరాజ్ జడేజా ఇద్దరు బాలికల్ని భూజాలపై కూర్చోబెట్టుకుని నడుములోతులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిని దాటారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
12-8-2019

స్ఫూర్తి

**సముద్ర కెరటాన్ని మించిన ప్రాక్టికల్ లెసన్ ఉంటుందా? పడినా తిరిగి లేస్తుంది.. తీరాన్ని తాకేందుకు ప్రయత్నిస్తూనే ఉంటుంది! కెరటాన్ని స్ఫూర్తిగా తీసుకున్న మనుషులూ ఉన్నారు.. నలుగురిలో ఒకరిగా కాకుండా నలుగురు గర్వించదగిన స్థాయికి ఎదగాలనే తపనతో ఎన్ని అడ్డంకులు ఎదురైనా గమ్యం చేరుకున్న విజేతలు! అలాంటి అచీవరే ఎమ్‌డీ షకీర్...**



● మోటివేషన్ క్లాస్‌లో ప్రసంగిస్తూ...

# చీకటిని వెలిగించాడు

చిన్నతనంలోనే చూపును కోల్పోయిన ఈ యువకుడు కళ్లు లేవని బెంగపడలేదు. ఎవరి జీవితం వారి చేతుల్లోనే ఉంటుంది అనే ప్రాక్టికాలిటీ అర్థమైన వ్యక్తి కావడంతో అంధత్వాన్ని తన లక్ష్యసాధనకు అడ్డుగా ఏమాత్రం భావించలేదు. అనుకున్నది సాధించి కళ్లున్నవాళ్లకూ స్ఫూర్తిగా కనిపిస్తున్నాడు. మోటివేటర్‌గా ఎంతోమందిలో ఆత్మవిశ్వాసం నింపుతున్న షకీర్‌కి అయిదారేళ్ల వయసులో చూపు పోయింది. అయినా చదువు ఆపలేదు. పట్టుదలతో బ్రెయిలీ లిపి నేర్చుకుని చదువు కొనసాగించాడు. అంధుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన తొలి ఆంధ్రుడిగా నిలిచాడు. అంతేకాదు ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను బ్రెయిలీ లిపిలో రచించి, లిమ్కా బుక్‌లో స్థానం పొంది, నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ నుంచి ఎక్స్‌లెన్స్ అవార్డునూ అందుకున్నాడు. 2017, డిసెంబరులో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించిన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా 'విసూత్న రత్న' పురస్కారాన్నీ పొందాడు. షకీర్ గురించి మరిన్ని వివరాలు అతని మాటల్లోనే..

## వింటూ.. అర్థం చేసుకుంటూ

మాది సాధారణ కుటుంబం. మా నాన్న (సయ్యద్ ఇస్మాయేల్) పద్దెనిమిదేళ్లు మిలటరీలో పనిచేశారు. అమ్మ (రహీమా బేగం) గృహిణి. నేను యూకేజీలో ఉన్నప్పుడు గ్లకోమాతో చూపు పోయింది. మా పేరెంట్స్ మేనరిక వివాహమే ఇందుకు కారణమన్నారు. నాకు గ్లకోమా అని తెలగానే మా నాన్న ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చేశారు. ఎంతో మంది డాక్టర్లకు చూపించారు. ప్రయోజనం లేదనే అన్నారంతా. యూకేజీదాకా మామూలు బడికి వెళ్లిన నేను ఒకటో తరగతికి చెన్నైలోని స్పెషల్ స్కూల్లో చేరాను. బ్రెయిలీ లిపి ద్వారా అక్కడే అయిదో తరగతి వరకు చదువుకున్నా. ఆ తరువాత నెల్లూరు జిల్లా వెంకటగిరిలోని మామూలు బడిలోనే చేరి ఆరు నుంచి పదవ తరగతి వరకు చదివా. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ, క్లాస్‌మేట్స్ గట్టిగా చదువుతుంటే అర్థం చేసుకుంటూ.. బ్రెయిలీలో పరీక్షలు రాసేవాడిని. ఇంటర్, డిగ్రీ (బీఏ, ఇంగ్లిష్ లిటరేచర్)లో మాత్రం క్లాస్‌లో లెసన్స్‌ను రికార్డ్ చేసుకునే వాడిని. ఇంటికి వెళ్లాక ప్లే చేసుకుని వినేవాడిని. ఇట్లాగే 2002లో ఎంబీఏ పూర్తి చేశాను. ఆ తరువాత తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్ చేశాను. ఆ సమయంలోనే 2002లో కుప్పంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (వికలాంగుల కోటాలో) జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. అంతా రికార్డు వర్క్‌కు సంబంధించిన ఉద్యోగం కావడంతో కంటి చూపులేక ఏ పనీ చెప్పేవారు కాదు. ఖాళీగా కూర్చోవలసి వచ్చేది.

## ఎగతాళితో పట్టుదల

ఏదైనా ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా ఉద్యోగం చేయాలని ఉండేది. ఎంబీఏ కంప్లీట్ అయ్యాక కొన్ని కంపెనీలకు దరఖాస్తు చేసుకున్నాను. కానీ ఏ కంపెనీ నుంచీ కాల్ లెటర్ రాలేదు. టీచింగ్‌లోకి వద్దామని ప్రైవేట్ కాలేజెస్‌ను సంప్రదించా. వాళ్లూ సుముఖత చూపించలేదు. ''చూపు లేదు కదా, బోర్డు పై ఎలా రాస్తావ్? క్లాసులో స్టూడెంట్స్‌ను ఎట్లా మేనేజ్ చేస్తావ్?'' అంటూ ఎగతాళి చేశారు. దాంతో నాలో కసి పెరిగింది. ఉద్యోగం కోసం ఎవ్వరినీ అర్థించకూడదు, నేనే నలుగురికి ఉద్యోగాలు ఇచ్చేలా ఉండాలని డిసైడ్ అయ్యా. డిసెంబరు 15, 2005లో విజయవాడలో సొంతంగా 'ఎంపవర్ ట్రైనింగ్ సొల్యూషన్స్'ని పెట్టి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ స్టార్ట్ చేశా. ఈ 14 ఏళ్లలో 850 వరకు క్లాసెస్ నిర్వహించా. ఈ విషయం తెలుసుకుని నాడు జాబ్ ఇవ్వడానికి ఇష్టపడని కంపెనీలు, కాలేజెస్ ''మా దగ్గర ఉద్యోగం చేయండి'' అంటూ జాబ్ ఆఫర్లు ఇస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వాలనేదే నా లక్ష్యం. ప్రస్తుతం ఆ ప్రయత్నంలోనే ఉన్నా. స్టీవెన్స్ హావీ, టీనీరాబిన్స్, బ్రెయిన్‌ట్రేసీ వంటి అమెరిక్ రచయితల పుస్తకాలను బాగా చదువుతుంటా. ప్రతి నెలా ఏదో ఓ కొత్త పుస్తకం చదువుతాను. సాధారణంగా పుస్తక పఠనం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నాకు మెమొరీ కూడా ఎక్కువే. నా సెల్ ఫోన్లో ఉన్న 600 నంబర్లను ఎలా అడిగినా టక్కున చెప్పగలను. బ్రెయిలీ లిపిలో ఉన్న రిస్ట్ వాచ్‌ను, అలాగే టాకింగ్ కంప్యూటర్‌ను వాడతాను.


● ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న షకీర్

## కుటుంబం..

మేము నలుగురు అన్నదమ్ములం. నేనే ఆఖరువాడిని. మూడో అన్నకూ కంటి చూపులేదు. తనూ నాలాగే బ్రెయిలీలో డిగ్రీ వరకు చదువుకుని జగ్గయ్యపేట కాలేజ్‌లో ఇంగ్లిష్ లెక్చరర్‌గా జాబ్ చేస్తున్నాడు. పెద్దవాళ్లిద్దరూ కెనడా, యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

## స్ట్రీట్ లైట్ కాదు.. లైట్ హౌస్

ఇంటర్‌లో ఉన్నప్పుడు బ్రెయిలీలో ఖురాన్‌ను రాసి లిమ్కా బుక్‌లో స్థానం సంపాదించా. అబ్దుల్ కలామ్ నుంచి ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్నప్పుడు .. 'నీవు స్ట్రీట్ లైట్‌వి కావు, లైట్ హౌస్‌వి' అని ఆయన అన్న మాటలు నాకెప్పటికీ ప్రేరణే. వ్యక్తిత్వ వికాసంపై ఉర్దూ, తెలుగు, తమిళం, ఇంగ్లిష్, హిందీలలో అనర్గళంగా క్లాసెస్ ఇవ్వగలను. పర్సనాల్టీ డెవలప్‌మెంట్ పై 2016లో 'స్టార్ట్ ఏ న్యూ లైఫ్ నౌ' అనే పుస్తకాన్నీ రాశా ఇంగ్లిష్‌లో. 2018లో 'విజయీభవ' పేరుతో తెలుగులో కూడా పబ్లిష్ అయింది.

## ప్రపంచమే క్లాస్ రూమ్

నన్నో మోడల్‌గా చూపించి, పది మందిని చైతన్యపర్చడానికి భగవంతుడు ఇలా చేశాడని భావిస్తుంటాను. జాబ్ ట్రయల్స్‌లో ఉన్నప్పుడు అంధత్వం గురించి కొద్దిగా బాధపడేవాడిని. మోటివేషన్ క్లాసులు ఇవ్వడం మొదలుపెట్టాక ఆ బాధ ఎప్పుడూ లేదు. ఇప్పుడు నాకు ప్రపంచమే క్లాస్ రూమ్. యువత ఉద్యోగమే కావాలనుకోకుండా స్వశక్తిపై వృద్ధిలోకి వచ్చి, మరో పదిమందికి ఉపాధి చూపించేలా తయారుకావాలి. వైకల్యం ఉన్నవాళ్లు దాన్నో లోపంగా భావించి బాధపడకుండా ఆత్మవిశ్వాసంతో అధిగమించాలి. మంచి జీవితానికి బాటలు వేసుకోవాలి.

**– గంధం రమణ**, రాజానగరం,

---

**ఏం చేస్తాం.. సమాజం ఇలా ఉంది! మార్చాలంటే మీ చేతుల్లో... మా చేతుల్లో ఉందా? అందరూ కలిసి కూర్చోని ఏడిస్తే మారుతుందా? నవ్వితే మాత్రం మారుతుందంటున్నారు షెఫాలీ పాండే, ప్రీతి దాస్! మారుస్తాం మారుస్తాం అని గ్యాస్ కొట్టకుండా లాఫింగ్ గ్యాస్‌తో మార్పు మొదలెట్టారు! గిల్లితే ఎవరైనా ఏడుస్తారు.కానీ సమాజంలో జరుగుతున్న తప్పలకు మనమే కారణమని వీళ్లు తొడపాశం పెట్టినా నవ్వుతున్నారు!!**


● మన తప్పలను మనకే చూపించి పకాపకా నవ్విస్తున్న షెఫాలీ పాండే.. ప్రీతి దాస్

# గిల్లినా నవ్వుతున్నారు

వ్యంగ్యం మంచి అస్త్రం! బాధ, ఆగ్రహం, ఆవేశాలను అదే రూపంలో తెలియపరచడం కంటే వ్యంగ్యానికి తర్జుమా చేసి ఎక్స్‌ప్రెస్ చేస్తే చేరుకునే రీచ్ ఎక్కువ. అనుకున్న ఫలితం వచ్చే చాన్సూ ఎక్కువే! ఇప్పటికీ కంప్లీట్ హ్యూమర్ కన్నా కూడా వ్యంగ్యం కలిసిన హాస్యానికే మంచి ఆదరణ. అందుకే స్టాండప్ కామెడీకి.. కమెడియన్స్‌కి క్రేజ్ పెరిగిందిప్పుడు. ఎంత సీరియస్ ఇష్యూనైనా సరే వ్యంగ్యాన్ని జోడించి కామెడీ చేస్తే మనోభావాలు దెబ్బతింటున్నాయని బాధపడే గాంభీర్యులు కూడా మనసారా నవ్వుకుంటూ ఆ సెటైర్‌లో దాగిన సమస్యను మెదడుకు ఎక్కించుకుంటున్నారు. అలాంటి స్టాండప్ కామెడీతో కాంట్రాసెప్టివ్ పిల్స్ నుంచి కథువా రేప్, బాలీవుడ్, డేటింగ్, చైల్డ్‌బర్త్, అచ్ఛేదిన్, మేకిన్ ఇండియా, బేటీ బచావో– బేటీ పఢావో వంటి సీరియస్, పొలిటికల్ ఇష్యూస్ దాకా.. అన్నిటి మీద వ్యంగ్యాన్ని జొప్పిస్తూ జోకులు పండిస్తున్నారు, నవ్వుతో జనాలను ఆలోచింపచేస్తున్నారు, అవగాహన కలిగిస్తున్నారా ఇద్దరు మహిళా స్టాండప్ కమెడియన్స్.



''బేటీ బచావో.. బేటీ పఢావో'' అన్న నినాదాన్ని.. దేశంలో మహిళల మీద జరుగుతున్న లైంగికదాడుల నేపథ్యంలో ఇలా ''మా.. బెహన్.. దాదీ.. బేటీ బచావో.. మా .. బెహన్, దాదీ, బేటీ ఛుపావో'' అంటూ వ్యంగ్యంగా మార్చి రాసిన పోస్టర్స్‌ను పెట్టారు ఒక షోలో.

**ఎవరు? షెఫాలీ పాండే, ప్రీతి దాస్. ఎక్కడ? అహ్మదాబాద్‌లో...**

తొమ్మిదేళ్లు న్యూయార్క్‌లో, రెండేళ్లు ముంబైలో ఉండి అహ్మదాబాద్‌కు చేరుకుంది షెఫాలి. ప్రస్తుతం ఒక డిజిటల్ ఏజెన్సీని నిర్వహిస్తోంది. ప్రీతి దాస్.. వృత్తిరీత్యా జర్నలిస్ట్. పీహెచ్‌డీ స్టూడెంట్ కూడా. హాస్యం అంటే ఆసక్తి ఉన్న ఈ ఇద్దరూ 2017లో ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయం అయ్యారు. అప్పుడే ''మహిళా మంచ్'' అనే ఆలోచనను పంచుకున్నారు.

**ఏమిటీ మహిళా మంచ్?**

ఇదో మహిళా స్టాండప్ కామెడీ గ్రూప్. రాజకీయాలు, సామాజిక సమస్యల మీద వ్యంగ్యంతో కామెడీని పంచుతున్నారు. మొదట్లో ఒక ట్రయల్‌గా ఓ స్నేహితురాలి ఇంట్లోనే స్టాండప్ కామెడీ ప్రయోగం చేశారు. డెబ్బై మంది హాజరయ్యారు. ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయిన షెఫాలి, ప్రీతి ఇక మహిళామంచ్‌ను ఆపేదిలేదని నిర్ణయించుకున్నారు.

**టీ.. కాఫీ.. కామెడీ**

ఆ రోజు నుంచి ఈ రోజు దాకా ''మంత్లీ పీరియడ్ షో'' పేరుతో నెలకొకసారి స్టాండప్ కామెడీ షోను నిర్వహిస్తునే ఉన్నారు. కేఫ్‌లు, రెస్టారెంట్స్, స్నేహితుల ఇళ్లే వాళ్ల వేదికలు. టీ, కాఫీతో పాటు కామెడీనీ సర్వ్ చేస్తారు. ఒక్కోసారి ఒక్కో గెస్ట్ స్పీకర్‌లను ఆహ్వానిస్తారు. ఆ స్పీకర్స్ వాళ్ల జీవితానుభవాలను హాస్యంతో పంచుకుంటారు. ''దీనివల్ల ఈ షో చూడ్డానికి వచ్చిన వాళ్లు తాము పడ్తున్న కష్టాలను తేలిగ్గా తీసుకొని ఆత్మవిశ్వాసం పెంచుకుంటారు. అందువల్లే గెస్ట్ స్పీకర్స్‌నూ పిలుస్తున్నాం'' అంటారు షెఫాలి అండ్ ప్రీతి.


● 'మంత్లీ పీరియడ్ షో'లో...

**వ్యవస్థ మీదే తప్ప వ్యక్తుల మీద కాదు**

వ్యక్తుల బలహీనతలు, లోపాల మీద వీళ్లు కామెడీ చేయరు. మొదట్లో చెప్పుకున్నట్టు వ్యవస్థలోని లోపాలు, పాలసీల మీదే వ్యంగ్యోక్తులు, ఛలోక్తులు విసురుతారు. ప్రీతిదాస్‌కు రాజకీయాల మీద కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఆమె చేసే కామెడీ రాజకీయాల మీదే ఉంటుంది. షెఫాలీ మహిళా సమస్యల మీద బాగా స్పందిస్తుంది. అవే ఆమె హాస్యానికి అంశాలవుతాయి. రుతుక్రమం మీది అపోహల మీద ప్రీతి జోక్స్ వేస్తే వెంటనే డేటింగ్ మీద, దేశీ పోర్న్ మీద షెఫాలీ కామెడీ పుట్టిస్తుంది. అలా ఇద్దరు అప్పటికప్పుడు ఆశువుగా హాస్యాన్ని పండిస్తూ మహిళా స్టాండప్ కమెడియన్స్‌కున్న హద్దులు చెరిపేస్తున్నారు. కడుపుబ్బా ప్రేక్షకులను నవ్విస్తున్నారు. ఆలోచనలను రేకెత్తిస్తున్నారు. ''సహజంగానే బ్రెయిన్ అండ్ పవర్ తమ సొత్తు అనుకుంటారు మగవాళ్లు. మాలాంటి వాళ్లను వేదిక మీద చూసేసరికి కంగుతింటున్నారు. సమకాలీన రాజకీయాలు, టెక్నాలజీ మీద మేం జోక్స్ వేస్తుంటే చాలా మంది నోళ్లు వెళ్లబెడ్తుంటారు. అన్నం, పప్పు, చారు, చట్నీ కాకుండా వీళ్లకు ఇవి కూడా తెలుసా? అన్నట్టు ఉంటాయి వారి ఎక్స్‌ప్రెషన్స్'' అంటుంది షెఫాలీ.

**మా .. బెహన్ షో**

సాధారణంగా మన సమాజంలో మగవాళ్లను తిట్టే.. మగవాళ్లు తిట్టుకునే తిట్లు కూడా అమ్మ, అక్క ఆలీ మీదే ఉంటాయి. అలాంటి తిట్లకు చెక్ పెట్టడానికి వీళ్లు 'మా.. బెహన్ షో' చేశారు. విశేష ఆదరణ లభించింది. గ్యాంగ్స్ ఆఫ్ వస్సేపూర్‌లోని పాటలకు పేరడీ పాటలు రాసి ఒక షో నిర్వహించారు. గుజరాత్‌లోని చట్టవ్యతిరేకమైన సారా వ్యాపారం మీద ''అవర్ బేవ్డా గుజరాత్'' పేరుతో కామెడీ షో చేశారు. దానికి ఆరువందల మంది హాజరయ్యారట. వీళ్ల షోలన్నీ ఉచితంగానే ఉంటాయి. కనీసం రికార్డ్ చేసుకొని యూట్యూబ్ చానెల్‌లో పెట్టుకోవడం, ఆ వీక్షణల ద్వారా డబ్బు సంపాదించుకోవడమూ ఉండదు. కారణం హాస్యాన్ని వాళ్లంత పవిత్రంగా చూస్తారట. షో అయిపోగానే ఓ హ్యాట్ పట్టుకొని ప్రతి వ్యక్తి దగ్గరకు వెళ్తారు తోచింది అందులో వేయమని అంతే. అలా వచ్చిన డబ్బు మైక్ ఖర్చులకు సరిపోతే చాలనుకుంటారు.

**జాగ్రత్త... జనాలు గమనిస్తున్నారు..**

''ఎంత మా షోలను ఆదరిస్తున్నా ఛాందస, సంప్రదాయ అహ్మదాబాద్ ఏదో రకంగా మమ్మల్ని వెనక్కిలాగే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. మా పేరెంట్స్ మా షోస్‌కి రారు. రాకపోగా... 'జాగ్రత్త.. జనాలు గమనిస్తున్నారు' అంటూ సున్నితంగా హెచ్చరిస్తుంటారు. మావారు, మా అబ్బాయి మాత్రం ప్రతీ షో అటెండ్ అవుతారు. అరేంజ్‌మెంట్స్‌లోనూ హెల్ప్ కూడా చేస్తారు. మా క్లోజ్ ఫ్రెండ్స్ అయితే మా షోస్ చూసి '' మీ మీద ఫెమినిస్ట్‌లనే ముద్రేస్తారేమో జనాలు అంటూ భయపడ్తుంటారు'' అని చెప్తుంది ప్రీతీ దాస్. ''మా జీవితానుభవాలతోనే కామెడీ చేస్తాం కాబట్టి మా కామెడీలో నిజాలే ఉంటాయి'' అంటుంది షెఫాలీ పాండే. ''మంత్లీ పీరియడ్ షోస్‌ను ఇంకా విస్తరించాలనుకుంటున్నాం. మరింత మంది మహిళలు వచ్చేలా... మరిన్ని సిటీస్‌కి చేరేలా'' అంటూ తమ లక్ష్యాన్ని చెప్పారు ఇద్దరూ.

---

ఇంటింటి రాఖీ

**రాఖీ పండుగ ఎప్పుడు వస్తుందా.. అన్నదమ్ములకు ఎప్పుడెప్పుడు రాఖీ కడదామా అని అక్కచెల్లెళ్లు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటారు. రాఖీని కొనడం కంటే, ఇంట్లోనే ప్రేమ బంధనంతో స్వయంగా రాఖీని తయారుచేసి, అన్నాతమ్ముళ్ల చేతులకు కడితే ఎంత సంతోషంగా ఉంటుందో కదా! అలా ఇంట్లో తయారు చేసిన ఈ రాఖీ చూడండి... ఎంత బాగుందో ! మీరూ ట్రై చేయొచ్చు. ఎలాగో చూద్దాం.**

# ప్రేమ బంధనం








**కావలసినవి**

ఎరుపు రంగు ఊలు, నీలం రంగు ఊలు, తెల్ల ముత్యాల వంటి పూసలు, రంగు రంగుల పూసలు, ఫ్యాబ్రిక్ గ్లూ లేదా ఫెవికాల్ ట్యూబ్, ఫోమ్ షీట్, స్టీల్ స్పూను, తెల్ల రాళ్ల చెయిన్

**తయారీ**

1 స్టీల్ స్పూను వెనుక భాగానికి ఫెవికాల్ పూసి, ఎరుపు రంగు ఊలుని గుండ్రంగా చుట్టి, పది నిమిషాలు ఆరబెట్టాలి.
2 నీలం రంగు ఊలును రెండు పొరలుగా తీసుకుని, రంగుల పూసలను అటు ఇటు సమానంగా డిజైన్ వచ్చేలా ఊలులోకి ఎక్కించి, పూసలు రెండు వైపులా సమంగా విడదీసి మధ్య భాగం ఖాళీ ఉంచాలి.
3 స్పూను మీద గుండ్రంగా చుట్టిన ఊలును జాగ్రత్తగా వేరు చేసి, దాని మధ్యలో ఒక పెద్ద ముత్యం అతికించాలి.. మళ్లీ దాని చుట్టూ తెల్ల రాళ్ల చెయిన్‌ను సర్కిల్‌లా అతికించాలి.
4 దీనిని నీలం రంగు ఊలు మీద అతికించాలి.
5 దారం కనిపించకుండా ఫోమ్ ముక్కనూ అతికించాలి.
6 పూసలు పడిపోకుండా వాటి దగ్గర ముడి వేయాలి.
7 ఇప్పుడు చూడండి.. మీ అన్నదమ్ముల మీద మీకున్న ప్రేమను ప్రతిబింబిస్తూ.. మీ చేతుల్లో రూపుదిద్దుకున్న అందమైన రాఖీని!

*సో.. సింపుల్ కదా. ఇంకేం ప్రయత్నించండి మరి..!*










---

# ప్రేమ, త్యాగం, భక్తి.. అదే బక్రీద్ సందేశం

నేడు బక్రీద్ పర్వదినం

ఈదుల్ అజ్ హా ఒక మహత్తర పర్వదినం. దీన్ని సాధారణంగా బక్రీద్ పండుగ అని వ్యవహరిస్తారు. బక్రీద్ పేరు వినగానే మొట్టమొదట మనకు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, హజ్రత్ ఇస్మాయిల్ అలైహిస్సలాంల పేర్లు గుర్తుకొస్తాయి. ఆ మహనీయుల విశ్వాస పటిమ, వారి త్యాగనిరతి కళ్ళముందు కదలాడుతుంది. దాంతో మనసు, తనువు తన్మయత్వంతో పులకించి పోతుంది. భక్తిభావంతో శిరస్సు వినమ్రంగా వంగిపోతుంది. గుండెలనిండా విశ్వాసం ఉప్పొంగుతుంది. అలనాటి ఆ మధుర ఘట్టాలు ఒక్కొక్కటిగా మనోతెరపై ఆవిష్కృతమవుతాయి. ఆ మహనీయుల ఒక్కో ఆచరణను స్మరించుకుంటూ జరుపుకునే పర్వమే ఈదుల్ అజ్ హా..అదే బక్రీద్ .

సాధారణంగా పండుగలంటే తిని తాగి, భౌతికంగా పొందే తాత్కాలిక సంతోషం అనుకుంటారు. కాని అదొక అద్వితీయమైన, అనిర్వచనీయమైన, అలౌకిక ఆత్మానందం. మొన్న మొన్ననే మనల్ని వీడిన రమజాన్ తరువాత బక్రీద్ రూపంలో మరో అద్భుత అవకాశం మనల్ని వరించింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పుణ్యకార్యాలు ఆచరించి అత్యంత శ్రేష్ఠ సామగ్రి అయిన 'తఖ్వా' (దైవభీతి)ను హృదయాల్లో ప్రతిష్టించుకోవాలి. జీవితం సార్థకం కావాలంటే పరమ ప్రభువు ఆదేశాలను తు.చ. తప్పక పాటించాలి. అందుకే పరమ దయాళువైన అల్లాహ్ మనకోసం కొన్ని పర్వాల్ని ప్రసాదించాడు.

ఈ నెలలోని మొదటి పది రోజులు ఒక ప్రత్యేకత వైశిష్ట్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ రోజుల్లో చేసిన పుణ్యకార్యాలు అల్లాహ్‌కు అన్నిటికన్నా ఎక్కువ ప్రీతికరమైనవి. నిజానికి జిల్ హజ్ పదవ తేదీన జరుపుకొనే బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ. హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిముస్సలాంల త్యాగాలను స్మరించుకునే త్యాగోత్సవం. ప్రపంచ విశ్వాసుల పర్వదినం. ఇదేదో షరా మామూలుగా జరిగే ఆచారం కాదు. ఇదొక మహత్తర సందేశం కలిగిన శుభదినం. క్రియా రూపంలో దైవ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అద్భుత ప్రక్రియ. మనిషి తనను తాను తగ్గించుకొని, వినమ్ర పూర్వకంగా అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన ఘనతను కీర్తించే గొప్పరోజు. మనందరి ప్రభువు ఒక్కడే, మనందరి ప్రవక్త ఒక్కరే, మనందరి గ్రంథం ఒక్కటే. మనందరి ధర్మం ఒక్కటే. మనమంతా ఒక్కటే. సమస్త మానవజాతీ ఒక్కటే.. అని ఎలుగెత్తి చాటే రోజు. మానవ సహజ దౌర్బల్యాల వల్ల పాక్షిక విభేదాలు ఉన్నప్పటికీ మనందరి విశ్వాసం కూడా ఒక్కటే అనడానికి ప్రబల తార్కాణం ఈ పండుగ. మౌలిక విశ్వాసపరంగా ఒక్కటిగానే ఉన్న మనం పాక్షిక పొరపొచ్చాలను విస్మరించి తోటి సోదరుల్ని గుండెలకు హత్తుకోవాల్సిన రోజు. ఈ పర్వదినం మనకిచ్చే మరో సందేశం ఏమిటంటే, సమాజాన్ని కలుపుకుపోకుండా, సాటి ప్రజల పట్ల ప్రేమ, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోకుండా ఏ సంతోషమయినా, ఎంతటి ఆనందమైనా పరిపూర్ణం కాజాలదు. ఏ సంతోష కార్యమైనా సమాజంతో పంచుకోవాలని, కేవలం మన గురించి మాత్రమే కాకుండా సంఘం గురించి, సమాజం గురించి ఆలోచించాలని చెబుతుంది పండుగ.

ప్రతి ఒక్కరూ తమ స్థాయి, స్తోమతకు తగినట్లు ఈద్ జరుపుకుంటారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు జిల్ హజ్జ్ నెలలో 'హజ్ 'యాత్రకు వెళతారు. అంతటి స్థోమత లేనివారు ఇళ్ళ వద్దనే ఖుర్బానీలు ఇస్తారు. అది కూడా లేనివారు రెండు రకాతుల నమాజ్ ఆచరించినా దయామయుడైన అల్లాహ్ హజ్, ఖుర్బానీలు ఆచరించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఆయన తన దాసుల చిత్తశుద్ధిని, సంకల్పాన్ని మాత్రమే చూస్తాడు. ఆయనకు ధనరాశులు, రక్తమాంసాల అవసరం ఎంతమాత్రం లేదు. కనుక సర్వకాల సర్వావస్థల్లో చిత్తశుద్ధితో కూడిన సత్కర్మలు ఆచరించాలి. పేదసాదల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాల్లో వారిని ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. ఆనందంలో వారినీ భాగస్వాములను చేయాలి. అప్పుడే నిజమైన పండుగ. తన అవసరాలను త్యజించి దైవప్రసన్నత కోసం ఇతరుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వమని చెప్పేదే ఈ త్యాగాల పండుగ. మంచికోసం మానవ సంక్షేమం కోసం, ధర్మం కోసం, ధర్మసంస్థాపన కోసం ఎంతోకొంత త్యాగం చెయ్యాలన్న సందేశం ఇందులో ఉంది.



**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

epaper.sakshi.com

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ అన్నయ్యా! నేనొక అమ్మాయిని తొమ్మిదేళ్లుగా ప్రేమిస్తున్నాను. నేను ప్రపోజ్ చేసిన ప్పుడే.. 'నన్ను పెళ్లి చేసుకుంటావా! ఎలాంటి పరిస్థితి వచ్చినా వదిలేయను' అని మాట ఇస్తే నాకు ఇష్టమే అని చెప్పింది. అప్పటి నుంచి తను నా భార్యగా ఫీల్ అవుతూ నాతో సంతోషంగా ఉంది. తనకి నేనంటే ప్రాణం. వాళ్ళ ఇంట్లో మా పెళ్లికి ఒప్పుకున్నారు. కానీ వేరే నేప థ్యాలు కావడం వల్ల మా పెళ్లికి మా అమ్మ ఒప్పుకోవడం లేదు. ఇప్పుడు తనని పెళ్లి చేసు కుంటే మా అమ్మ నాతో ఉండదు. ఒంటరివా డిని అయిపోతాను. ఇంట్లో వాళ్ళకి 'వేరే పెళ్లి చేసుకుంటాను' అని చెప్పాను. ఆ అమ్మాయి నేను లేకుండా ఉండలేదు. 'నాకు నువ్వు కాకుండా ఇంకో జీవితం లేదు. మనం పెళ్లి చేసుకుందాం' అంటోంది. 'నువ్వు దూరమైతే చనిపోతాను' అని బెదిరిస్తోంది. తను నన్ను అర్థం చేసుకోవడం లేదు. నేనేం చేయాలో చెప్పండి అన్నయ్యా!

– మురళీకృష్ణ



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

ఓరి ప్రేమ ద్రోహి..!

'ఏంటి సార్ అంత మాట అనేశారు?'

చూడు నీలూ! మురళీకృష్ణ మంచివాడే కానీ, ప్రేమకు ద్రోహం చేస్తున్నాడు!

'మరి అమ్మ ప్రేమ కూడా ప్రేమే కదా సార్?'

ఆ విషయం అమ్మాయికి ప్రామిస్ చేసే ముందు తెలిసి చావాలి.

'మరి ఇప్పుడేం చెయ్యాలి సార్???'

మాట ఇస్తే నిలబెట్టుకోవడం మన ప్రేమి కుల రక్తంలో ఉంది. అమ్మాయి ముందే అడి గింది 'నువ్వు సీరియస్ కాండిడేట్‌వా లేక కన్ఫ్యూజన్ కాండిడేట్‌వా' అని. అప్పుడేమో 'నిన్నే పెళ్లాడతా..! ప్రేమించుకుందాం రా..!! ఏక్ దూజే కే లియే..!!, ఉండిపోరాదే గుండె నీదేలే!!' అని సినిమా స్టోరీస్ చెప్పి ఇప్పుడు 'అమ్మ కొడుతుంది' అని ఏడిస్తే.. అది ద్రోహం కాదా నీలూ? మురళీకృష్ణ మంచివా డైనా ప్రేమద్రోహిగా చరిత్రలో నిలిచిపోడా నీలూ????

'అవును మురళీకృష్ణా...! అమ్మాయికి అన్యాయం చేయకు. అమ్మ కూడా అర్థం చేసు కునేలా చెయ్యి. అమ్మాయిని అలా ఏకాకిలా వదిలెయ్యడం నీలాంటి మంచి వ్యక్తికి కరెక్ట్ కాదు!'

**ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.**
**లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబర్ 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.**
lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

**పల్లవి :**
మధుర మధురతర
మీనాక్షి కంచిపట్టునా కామాక్షి
మహిని మహిమగల మీనాక్షి కాశీలో విశాలాక్షి
॥మధుర॥
జాజిమల్లెలా ఘుమఘుమలా జావళీ
(2)
లేత సిగ్గుల సరిగమలా జాబిలీ
అమ్మా మీనాక్షి ఇది నీ మీనాక్షి
వరములు చిలక స్వరములు చిలక కరమున చిలక కలదానా
హిమగిరి చిలక శివగిరి చిలక
మమతల చిలక దిగిరావా
॥మధుర॥

**చరణం : 1**
శృంగారం వాగైనది ఆ వాగే వైగైనది
ముడిపెట్టే ఏరైనది విడిపోతే నీరైనది
భరతనాట్య సంభరిత నర్తని కూచిపూడినో తక ధిమిత
విశ్వనాథుని ఏకవీర ఆ తమిళ మహిళల వలపు కదా
మనసే మధురై కొలువైన తల్లి మా మీనాక్షి
ఎదలో యమునై పొంగేటి ప్రేమకి నీ సాక్షి
॥వరముల॥

**చరణం : 2**
అందాలే అష్టోత్తరం చదివించే సొగసున్నదీ
సొగసంతా నీరాజనం అర్పించే మనసున్నదీ
మధురనేలు మా తెలుగు నాయకుల మధుర సాహితి రసికతలో
కట్టబొమ్మ తొడగొట్టి లేచినా తెలుగువీర ఘన చరితలలో
తెలుగు తమిళం జతకట్టినెన్నడో మీనాక్షి
మనసు మనసు ఒకటైన జంటకి నీ సాక్షి
॥వరముల॥ ॥మధుర॥

**చిత్రం : అర్జున్ (2004)**
**రచన : వేటూరి**
**సంగీతం : మణిశర్మ**
**గానం : ఉన్నికృష్ణన్, హరిణి**

# డిఫెన్స్ ఇష్టముండదు.. కొడితే సిక్సరే!

**– ప్రభాస్**



విక్కీ, శ్రద్ధా కపూర్, ప్రభాస్, ప్రమోద్

''గల్లీ క్రికెట్‌లో సిక్సర్ ఎవడైనా కొడతాడు. స్టేడియంలో సిక్స్ కొట్టేవాడికే ఒక రేంజ్ ఉంటుంది'' అనే డైలాగ్‌తో 'సాహో' ట్రైలర్ యూట్యూబ్‌లో సంచలనాలు సృష్టిస్తోంది. ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వం వహించిన చిత్రం 'సాహో'. శ్రద్ధా కపూర్ కథానాయిక. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో ప్రభాస్ మాట్లాడుతూ– ''స్క్రీన్‌ప్లే ప్రధానమైన స్క్రిప్ట్ ఇది. నిఖిల్, సుజీత్ ఇద్దరూ ట్రైలర్ కట్ చేశారు. 137 వెర్షన్స్ కట్స్ చేశారు. సినిమా చూశాక ట్రైలర్ కట్ చేయడం ఎంత కష్టమో అనిపిస్తుంది. జిబ్రాన్ బ్యాగ్రౌండ్ స్కోర్ చేస్తున్నాడు. ప్రమోద్, నేను కలసి పెరిగాం. మేం ఫ్రెండ్స్ కాదు.. ఫ్యామిలీ. అందుకే ఈ సినిమా బాగా ఆడాలని కోరుకుంటున్నాను. 'సాహో' లో యాక్షన్ సన్నివేశాలు చాలా కొత్తగా ఉంటాయి'' అన్నారు. ''హైదరాబాద్ నా రెండో ఇల్లు. రెండేళ్లుగా 'సాహో' షూటింగ్ చేస్తున్నాం.

**'సాహో' ట్రైలర్ చూసి రాజమౌళి గారు బావుందని చెప్పారు. షాక్ ఏంటంటే చిరంజీవిగారు ఫోన్ చేశారు. బావుందని అభినందించారు. మెసేజ్ కూడా చేశారు. ఫుల్ హ్యాపీ అనిపించింది.**

ఇలాంటి సినిమాతో తెలుగులో పరిచయం కావడం చాలా బావుంది'' అన్నారు శ్రద్ధా కపూర్. ''సాహో' ఫస్ట్ తెలుగు సినిమా. ఆ తర్వాత ప్యాన్ ఇండియా సినిమా. ఇక నుంచి నాన్‌స్టాప్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తాం'' అన్నారు ప్రమోద్. ''సాహో'ను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నాం. కొన్ని థియేటర్స్‌లో 'సాహో' కోసమని స్క్రీన్‌లు, సౌండ్ సిస్టమ్‌లు అప్‌డేట్ చేస్తున్నారు. ఐమాక్స్ ఫార్మాట్‌లోనూ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు విక్కీ.

ఈ సందర్భంగా విలేకరులతో ప్రభాస్, శ్రద్ధా మాటామంతీ...

**● ప్రభాస్‌తో రొమాన్స్, యాక్షన్ రెండూ చేశారు. దేన్ని ఎక్కువ ఎంజాయ్ చేశారు?**

**శ్రద్ధా కపూర్ :** రెండూ (నవ్వుతూ)

**● శ్రద్ధా సెట్స్‌లో తెలుగులో ఎలా మాట్లాడారు.**

**ప్రభాస్:** షూటింగ్ ఫస్ట్‌డే నుంచి తెలుగు డైలాగ్స్ బాగా చెప్పింది. మేం షాక్ అయ్యాం. చాలా కష్టపడి నేర్చుకున్నారు. శ్రద్ధా మంచి లవ్‌స్టోరీలు చేసింది. యాక్షన్ మూవీలో ఎలా ఉంటుందో అనుకున్నాం. మమ్మల్ని సర్‌ప్రైజ్ చేసింది.

**● సుజీత్ మీద 'బాహుబలి' సినిమా తాలూకా ఒత్తిడి ఏమైనా ఉందా?**

**ప్రభాస్ :** సుజీత్ మీదే కాదు.. మా అందరి మీద కూడా ఒత్తిడి ఉంది. అందుకే టైమ్ తీసుకుని క్వాలిటీగా చేశాం. అతని వయసు తక్కువ. సినిమాలో పెద్ద టెక్నీషియన్స్‌ని బాగా డీల్ చేశాడు. సెట్లో తను కోప్పడటం, అరవడం కనబడలేదు.

**● ఒక సినిమా అనుభమున్న సుజీత్‌ని ఎలా నమ్మారు? సినిమా అనుకున్నట్టే తీస్తున్నాడు అని ఏ పాయింట్‌లో అనిపించింది.**

**ప్రభాస్ :** ఫస్ట్ డే షూట్ చాలా క్లిష్టమైన సన్నివేశం. ఒక్క సీన్ 5–6 వేరియేషన్స్ ఉంటాయి. సినిమాలో నాలుగైదు సార్లు వస్తుంది. సినిమాను దాంతోనే స్టార్ట్ చేశాం. రీషూట్ చేయలేదు, కరెక్షన్ లేదు. స్టోరీలో 8 లేయర్స్ ఉంటాయి. అంత ఈజీగా డీల్ చేసినప్పుడే తను చేయగలడనిపించింది.

**● 'సాహో'తో బాలీవుడ్ బాద్‌షా అవుతారని అనుకుంటున్నారా?**

**● 'సాహో'తో ఖాన్స్‌కి షాక్ ఇవ్వబోతున్నారా?**

ఖాన్స్ (సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్) ఇండియాను ఇన్‌స్పైర్ చేశారు. వాళ్లకు పోటీ అని అనకూడదు. బాలీవుడ్ వాళ్లు నన్ను బాగా ఆదరించారు. పెద్ద పెద్ద స్టార్స్ నాకు మెసేజ్‌లు పంపారు.

**ప్రభాస్:** 'బాహుబలి' ఆడియన్స్‌ను, ఫ్యాన్స్‌ను ఎంటర్‌టైన్ చేయాలి. దానికోసం పగలు, రాత్రి కష్టపడ్డాం. వాళ్ల సంతృప్తి చెందితే చాలు. సినిమా బాగా ఆడాలనుకుంటున్నాను.

**● ట్రైలర్‌లో సిక్సర్ డైలాగ్ ఉంది. మీరు సిక్సర్ కొడతారా?**

**ప్రభాస్ :** నేను క్రికెట్ ఆడటానికి వెళ్లినప్పుడు లాగి కొట్టడమే. తగిలితే సిక్సరే. డిఫెన్స్ ఆడటం ఇష్టముండదు.

**● యాక్షన్స్ సీన్స్ చాలెంజింగ్‌గా అనిపించాయా?**

**ప్రభాస్ :** చాలా మంది ఫైట్ మాస్టర్స్ ఉన్నారు. చాలా యాక్షన్ సన్నివేశాలున్నాయి. కొన్నిటి కోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాం. స్టోరీ బోర్డ్‌లు వేశాం. ప్రీ– ప్రొడక్షన్ ఎక్కువ ఉంది.

**శ్రద్ధా :** మొదట్లో గన్ పట్టుకున్నప్పుడు చేతులు వణికేవి. నేను పోలీస్ ఆఫీసర్ పాత్ర చేస్తూ అలా వణకకూడదు. తర్వాత గన్ పట్టుకోవడం అలవాటు అయింది.

# కో అంటే కోటి గుర్తుకొచ్చింది

**- రామ్ చరణ్**



నాగ వంశీ, శర్వానంద్, రామ్‌చరణ్

''రణరంగం' సౌండ్ కట్ ట్రైలర్ చాలా కొత్తగా ఉంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ చూశా. శర్వానంద్‌ని మేము ఎలా అయితే చూడాలనుకున్నామో అలాగే ఉంది. తనకు కరెక్ట్‌గా సరిపోయింది'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. శర్వానంద్, కాజల్ అగర్వాల్, కళ్యాణి ప్రియదర్శన్ హీరో హీరోయిన్లుగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రణరంగం'. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సినిమా సౌండ్ కట్ ట్రైలర్‌ని రామ్‌చరణ్ విడుదల చేసి, మాట్లాడుతూ– 'శర్వాలో కష్టపడేతత్వం ఉంది. అదే మాకు నచ్చింది. అతని చిత్రాల్లో 'కో అంటే కోటి' నాకిష్టం. అలాంటి ఇంటెన్సిటీతో ఉన్న చిత్రం శర్వాకు పడితే బాగుంటుంది అనుకునేవాణ్ణి. సౌండ్ కట్ ట్రైలర్ చూసిన తర్వాత 'రణరంగం' అలాంటి చిత్రం అనిపించింది. ఈ సినిమాతో సుధీర్‌వర్మ తన ప్రతిభను మళ్లీ నిరూపించుకున్నారనిపించింది. సన్నివేశాల తాలూకు కట్స్ చాలా ఆసక్తిగా ఉన్నాయి. ప్రశాంత్ పిళ్లై సంగీతం బాగుండటంతో పాటు కొత్తగా ఉంది'' అన్నారు. శర్వానంద్, సూర్యదేవర నాగవంశీ పాల్గొన్నారు.




చేతన్ భరద్వాజ, పి.కిరణ్, నాగార్జున, రాహుల్ రవీంద్రన్, ఛోటా కె.ప్రసాద్

# కొత్తగా చేయటం నాన్న నుంచి నేర్చుకున్నా

**- నాగార్జున**

''ఒకసారి సక్సెస్ అయిన తర్వాత దాన్నే పట్టుకొని ఎక్కువ సమయం గడపాలనుకోను. ఆ అనుభవాన్ని ఉపయోగించుకుని కొత్తవారికి అవకాశాలు ఇస్తూ ప్రయోగాత్మక సినిమాలను ప్రయత్నించాలి. ఈ ఆలోచనే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. నాన్నగారికి(అక్కినేని నాగేశ్వరరావు) అంత లాంగ్ కెరీర్, విభిన్నమైన పాత్రలు వచ్చాయంటే కారణం ఎప్పుడూ కొత్తగా ప్రయత్నిస్తుండటమే. ఆయన చేసిన సినిమాలు గమనిస్తే న్యూ ఏజ్ సినిమాలే ఎక్కువగా ఉంటాయి. కొత్తగా ప్రయత్నించడాన్ని నాన్నగారి నుంచి నేర్చుకున్నాను'' అని నాగార్జున అన్నారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో నాగార్జున, రకుల్‌ప్రీత్‌సింగ్ జంటగా నటించిన చిత్రం 'మన్మథుడు 2'. నాగార్జున, పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలైంది. హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ –''నాలోని కొత్తదనం కోసం 'మన్మథుడు 2' సినిమా తీశాను. ఇండస్ట్రీలో డివైడ్ టాక్ ఉందంటున్నారు. ప్రేక్షకుల్లో మాత్రం సినిమా గురించి పాజిటివ్ టాక్ నడుస్తోంది. మౌత్ టాక్ బాగుంది. మంచి కలెక్షన్స్ వస్తున్నాయి. నిజంగా మా సినిమా ఆడియన్స్‌కు నచ్చకపోతే కలెక్షన్స్ రావు. నా కెరీర్‌లో మంచి విజయాలు సాధించిన 'గీతాంజలి, అన్నమయ్య, నిర్ణయం, మన్మథుడు' సినిమాలు రిలీజ్ తర్వాత కాస్త నెమ్మదిగా పుంజుకున్నాయి. ఈ చిత్రం కూడా అలానే ఉండొచ్చు. అలాగని ఆ సినిమాలతో 'మన్మథుడు 2' కి పోలిక లేదు. 'మన్మథుడు 2' మంచి న్యూ ఏజ్ మూవీ అంటూ ఫోన్లు చేస్తున్నారు. రొమాన్స్ సన్నివేశాలు మరీ ఇబ్బందికరంగా లేవు. నాకు రొమాన్స్ అంటే ఇష్టం. ప్రేక్షకులు మెచ్చే రొమాంటిక్ సినిమాలు చేయడం ఆసక్తి. 'మన్మథుడు' వంటి కల్ట్ క్లాసిక్ సినిమాల టైటిల్స్‌ను ఉపయోగించడం వల్ల ప్లస్‌లతో పాటు మైనస్‌లూ ఉంటాయి. 'బిగ్‌బాస్ 3' కొత్త అనుభూతి. తెలుగు సినిమాలకు (మహానటి, రంగస్థలం, అ!, చి!ల!సౌ') ఏడు అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు. ''ప్రేక్షకులు మా సినిమా చూసి నవ్వుతూ, చప్పట్లు కొడుతూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సైలెంట్‌గా క్లైమాక్స్‌ను చూసి థియేటర్స్ నుంచి నవ్వుతూ బయటకు వస్తున్నారు'' అన్నారు రాహుల్ రవీంద్రన్. ''సినిమాకు తొలిరోజు మిక్స్‌డ్ టాక్ వచ్చినా థియేటర్స్‌లో ఆడియన్స్ సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు పి. కిరణ్. సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్, రచయిత–నటుడు కిట్టు, ఎడిటర్ ఛోటా కె.ప్రసాద్ మాట్లాడారు.



తాప్సీ

## కొత్త లుక్‌లో థ్రిల్

సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సినిమాల్లో భయపెట్టడానికి దెయ్యం, పాడుబడిన భవంతులు, చీకట్లో కొన్ని సన్నివేశాలు తీయడం కామన్. ఇవేమీ లేకుండా ఓ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ ప్లాన్ చేశారు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్. తాప్సీ ముఖ్య పాత్రలో నటించనున్నారు. ఇది వరకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో వచ్చిన 'మన్‌మర్జియా', ఆయన నిర్మాణంలో వచ్చిన 'సాండ్ కీ ఆంఖే'లో హీరోయిన్‌గా నటించారు తాప్సీ. ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ విశేషాలను తాప్సీ తెలుపుతూ – ''ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్ మీద చూడనటువంటి అంశాలు మా సినిమాలో ఉంటాయి. ఈ సినిమాలో పలు గెటప్స్‌లో కనిపిస్తాను. గుర్తుపట్టలేనటువంటి లుక్ కాదు కానీ ఇప్పటివరకూ మీరు చూడని గెటప్‌లో మాత్రం కచ్చితంగా కనిపిస్తాను. షూటింగ్ మొత్తం విదేశాల్లో చేస్తాం. అనురాగ్‌తో సినిమా అంటే మానసికంగా ప్రిపేర్ అయ్యుండాలి. షూటింగ్ ముందు ఏదో ఓ బాంబ్ వేస్తాడు. 'మన్‌మర్జియా' షూటింగ్ రెండు రోజుల ముందు జుత్తు మొత్తం రంగు వేసుకోమన్నాడు. అందుకే ఈసారి నేను రెడీగా ఉన్నాను. గుండు చేయించుకోవడానికి తప్ప ఏం చేయమన్నా చేయడానికి సిద్ధంగానే ఉన్నాను (నవ్వుతూ)'' అన్నారు.



వాసు, అమలాపాల్, సాయి శ్రీనివాస్, రమేష్ వర్మ, కోనేరు సత్యనారాయణ, అభిషేక్ నామా, మారుతి

# రాక్షసుడు సంతృప్తి ఇచ్చింది

**-కోనేరు సత్యనారాయణ**

''తెలుగు రాష్ట్రాల్లో 'రాక్షసుడు' సినిమా పేరు మార్మోగుతోంది. కొన్ని థియేటర్స్ కూడా పెంచాం. అనుకున్న ఫలితాన్ని సాధించినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు నిర్మాత కోనేరు సత్యనారాయణ. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ నిర్మించారు. అభిషేక్ నామా ఈ నెల 2న ఈ సినిమాని విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సక్సెస్‌మీట్‌లో కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ–''రాక్షసుడు' బాగుందని అందరూ అంటుంటే సంతోషంగా ఉంది. మంచి కలెక్షన్స్ వస్తున్నాయి. సాయిశ్రీనివాస్ ఇదివరకు హీరోయిజం ఉన్న సినిమాలు చేశారు. 'రాక్షసుడు' లో హీరో పాత్రకు వందశాతం న్యాయం చేశాడు. రమేష్ వర్మ నా పేరును నిలబెట్టాడని గర్వంగా చెప్పగలను. ఈ సినిమాను లెక్కలు వేసుకుని తీయలేదు. మంచి సినిమా తీశారని అందరూ ప్రశంసిస్తుంటే సంతృప్తిగా ఉంది. చేసే పనిలో మనం ఆనందం వెతుక్కుంటే డబ్బు దానంతటదే వస్తుంది'' అన్నారు. ''రాక్షసన్'కి 'రాక్షసుడు' పర్ఫెక్ట్ రీమేక్. రమేష్‌వర్మ సిన్సియర్‌గా తీశారు'' అన్నారు దర్శకుడు మారుతి. ''రాక్షసన్' లాంటి సినిమాను ధైర్యంగా తెలుగులో రీమేక్ చేశారు రమేష్ గారు. సాయి ఇలాంటి పాత్రలు మరెన్నో చేయాలి. ఈ సినిమా వందరోజుల వేడుకలో పాల్గొనాలని ఉంది'' అన్నారు నటి అమలా పాల్. ''కొన్ని సినిమాలు కమర్షియల్‌గా హిట్ సాధిస్తాయి. మరికొన్ని విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంటాయి. మా సినిమాకు ఆ రెండూ వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు సాయి శ్రీనివాస్. ''తొలివారంలో 'రాక్షసుడు' చిత్రం దాదాపు 32కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసింది. సెకండ్‌వీక్ లోనూ మంచి కలెక్షన్స్ వస్తున్నాయి. బయ్యర్స్ హ్యాపీ'' అన్నారు అభిషేక్ నామా. ''సాయితో నేను బాగా నటింపజేశానని అందరూ అంటున్నారు.. కానీ సాయి అంత బాగా నటించాడు'' అన్నారు రమేష్ వర్మ. ''సత్యనారాయణగారిలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి అవసరం'' అన్నారు నిర్మాత భరత్ చౌదరి. నిర్మాత మల్టీడైమెన్షన్ వాసు, కెమెరామేన్ వెంకట్ పాల్గొన్నారు.

## అనుకోని అతిథి

ఫహద్ ఫాసిల్, సాయి పల్లవి, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి ముఖ్య తారలుగా వివేక్ దర్శకత్వంలో వచ్చిన మలయాళ సైకలాజికల్ థ్రిల్లర్ 'అధిరన్'. ఈ సినిమా 'అనుకోని అతిథి' టైటిల్‌తో తెలుగులో విడుదలకానుంది. దీప సురేందర్ రెడ్డి సమర్పణలో జయంత్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మాత అన్నంరెడ్డి కృష్ణకుమార్, గోవింద రవికుమార్ తెలుగులో అనువదిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''1970లో కేరళలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం ఇది. సాయిపల్లవితో పాటు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిం చారు. అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఫస్ట్ లుక్, ట్రైలర్‌ని త్వరలో విడుదల చేసి, సినిమాని కూడా వీలైనంత త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం'' అన్నారు.



సాయి పల్లవి

# పాటలు నచ్చడంతో సినిమా చేశా

**- అలీ**

''ఒకరోజు ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ కాల్ చేసి ఆఫీసుకు రమ్మన్నారు. ఆదాయపు పన్ను విషయం ఏమో అనుకున్నా. 'నా ఫ్రెండ్ సినిమా చేస్తున్నారు.. మీరు అందులో నటించాలి' అన్నారు. ఆ ఆఫీసర్ ఫ్రెండే మా దిలీప్ రాజా అని తెలిసింది. కట్ చేస్తే... మొదట నాకు కొన్ని పాటలు పంపి వినమన్నారు. ఆ పాటలు నచ్చడంతో సినిమా చేస్తానని చెప్పా'' అని అలీ అన్నారు. దిలీప్ రాజా దర్శకత్వంలో అలీ హీరోగా తెరకెక్కిన చిత్రం 'పండుగాడి ఫోటో స్టూడియో'. 'వీడు ఫోటో తీస్తే పెళ్ళి అయిపోద్ది' అనేది ట్యాగ్ లైన్. పెదరావూరు ఫిలిం సిటీ సమర్పణలో గుదిబండి వెంకట సాంబిరెడ్డి నిర్మించారు. ఈ సినిమా పాటలను దర్శకులు పూరి జగన్నాథ్, బోయపాటి శీను విడుదల చేశారు. సినిమా ట్రైలర్‌ను దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి రిలీజ్ చేశారు. అలీ మాట్లాడుతూ– ''మా సినిమా కథ కూడా చాలా బాగుంది. వెంకటేశ్వర విద్యాలయ సంస్థ అధినేతగా ఉన్న సాంబిరెడ్డిగారు సినిమాలపై ఇష్టంతో నాతో ఈ సినిమా నిర్మించారు. మా చిత్రం అందరికీ నచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''పండుగాడు ఫోటో తీస్తే ఎవరికైనా పెళ్లి అయిపోతుంది అనేది ఈ చిత్ర కథ. రెండేళ్లు ఈ కథ కోసం కష్టపడ్డా. జంధ్యాలగారి మార్క్ కామెడీతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు దిలీప్ రాజా. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బాపట్ల ఎంపీ నందిగాం సురేష్, నటీనటులు బాబూమోహన్, శ్రీకాంత్, నరేష్, 'అల్లరి' నరేష్, చార్మి, ఖయ్యూమ్, ప్రవీణ, అనిల్ కడియాల తదితరులు పాల్గొన్నారు.



సురేష్, దిలీప్ రాజా, రిషిత, చార్మీ, అలీ, యాజమాన్య, పూరి జగన్నాథ్, బోయపాటి, శ్రీకాంత్, సాంబిరెడ్డి

# ఫోరెన్సిక్ పరీక్షల నేపథ్యంలో...

అమలా పాల్ హీరోయిన్‌గా, అరుణ్ ఆదిత్ హీరోగా అనూప్ పనికర్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా తెరకెక్కుతోంది. దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జె. ఫణీంద్ర కుమార్, ప్రభు వెంకటాచలం నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి 'రాక్షసుడు' సినిమా డైరెక్టర్ రమేష్ వర్మ కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి. రామ్మోహన్ రావు క్లాప్ ఇచ్చారు. తమ్మారెడి భరద్వాజ మాట్లాడుతూ– ''ఫోరెన్సిక్ థ్రిల్లర్ అనే కొత్త జోనర్లో ఈ సినిమా రూపొందుతోంది. ఫోరెన్సిక్ పరీక్షలు అంటే ఏంటో ఈ సినిమాలో చూపించనున్నారు'' అన్నారు. అమలాపాల్ మాట్లాడుతూ– ''ఈ సినిమాతో తొలిసారి నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతున్నా. తమిళంలో అజయ్ పనికర్‌తో కలిసి నిర్మిస్తున్నా. తమిళంలో 'కడావర్' అనే టైటిల్ పెట్టాం'' అన్నారు. ''నా గత సినిమా విడుదలైన తర్వాత 'ఇమ్రాన్ హష్మి అవుదామనుకుంటున్నారా?' అని ప్రశ్నిస్తున్నారు.. అలాంటిదేమీ లేదు'' అన్నారు అరుణ్ ఆదిత్. ''చెన్నైలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా అభిలాష్ ఈ కథ రాశారు'' అన్నారు అనూప్ పనికర్. నటుడు వినోద్ సాగర్, కెమెరామేన్ అరవింద్ సింగ్ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: రోనీ.




రామ్మోహన్‌రావు, అరుణ్ ఆదిత్, అమలా పాల్



అభిషేక్ బచ్చన్

# ఏడేళ్ల తర్వాత?

అజయ్ దేవగన్, అభిషేక్ బచ్చన్ ఏడేళ్ల తర్వాత కలిసి నటించబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. 1990–2000 మధ్య కాలంలో దేశ ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులకు తోడు కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా హిందీలో కూకై గులాటి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందట. ఈ సినిమాలో అజయ్, అభిషేక్ హీరోలుగా నటించబోతున్నారని బాలీవుడ్ టాక్. హీరోయిన్‌గా ఇలియానా నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా అజయ్ దేవగన్ సొంత నిర్మాణ సంస్థలో రూపొందనుందని సమాచారం. చివరి సారిగా అజయ్, అభిషేక్ కలిసి 2012లో వచ్చిన 'బోల్ బచ్చన్' సినిమాలో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇంతకుముందు 'జమీన్' (2003), 'యువ' (2004) (హిందీ వెర్షన్) సినిమాల్లో స్క్రీన్ షేర్ చేసుకున్నారు ఈ బాలీవుడ్ స్టార్ హీరోలు.



అజయ్ దేవగన్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
12-8-2019

పరిచయం అంజూధర్

# కశ్మీర్ కీ కలీ



● 'ఈ స్వాతంత్ర్యదినోత్సవం మా జీవితంలో ప్రత్యేకం' అంటున్న అంజూధర్

**నే**ను పుట్టింది, పెరిగింది శ్రీనగర్‌లో. పద్నాలుగేళ్ల వరకు నేను జీవించిన కశ్మీర్ జీవితం సౌకర్యంగానే గడిచింది. అయితే స్కూలుకు వెళ్లిన తర్వాత... మూడు – నాలుగు తరగతులకు వచ్చినప్పటి నుంచి కొన్ని తేడాలు తెలిశాయి. స్కూల్లో కొంతమంది పిల్లలు హిందూ దేవుళ్లను పరిహసిస్తూ మమ్మల్ని గేలి చేసేవాళ్లు. ఇంటికి వచ్చి అమ్మను అడిగితే 'దేవుళ్లందరూ మంచివాళ్లే, దేవుళ్లందరూ గొప్పవాళ్లే. ఎవరు ఏ దేవుడినయినా పూజించుకోవచ్చు' అని చెప్పేది. ఆమె చెప్పినట్లుగానే మమ్మల్ని ఆలయాలతోపాటు దర్గాలకు కూడా తీసుకెళ్లేది. ఆ కన్‌ఫ్యూజన్ అలా ఉండగానే మాకు క్రికెట్ దగ్గర మరో విభజన రేఖ కనిపించేది. మేమంతా కపిల్‌దేవ్‌ని అభిమానించేవాళ్లం. కొంతమంది పిల్లలు ఇమ్రాన్ ఖాన్‌ని అభిమానించేవాళ్లు. ఇండియా– పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ ఉన్నప్పుడు ఉత్కంఠ ఎక్కువగానే ఉండేది. భారతీయులుగా మేము ఇండియా గెలవాలనే కదా కోరుకుంటాం. అయితే భారత్ గెలిస్తే మేము ఆ సంతోషాన్ని ధైర్యంగా వ్యక్తం చేయలేని పరిస్థితులుండేవి. మా కశ్మీర్ పండిట్ కుటుంబాలు కలిస్తే సంతోషాన్ని పంచుకునేవాళ్లం, కలవకపోతే సంతోషాన్ని గుండెల్లో దాచుకోవాల్సిందే. నాన్న గవర్నమెంట్ ఉద్యోగి కావడంతో ఆర్థిక ఇబ్బందులు లేవు. కానీ చాలా సున్నితమైన వాతావరణం ఉండేది. ఆ సమయంలో 1990, జనవరిలో ఓ రోజు... కొంతమంది మా ఇంటి తలుపులు దబదబా బాదారు. కిటికీ అద్దాలు పగలగొట్టారు. అరుపులు, కేకలతో భయానకంగా ఉంది. మాటల్లో చెప్పలేని తిట్లు తిట్టారు. ఆ తిట్లకే చెవులు మూసుకుని పారిపోవాల్సిన స్థితి. కిటికీలోంచి లోపలికి చూస్తూ 'చంపేస్తాం' అని బెదిరించారు. రాత్రి పది గంటలైనా దాడులు ఆగలేదు. తెల్లవారి సూర్యుడిని చూస్తామనుకోలేదు. ఆ కాళరాత్రిని జీవితంలో మర్చిపోలేను. మైకుల నుంచి 'రెలివ్, గెలివ్, యాద్‌సెలివ్' అంటూ ఒకటే నినాదాలు. జనం రోడ్ల మీద అరుస్తూ తిరుగుతూనే ఉన్నారు. ఇదంతా ఏ మారుమూల పల్లెలోనో కాదు, కశ్మీర్ రాజధాని నగరంలో. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కళ్లు, చెవులు మూసుకుని ఉండిపోయింది. లా అండ్ ఆర్డర్ లేదు, పోలీసుల జాడ లేదు.



● తల్లిదండ్రులతో రషిల్, తనిష్క్

### శాశ్వతం అనుకోలేదు

మాకు జమ్ములో చిన్న ఇల్లు ఉండేది. సమ్మర్ వెకేషన్‌కి వెళ్లే వాళ్లం. శ్రీనగర్‌లో పరిస్థితి విషమంగా ఉండడంతో పరిస్థితులు చక్కబడే వరకు జమ్ముకు వెళ్దామని ప్రయాణమయ్యాం. శ్రీనగర్ నుంచి బయటపడడానికి మూడు రోజులు పట్టింది. బస్టాండ్‌కు వెళ్లడానికి... ఎంత ప్రయత్నించినా ఒక్క ఆటోవాలా కూడా మమ్మల్ని ఎక్కించుకోలేదు. మూడు రోజుల తర్వాత నాన్న స్నేహితుడు తన కారులో మమ్మల్ని రహస్యంగా బస్టాండ్‌లో దించారు. ఎట్టకేలకు జమ్ము చేరుకుని ఊపిరి పీల్చుకున్నాం. అయితే ఆ ప్రయాణం మమ్మల్ని శాశ్వతంగా శ్రీనగర్‌కు దూరం చేస్తుందనుకోలేదు. మేము వచ్చేసిన తర్వాత శ్రీనగర్‌లో పరిస్థితులు ఇంకా విషమించాయి. రేప్‌లు, హత్యలు పెరిగిపోయాయి. ఆడుకోవడానికి బయటకు వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చేవారు కాదు. ఊరి బయట ఎక్కడో శవాలుగా దొరికేవాళ్లు. అలాంటి మరణం వద్దనుకుని చాలా కుటుంబాలు జమ్ముకి వచ్చేశాయి. మూడు కుటుంబాలైతే మా ఇంట్లోనే ఉండిపోయాయి. చిన్న ఇంట్లో మొత్తం పద్దెనిమిది మందిమి. ఒక్కోసారి ఇరవై మంది కూడా.

### ఒకరు తిన్న తర్వాత మరొకరు

జమ్ములో మా ఇంట్లో భోజనం చేయడానికి ఆరు ప్లేట్లు ఉండేవి. ఇంట్లో అందరం ఒకసారి భోజనం చేయడం కుదరని పని. అందరికీ సరిపడినంత ఒకేసారి వండడం కూడా కుదిరేది కాదు. చేతిలో ఉన్న కొద్దిపాటి డబ్బు దినుసులు కొనుక్కోవడానికే చాలీ చాలకుండా ఉండేది. ఇక పాత్రలు కొనాలనే ఆలోచన కూడా లేదు. మా అమ్మ రెండు–మూడు చిన్న పాత్రల్లో రోజంతా వండుతూనే ఉండేది. మేము ఒకరం తిన్న తరవాత ఆ ప్లేట్‌ని భోజనం చేయాల్సిన వాళ్లకు ఇచ్చేవాళ్లం. ఐదేళ్లు జమ్ములో ఉన్నాను. తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం కశ్మీర్ బాధితులకు ఇచ్చిన ప్రత్యేక అవకాశంతో పుణె గవర్నమెంట్ కాలేజీలో ఇంజనీరింగ్ చేశాను. పుణెలోనే ఉద్యోగంలో చేరాను. అప్పటి వరకు పడిన కష్టాలు ఒకెత్తయితే... మేము ఎందుకింత కష్టపడాల్సి వచ్చిందనే ఆవేదన చాలా పెద్దది. 'మేము భారతీయులం' అన్నందుకు ఇంతగా వేధింపులకు గురయ్యాం. పుణెలో స్వాతంత్ర్య భారతదేశంలో జీవిస్తున్న వాళ్లను చూసినప్పుడు మేము ఎంత కోల్పోయామో తెలిసి వచ్చింది. కశ్మీర్‌లో ఉన్నంత కాలం స్వాతంత్రం అంటే ఏమిటో తెలియకుండా బిక్కుబిక్కుమంటూ రోజులు గడిపామని తెలిసింది. పుణెలో లెక్కలేనన్ని విద్యార్థి ఉద్యమాలు నిర్వహించాం. ఆ వార్తలైతే జాతీయ పత్రికల్లో వచ్చాయి. కానీ అవి పాలకుల దృష్టికి చేరనే లేదప్పట్లో.

### అమ్మా! మన ఊరికి పోదామా!

మేము పుట్టిన మా నేలలో జీవించడం కోసం మా శక్తికి మించి పోరాడాం. మేము పోరాడింది మా ఖరీదైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కాదు, అమూల్యమైన మా జ్ఞాపకాల సంపదను తిరిగి సాధించుకోవడానికి, మా వారసత్వాన్ని మా పిల్లలకు అందివ్వడానికి పోరాడాం. ఆ ఉద్యమాల్లోనే భరత్, నేనూ ఒకరికొకరం పరిచయమయ్యాం. పెళ్లి చేసుకున్న తర్వాత కొంతకాలం పూనాలో, ఢిల్లీలో ఉద్యోగాలు చేశాం. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్నాం. పిల్లలు ప్రతి సెలవుల్లోనూ 'మా ఫ్రెండ్స్ వాళ్ల ఊరికి వెళ్తున్నారు. మన ఊరు కశ్మీర్‌లో ఉంది కదా. మనం ఎప్పుడు వెళ్దాం. ఎప్పుడు తీసుకెళ్తారు' అని అడుగుతుంటారు. వాళ్లు అలా అడిగిన ప్రతిసారీ మేము పోరాడి పోరాడి అలసిపోయిన ఉద్యమం గుర్తుకు వచ్చేది. అక్కడి పరిస్థితులు కళ్ల ముందు మెదిలేవి. టూరిస్టులు కూడా కశ్మీర్‌కి వెళ్లగలుగుతున్నారు. కానీ మేము అడుగుపెట్టలేని వాతావరణం ఉండేది. పిల్లలకు అవన్నీ చెప్పలేక 'తప్పకుండా వెళ్దాం. నాన్నకు ఆఫీస్‌లో సెలవు దొరికినప్పుడు వెళ్దాం' అని అప్పటికి సర్ది చెప్పేదాన్ని. అలా చెప్తున్న ప్రతిసారీ 'నేను పిల్లలకు అబద్ధం చెప్తున్నాను' అని గుండె పిండేసినట్లయ్యేది. కశ్మీర్ వెళ్లాలనే మా కల నిజమవుతుందని కలలో కూడా అనుకోలేదు. 370 రద్దుతో ఇప్పుడా అదృష్టం వచ్చింది. పిల్లలకు మా వారసత్వం గురించి తెలియడం కోసం... ఇన్నాళ్లు కశ్మీరీ లోయ గురించి, కశ్మీరీయుల సంస్కృతి గురించి కథలుగా చెప్పేదాన్ని. ఇప్పుడు వాళ్లను తీసుకెళ్లి చూపిస్తాం''.

– ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి
ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

## ఆ రావడం... ఇక వెళ్లనేలేదు



**మా**ది కుప్వారా జిల్లాలోని పాజీపోరా గ్రామం. భారత్– పాక్ సరిహద్దులో ఉంటుంది. 1990 నాటికి నేను నైన్త్ క్లాస్‌లో ఉన్నాను. సమాజంలో పెద్ద పొజిషన్‌లో ఉన్న పండిట్‌లలో ఒక్కొక్కరు హతమవ్వసాగారు. ఒక జడ్జి, కొన్నాళ్లకు దూరదర్శన్ డైరెక్టర్, హెచ్‌ఎమ్‌టీ ఎం.డీ... ఇలా గుర్తింపు పొందిన వారి ప్రాణాలు తీయడం ద్వారా మిగిలిన వారికి సంకేతాలను జారీ చేయడం మొదలైంది. జనవరి 19వ తేదీన మైకుల్లోంచి ఒక అనౌన్స్‌మెంట్ బిగ్గరగా వినిపించింది. అది కశ్మీర్ పండిట్‌లను ఉద్దేశించిన ప్రకటన. ఆ ప్రకటనలో వాళ్లు మాకు మూడు ఆప్షన్‌లు ఇచ్చారు. 'కశ్మీర్‌ను ఇస్లాం రాజ్యంగా మార్చాలనుకుంటున్నాం కాబట్టి హిందువులందరూ ఇస్లాంలోకి మారిపోవాలి (రెలివ్). కశ్మీర్‌ను వదిలి వెళ్లి పోవాలి(యాద్ సెలివ్. ఇక మూడవది... పై రెండింటిలో ఏదో ఒకటి తేల్చుకోని వాళ్లను చంపేయడమే తరువాయి (గెలివ్). ప్రాణాలు పోగొట్టుకోవడానికి సిద్ధంగా ఉండాలి' అని లౌడ్ స్పీకర్ల నుంచి భయానకంగా వినిపిస్తోంది. ఆ స్థితిలో మా ఊరి నుంచి మాతోపాటు మరో పది కుటుంబాలు కశ్మీర్‌ను వదిలి వచ్చేశాయి. ఒక ట్రక్కులో 45 మందిమి ఆ రోజే మా జన్మభూమి కశ్మీర్‌ని వదిలేశాం. మాకు ఎక్కడికి వెళ్తున్నామో కూడా తెలియదు. మేము పిల్లలం కాబట్టి అమ్మానాన్నలను అడగగలం. అయితే చెప్పడానికి వాళ్ల దగ్గర సమాధానం లేదు. జమ్ములో పరిస్థితులు బాగుండేవి. దాంతో కశ్మీర్ ప్రాంతం నుంచి బయటపడిన వాళ్లంతా జమ్ములో తలదాచుకునేవాళ్లు. అలా మేము జమ్ములోని రెఫ్యూజీ క్యాంపుల్లోని గుడారాల్లో, చెట్ల కింద నాలుగేళ్లు గడిపాం. ఒక్కో గుడారంలో రెండు కుటుంబాల వాళ్లం రోజులు వెళ్లదీశాం. శ్రీనగర్ చల్లటి ప్రదేశం, అక్కడి వాళ్లం జమ్ములో వేడిని తట్టుకోలేకపోయేవాళ్లం. వృద్ధులు, పిల్లలు వడదెబ్బకు చనిపోయారు. ఇక పాము కాట్లకు ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్లు ఎందరో. కశ్మీర్‌లో పరిస్థితులు చక్కబడతాయని, తిరిగి వెళ్లి చివరి రోజులు సొంత నేలలో గడపాలని, సొంత గడ్డ మీద ప్రాణాలు వదలాలని మా నానమ్మ ఎంతగానో ఎదురు చూసింది. ఆమె కోరిక తీరనే లేదు. నానమ్మను ఒకసారి సొంతూరికి తీసుకెళ్దామంటే అది కూడా సాధ్యం కాలేదు. మేము ఊరు వదిలి వచ్చిన వెంటనే అల్లరి మూకలు మా ఇంట్లో చొరబడి మొత్తం దోచుకుని, తర్వాత ఇంటిని కాల్చేశారట. ఇక ఎక్కడికని వెళ్లగలం? అలా మేము ఐదంతస్థుల ఇంటి నుంచి రాత్రికి రాత్రి గుడారాల్లోకి వచ్చి పడ్డాం. రెఫ్యూజీ క్యాంపు గుడారాల్లోనే ఇంటర్ వరకు చదువుకున్నాం. తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం కశ్మీరీలకు కాలేజీలలో సీట్లివ్వడంతో పై చదువులు చదువుకోగలిగాం. పూనాలో చదువుకుని, ఇప్పుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో బిజినెస్ అనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాను. విద్యార్థి దశలో మా హోమ్‌ల్యాండ్ కోసం ఎన్నో ఆందోళనలు చేశాం. ఇక ఆశ వదులుకున్న తరుణంలో, 370 రద్దు ద్వారా మా జీవితాల్లో తిరిగి సూర్యుడు ఉదయించాడు. ఇక కశ్మీర్‌కి వెళ్తాం. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను హైదరాబాద్‌లో ఉన్న రెండు వందలకు పైగా కశ్మీరీ కుటుంబాల వాళ్లం కలిసి నిర్వహించుకుంటాం. త్రివర్ణ పతాకాన్ని ధైర్యంగా, గర్వంగా ఎగురవేస్తాం.

– భరత్ భూషణ్ ధర్,
హైదరాబాద్‌లో నివసిస్తున్న కశ్మీర్ పండిట్

# కొన్ని ఆహారాలు... అపోహలూ - వాస్తవాలు

**కొన్ని రకాల ఆహారాల పదార్థాల విషయంలో మనకు చాలాకాలంగా కొన్ని అపోహలు ఉన్నాయి. అలాంటి ఆహారాల్లో కొన్నింటిపై ఉన్న అపోహలూ... వాస్తవాలూ పరిశీలిద్దాం.**





**అపోహ : ఫారం కోడిగుడ్ల కంటే నాటుకోడి గుడ్లలోనే బలం ఎక్కువా?**

**వాస్తవం :** ఫారం కోడిగుడ్ల కంటే నాటు కోడి గుడ్లలో చాలా బలం ఉంటుందని చాలా మంది అపోహ పడుతుంటారు. అందుకే ఫారం కోడిగుడ్లు తెల్లగా ఉంటాయనీ, నాటు కోడిగుడ్లు కాస్త ముదురు రంగులో ఉంటాయని గ్రహించి, ముదురు రంగులో ఉన్న గుడ్లను కాస్త ధర ఎక్కువైనా సరే... కొందరు వాటినే కొంటుంటారు. వాస్తవానికి ముదురు రంగు పెంకు ఉన్న గుడ్లు మరింత బలవర్ధకం ఏమీ కాదు. నిజానికి కోడి గుడ్డు పెంకు ఏ రంగులో ఉన్నప్పటికీ వాటిల్లో ఉండే పోషకాలు మాత్రం ఒకేలా ఉంటాయి. కాకపోతే నాటు కోడి గుడ్డు పరిమాణం కాస్త చిన్నగానూ, ఫారం కోడి గుడ్డు కాస్త పెద్దగానూ ఉంటాయి. ఈ సైజు తేడాలెలా ఉన్నప్పటికీ, వాటిల్లోని తెల్లసొన, పచ్చసొనల్లోని పోషక విలువలు మాత్రం ఒకేలా ఉంటాయి. ఆ రెండు రకాల గుడ్లలో ఉండే ఐరన్ పాళ్లు కూడా ఒకటే. వినియోగదారులు ముదురు రంగు పెంకు ఉన్న గుడ్లనుఎక్కువ ధర వెచ్చించి కొనడం కేవలం వాళ్ల మానసిక సంతృప్తి కోసం మాత్రమే.



**అపోహ : బొప్పాయితో గర్భస్రావం అవుతుందా?**

**వాస్తవం:** ఇది చాలా మందిలో ఉన్న అపోహ. బాగా పక్వానికి వచ్చిన బొప్పాయి పండును తినడం గర్భవతులకు మేలు చేస్తుంది. ఎందుకంటే... ఇందులో విటమిన్–ఏ, విటమిన్–సిలతో పాటూ అనేక రకాల పోషకాలు ఉంటాయి. అయితే ఇక్కడ ఒక్క జాగ్రత్త తీసుకోవాలి. పూర్తిగా పండని, లేదా బాగా పచ్చిగా ఉన్నవాటిని తినకూడదు. పచ్చి బొప్పాయిలో 'పపాయిన్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఈ ఎంజైమ్ గర్భసంచిని ముడుచుకుపోయేలా (యుటెరైన్ కంట్రాక్షన్స్‌ను) ప్రేరేపించి కొన్నిసార్లు గర్భస్రావానికి దారితీసేలా చేయవచ్చు. అందుకే పచ్చిది, పాక్షికంగా పండిన వాటిని మాత్రం గర్భవతులు తినకూడదు. ఒకవేళ తినాలనిపిస్తే ఆ పండ్ల ముక్కలను తేనెతోనూ, పాలతోనూ కలిపి తింటే అందులోని పపాయిన్ ఎంజైమ్ ప్రభావం గణనీయంగా తగ్గుతంది.

**అపోహ : పాలకూర, టొమాటో కలిపి వండుకుని తింటే మూత్రపిండాల్లో (కిడ్నీల్లో) రాళ్లు ఏర్పడతాయా?**

**వాస్తవం :** పాలకూర, టొమాటోలు కలిపి వండుకుని తింటే మూత్రపిండాల్లో రాళ్లు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే. పాలకూర, టొమాటోల కూరకూ, మూత్రపిండాల్లోని రాళ్లకూ నేరుగా ఎలాంటి సంబంధమూ లేదు. అయితే కొందరిలో స్వాభావికంగానే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే శరీర తత్వం ఉంటుంది. ఇక మరికొందరిలో అప్పటికే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడి ఉండవచ్చు. ఇలాంటి వారు కొన్ని ఆహారాలను మినహాయించాలి. అందులో పాలకూర, టొమాటో కూడా ఒకటి. అలాంటి వారిలో ఇలా వండిన కూర వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే అవకాశం పెరగవచ్చు. అందుకే కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే శరీర తత్వం ఉన్నవారు మినహాయించి, మిగతా అందరూ పాలకూర, టొమాటోలను నిరభ్యంతరంగా తినవచ్చు. పైగా ఆ కాంబినేషన్ ఆరోగ్యకరం కూడా.



## ఫ్యామిలీ డాక్టర్

### గ్యాస్ట్రోఎంటరాలజీ కౌన్సెలింగ్స్

## కడుపులో నొప్పి... కామెర్లు, సలహా ఇవ్వండి

**ఇటీవల నాకు తరచూ జ్వరం వస్తోంది. అంతేకాదు... కడుపుపై భాగంలో కొద్దిపాటి నొప్పి ఉంటోంది. ఇటీవల కామెర్లు కూడా వచ్చాయి. ఇక్కడ స్థానికంగా ఇచ్చే పసరు మందు తీసుకున్నాను. అయినా తరచూ కడుపునొప్పితో పాటు జ్వరం వస్తూనే ఉంది. మా ఆర్‌ఎంపీ డాక్టర్‌ని అడిగితే తగ్గే వరకూ పసరు తీసుకొమ్మని అంటున్నారు. కొందరేమో పసరు మందు వద్దంటున్నారు. నాకు అయోమయంగా ఉంది. తగిన సలహా ఇవ్వండి.**

**– సీహెచ్. సోమరాజు, ఫణిగిరి**

మీ లక్షణాలను బట్టి మీరు హెపటైటిస్–సి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. మీరు ఎట్టిపరిస్థితుల్లోనూ పసరు మందు వాడకండి. మీకు వచ్చిన హెపటైటిస్–సి ఇన్ఫెక్షన్ పసరుతో తగ్గదు. హెపటైటిస్–సి వైరస్ కారణంగా ఈ కాలేయ వ్యాధి వస్తుంటుంది. రక్తమార్పిడి లేదా ఈ వైరస్ ఉన్న ఇంజెక్షన్ సూదుల వల్ల రక్తం కలుషితం కావడం వల్ల ఈ వ్యాధి వస్తుంటుంది. గర్భవతుల్లో తల్లి నుంచి బిడ్డకు, దంపతుల్లో ఎవరికైనా ఉంటే మరో పార్ట్‌నర్‌కు ఇది సోకడం మామూలే.

**నిర్ధారణ**

ఈ వ్యాధి నిర్ధారణ కోసం మొదట హెపటైటిస్–సి యాంటీబాడీ టెస్ట్ అనే రక్తపరీక్ష చేస్తారు. ఆ తర్వాత వ్యాధి తీవ్రత (వైరల్ లోడ్) తెలుసుకునేందుకు హెచ్‌సీవీ ఆర్‌ఎన్‌ఏ పరీక్ష చేస్తారు. ఈ పరీక్షలతో పాటు జీనోటైప్ పరీక్షల వల్ల రోగికి చికిత్స అందించాల్సిన వ్యవధి, దానికి రోగి ప్రతిస్పందించే తీరు తెన్నులు తెలుస్తాయి. ఇందులోనే కొన్ని 'జీనోటైప్స్'కు చెందిన వ్యాధుల్లో కాలేయం నుంచి ముక్క తీసి పరీక్షించాల్సిన అవసరం ఉంటుంది. దాని వల్ల నిర్దిష్టంగా ఏ చికిత్స అందించాలో తెలుస్తుంది. వ్యాధి మరింత ముదరకుండా ఉన్నవారికి చికిత్స బాగానే పని చేస్తుంది. ఒకవేళ వ్యాధి బాగా ముదిరితే కనిపించే దుష్ప్రభావాలు... అంటే రక్తస్రావం, పొట్టలో నీరు చేరడం (అసైటిస్), వ్యాధి మెదడుకు చేరడం వంటివి కనిపిస్తే మాత్రం అది కాలేయ క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలు ఉంటాయి. అందుకే ఈ వ్యాధి సోకిన వారు ఎంత త్వరగా పరీక్షలు చేయించుకొని, దానికి అనుగుణం చికిత్స చేయించుకుంటే అంత మంచిది.



## పిత్తాశయంలో రాళ్లు... కడుపునొప్పిలేదు... సర్జరీ అవసరమా?

**నా వయసు 42 ఏళ్లు. నేను ఈమధ్య రొటీన్‌గా చేయించుకున్న వైద్యపరీక్షలలో గాల్‌బ్లాడర్ (పిత్తాశయం)లో రాళ్లు ఉన్నట్లు బయటపడింది. కానీ నాకు కడుపునొప్పి వంటి ఎలాంటి లక్షణాలూ కనపడలేదు. ఇప్పుడు రాళ్లను తొలగించడానికి సర్జరీనే పరిష్కారం అని డాక్టర్ అంటున్నారు. నాకు సర్జరీ అంటే భయం. నాకు తగిన సలహా ఇవ్వగలరు.**

**– డి. పారిజాత, విజయనగరం**

లివర్‌కు అనుసంధానమై సంచి మాదిరిగా ఉండే నిర్మాణమే గాల్‌బ్లాడర్. ఇది పైత్యరసాన్ని నిల్వ చేస్తుంది. రకరకాల కారణాల వల్ల గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడతాయి. మీ విషయం తీసుకుంటే మీకు కడుపులో ఎలాంటి నొప్పిలేదు కాబట్టి వీటిని లక్షణాలు కనిపించని గాల్ స్టోన్స్ అంటారు. పిత్తాశయంలో రాళ్లు ఏర్పడిన జబ్బుతో బాధపడే కొందరు పేషెంట్లకు ఉదరం కుడివైపు ఎగువ భాగాన తీవ్రమైన నొప్పివస్తుంది. అలాగే కామెర్లు, తీవ్రమైన పాంక్రియాటిక్ సమస్యలు ఉత్పన్నమవుతాయి. అలాంటి సందర్భాల్లో కీహోల్ సర్జరీ ద్వారా మొత్తం గాల్‌బ్లాడర్‌ను తీసివేయాలని మేము సూచిస్తాం. మీ విషయానికి వస్తే, మీకు కడుపునొప్పి లాంటి లక్షణాలే ఏవీ కనిపించనందున మీకు అసలు చికిత్స అవసరం లేదు. భవిష్యత్తులో ఎప్పుడైనా మీరు తీవ్రమైన కడుపునొప్పి లేదా కామెర్లు వంటి పరిణామాలకు గురైతే అప్పుడు సర్జరీ కోసం స్పెషలిస్టు డాక్టర్‌ను సంప్రదించవచ్చు. పిత్తాశయంలో రాళ్లకు సంబంధించి ఎలాంటి లక్షణాలు కనిపించని పేషెంట్లలో కేవలం మూడింట ఒక వంతు మందికి మాత్రమే తర్వాతికాలంలో సర్జరీ అవసరమవుతుంది.

## ప్యాంక్రియాటైటిస్ అంటే ఏమిటి?... ఎందుకు వస్తుంది?

**నా వయసు 45 ఏళ్లు. కొన్ని రోజుల నుంచి నాకు కడుపులో తీవ్రమైన మంటగా ఉంటోంది. ఎసిడిటీ అనుకొని దానికి సంబంధించి సొంతంగా మందులు వాడాను. కానీ తగ్గలేదు. తర్వాత పొట్ట ఉబ్బడం, కళ్లు తిరగడం, వాంతి అవుతున్నట్లు అనిపించడంతో పాటు అన్నం తిన్న తర్వాత పొట్ట పై భాగంలో నొప్పి మొదలై అక్కడి నుంచి వీపు వైపు పాకడం లాంటి లక్షణాలు కనిపించాయి. దాంతో నేను వెంటనే డాక్టర్‌ను కలిశాను. ఆయన కొన్ని పరీక్షలు చేయించి, ప్యాంక్రియాటైటిస్ అనే వ్యాధి వచ్చినట్లు నిర్ధారణ చేసి, సర్జరీ చేయాలంటున్నారు. అసలు ఈ జబ్బు ఎందుకు వస్తుంది? సర్జరీ కాకుండా మందులతో తగ్గదా? దయచేసి నా సమస్యకు తగిన పరిష్కారం చూపండి.**

బి. రాజేశ్వరరావు, కరీంనగర్

శరీరంలోని అవయవాలలో అతి చిన్నదైన 'ప్యాంక్రియాస్' (క్లోమ గ్రంథి) చిన్న పేగుకు పక్కనే ఉండి జీర్ణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తూ ఉంటుంది. ఇందులో ఉండే కణజాలాలు గ్లూకగాన్, ఇన్సులిన్, సొమటోస్టాటిన్ అనే హార్మోన్లను రక్తంలోకి విడుదల చేసి దానిని శక్తిగా మారుస్తుంటాయి. డయాబెటిస్ సమస్య నుంచి కూడా ఈ గ్రంథి కాపాడుతుంది. అయితే ప్యాంక్రియాస్ స్రావాలు ఒక గొట్టం ద్వారా వచ్చి చిన్న పేగులో కలుస్తాయి. ఈ గొట్టంలో ఏదైనా ఆటంకం ఏర్పడితే అక్కడ వాపు వస్తుంది. దీనినే ప్యాంక్రియాటైటిస్ వ్యాధి అంటారు. మరికొన్ని సందర్భాలలో క్లోమరసంలో ప్రోటీన్ల పరిమాణం ఎక్కువై ఉండలుగా ఏర్పడి, అవి గొట్టంలో అడ్డుపడటం వల్ల కూడా ఈ సమస్య వచ్చే అవకాశాలున్నాయి. అలాగే మితిమీరిన మద్యపానం కూడా ఈ జబ్బుకు ఒక కారణం కావచ్చు. దీన్ని తొలి దశలోనే కనిపెట్టలేకపోతే... వ్యాధి ముదిరి రోగికి ప్రమాదకరంగా మారుతుంది. మీకు రక్తపరీక్షలు, సీరమ్ లైపేజ్ పరీక్షలు, అలాగే సీటీ స్కాన్ లేద ఎమ్మారై స్కాన్ లాంటివి చేసి, ప్యాంక్రియాస్ రక్తనాళం ఏ స్థాయిలో ఉబ్బి ఉందో అలాగే క్లోమం ఏ మేరకు దెబ్బతిన్నదో నిర్ధారణ చేసి మీకు చికిత్స ప్రారంభించాల్సి ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో మందులతో కూడా ఈ వ్యాధి తగ్గే అవకాశం ఉంటుంది. లేకపోతే మాత్రం ఆధునిక శస్త్రచికిత్స ప్రక్రియ అయిన లాప్రోస్కోపిక్ సర్జరీ / కీ హోల్ సర్జరీ ద్వారా విధానం ద్వారా చెడిపోయిన మేరకు క్లోమగ్రంథి భాగాన్ని తొలగించవచ్చు. కీహోల్ సర్జరీ వల్ల హాస్పిటల్‌లో రోగిని ఉండాల్సిన వ్యవధి కూడా బాగా తగ్గుతుంది. సర్జరీ తర్వాత కొద్దికాలంలోనే కోలుకొని మీ వృత్తి జీవితాన్ని కొనసాగించవచ్చు. ఈ విషయంలో మీరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.



**డాక్టర్ బి. రవి శంకర్**
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్

epaper.sakshi.com

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
12-8-2019





**బ్యాంకు జాబ్.. ఇటీవల కాలంలో యువతకు కొలువుల కామధేనువుగా మారింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీకి నిత్యం ఏదో ఒక ప్రకటన వెలువడుతోంది. తాజాగా ఐబీపీఎస్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్).. 2020-21 ఆర్థిక సంవత్సరంలో..దేశంలోని జాతీయ బ్యాంకుల్లో పీవో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా యువత డిగ్రీ అర్హతతోనే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉజ్వల కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ నోటిఫికేషన్ సమాచారం.. పీవో పోస్టుల ఎంపిక ప్రక్రియ.. పరీక్ష తీరుతెన్నులు.. ప్రిపరేషన్ గైడెన్స్...**

# పీవో.. పిలుస్తోంది!

- 4336 పీవో పోస్ట్‌ల భర్తీకి ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల
- మూడంచెల ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకాలు
- డిగ్రీతోనే బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్‌కు మార్గం

### 4336 ఖాళీల భర్తీ

ఐబీపీఎస్ కామన్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా మొత్తం 17 జాతీయ బ్యాంకుల్లో 4336 పీవో /మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ఆ వివరాలు...

| బ్యాంక్ | పోస్ట్‌ల సంఖ్య |
|---|---|
| అలహాబాద్ బ్యాంక్ | 500 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 899 |
| బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర | 350 |
| కెనరా బ్యాంక్ | 500 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 150 |
| ఇండియన్ బ్యాంక్ | 493 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 300 |
| యూకో బ్యాంక్ | 500 |
| యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 644 |

✦ ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో పోస్ట్‌ల సంఖ్యను సున్నాగా పేర్కొంది. అదే విధంగా సిండికేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించి ఖాళీల పరంగా నాట్ రిపోర్టెడ్ అని తెలిపింది. నాట్ రిపోర్టెడ్ విభాగంలోని బ్యాంకులు తుది ఎంపిక సమయానికి ఖాళీల భర్తీకి ఐబీపీఎస్‌ను సంప్రదించే అవకాశముందని నిపుణుల అభిప్రాయం. అంటే.. ఖాళీల సంఖ్య ఇంకా పెరిగే వీలుంది.

### మూడంచెల ఎంపిక ప్రక్రియ

ఐబీపీఎస్ పీవో (సీఆర్‌పీ) ఎంపిక ప్రక్రియ మూడంచెల్లో నిర్వహించనుంది. అవి.. » ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, » మెయిన్ ఎగ్జామినేషన్, » పర్సనల్ ఇంటర్వ్యూ. ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్స్ ఆన్‌లైన్ విధానంలో ఉంటాయి. వీటిలో నిర్దేశిత కటాఫ్‌ను సాధించిన అభ్యర్థులను తుది దశ పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

### ప్రిలిమినరీ పరీక్ష

తొలిదశ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 100 ప్రశ్నలు-100 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ అనే మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ప్రిలిమినరీలో పొందిన మార్కులు, నిర్దేశిత కటాఫ్ మార్కుల ఆధారంగా మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్‌కు ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్య 1:10గా ఉంటుంది.

| విభాగం | ప్రశ్నల సంఖ్య | మార్కులు | సమయం |
|---|---|---|---|
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 30 | 30 | 20 ని.లు |
| క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ | 35 | 35 | 20 ని.లు |
| రీజనింగ్ ఎబిలిటీ | 35 | 35 | 20 ని.లు |
| మొత్తం | 100 | 100 | 60 ని.లు |

### మెయిన్ ఎగ్జామినేషన్

మెయిన్ పరీక్ష సైతం ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుంది. ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్, జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్, డేటా అనాలసిస్ అండ్ ఇంటర్ ప్రిటేషన్‌పై ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 155 ప్రశ్నలు, 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. మెయిన్ పరీక్ష వ్యవధి మూడు గంటలు.

| విభాగం | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| రీజనింగ్ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ | 45 | 60 | 60 ని.లు |
| జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ | 40 | 40 | 35 ని.లు |
| ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 35 | 40 | 40 ని.లు |
| డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ | 35 | 60 | 45 ని.లు |
| మొత్తం | 155 | 200 | 3 గం.లు |

### ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్

మెయిన్‌లో పేర్కొన్న ఆబ్జెక్టివ్ విభాగాలతోపాటు ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అభ్యర్థులు ఒక ఎస్సే, ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది. ఒక్కో దానికి 25 మార్కులు. సమయం 30 నిమిషాలు. అభ్యర్థుల్లో ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పరీక్షించడమే ఈ విభాగం ప్రధాన ఉద్దేశం.

### తుది దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా.. సెక్షన్ల వారీ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను నిర్దేశించి.. ఆ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 100. ఇందులో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు పొందాలి.

### తుది జాబితాలో 80:20 వెయిటేజీ

తుది జాబితా రూపకల్పనలో మెయిన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు నిర్దేశిత వెయిటేజీ ఉంటుంది. మెయిన్ పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 20శాతం వెయిటేజీని నిర్దేశించారు. ఇలా తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులను ఆయా బ్యాంకుల్లో 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఏర్పడే ఖాళీల్లో నియమిస్తారు.

## నోటిఫికేషన్ సమాచారం



- ✦ **విద్యార్హత:** ఆగస్టు 28, 2019 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- ✦ **వయోపరిమితి:** ఆగస్టు 1, 2019 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. గరిష్ట వయోపరిమితికి సంబంధించి ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడేళ్ల వయో సడలింపు ఉంటుంది.

**దరఖాస్తు విధానం**

- ✦ అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ ఇందుకోసం **www.ibps.in** వెబ్‌సైట్ హోంపేజీలో కనిపించే సీఆర్‌పీ పీఓ/ఎంటీ లింక్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత క్లిక్ హియర్ టు అప్లై ఆన్‌లైన్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

**ముఖ్య తేదీలు**

- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్టు 7-ఆగస్టు 28, 2019.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు తేదీలు:** ఆగస్టు 7- ఆగస్టు 28, 2019.
- ✦ **ప్రిలిమినరీ పరీక్షకు కాల్ లెటర్స్ డౌన్‌లోడ్:** అక్టోబర్‌లో.
- ✦ **ప్రిలిమినరీ పరీక్ష (ఆన్‌లైన్) తేదీలు:** అక్టోబర్ 12, 13, 19, 20.
- ✦ **ప్రిలిమినరీ ఫలితాల వెల్లడి:** అక్టోబర్/నవంబర్.
- ✦ **మెయిన్ పరీక్ష కాల్ లెటర్ డౌన్‌లోడ్:** నవంబర్ 2019.
- ✦ **మెయిన్ పరీక్ష తేదీ:** నవంబర్ 30, 2019.
- ✦ **మెయిన్ పరీక్ష ఫలితాల వెల్లడి:** డిసెంబర్ 2019.
- ✦ **ఇంటర్వ్యూ కాల్ లెటర్ డౌన్‌లోడ్:** జనవరి, 2020
- ✦ **పర్సనల్ ఇంటర్వ్యూలు:** 2020 జనవరి, ఫిబ్రవరిలో.
- ✦ **ప్రొవిజనల్ అలాట్‌మెంట్:** 2020 ఏప్రిల్‌లో.

**తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కేంద్రాలు**

- ✦ **ఆంధ్రప్రదేశ్:** చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం
- ✦ **తెలంగాణ:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ibps.in**

### పీవోగా చేరి.. ఉన్నతస్థాయికి ఎదగొచ్చు

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పీవోగా కెరీర్ ప్రారంభించిన అభ్యర్థులు.. ఆయా బ్యాంకుల్లో అత్యున్నత పదవిగా భావించే చైర్మన్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. స్కేల్-1 హోదాతో పీవోగా కెరీర్ ప్రారంభిస్తే.. రెండేళ్ల తర్వాత స్కేల్-2 కేడర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పదోన్నతి పొందొచ్చు. ఆ తర్వాత పని తీరు ఆధారంగా మేనేజర్ (స్కేల్-3), చీఫ్ మేనేజర్(స్కేల్-4), ఏజీఎం(స్కేల్-5), డీజీఎం(స్కేల్-6), జీఎం(స్కేల్-6) హోదాలు సొంతం చేసుకోవచ్చు. ఇవే కాకుండా.. పని తీరు ఆధారంగా చీఫ్ జనరల్ మేనేజర్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్, చైర్ పర్సన్ వంటి ఉన్నతస్థాయి పదవులు పొందొచ్చు.

### ప్రామాణిక పుస్తకాలు

ఇప్పటినుంచే ప్రిపరేషన్ ప్రారంభిస్తే ప్రిలిమ్స్ పరీక్ష సమయానికి ఆయా విభాగాల్లో పట్టు సాధించడం సులభమే. అభ్యర్థులు ప్రామాణిక పుస్తకాలను అభ్యసనం చేయాలి. మ్యాథమెటిక్స్, అర్థమెటిక్ కోసం పదోతరగతి స్థాయి పుస్తకాలను చదవడం మేలు చేస్తుంది.

**-మనోజ్ సేథి**, బ్యాంక్ ఎగ్జామ్స్ కోచింగ్ హెడ్, టైమ్ ఇన్‌స్టిట్యూట్



### సన్నద్ధత ఇలా

ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్‌లో రాణించడానికి అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ సాగించాలి. ప్రిలిమ్స్, మెయిన్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్ చాలా కీలకం. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలపైనా పట్టు సాధిస్తే... ప్రిలిమ్స్, మెయిన్.. రెండిటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

### డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ప్రిపరేషన్ సాగించాల్సిన విభాగం.. డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్. ఇందులో మంచి స్కోర్ సాధించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

### జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్

ఇటీవల కాలంలో దేశ ఆర్థిక రంగంలో తాజా పరిణామాలు.. బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు.. అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

### ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్‌లో మార్కుల సాధనకు బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

✦ డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

### ప్రాక్టీస్ ప్రధానం

ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. కేవలం ఆబ్జెక్టివ్ తరహాలో బిట్స్ చదవడం కాకుండా.. బేసిక్స్, ఫార్ములాల ఆధారంగా వాటిని ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ప్రతిరోజు నిర్దిష్టంగా సమయం కేటాయించుకోవాలి. అదే విధంగా రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

**-ఎ.మోనిష్ కుమార్**, ఐబీపీఎస్ పీఓ- 2017 విజేత (సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)

## ఉద్యోగ సమాచారం

### ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

తెలంగాణ అభ్యర్థులకు సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నియామక ర్యాలీ నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన వారు దీనికి అర్హులు.

- ✦ **పోస్టులు:** సోల్జర్ టెక్నికల్, సోల్జర్ టెక్నికల్ (ఏవియేషన్/అమ్యునేషన్ ఎగ్జామినర్), సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్/ఎన్‌ఏ వెట్, సోల్జర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, సోల్జర్ జనరల్ డ్యూటీ, సోల్జర్ ఫార్మా, సోల్జర్ ట్రేడ్స్‌మెన్.
- ✦ **విభాగాలు:** జనరల్ డ్యూటీ, టెక్నికల్, నర్సింగ్ అసిస్టెంట్, క్లర్క్, స్టోర్ కీపర్, ఫార్మసీ, ట్రేడ్స్‌మెన్.
- ✦ **అర్హత:** ఎనిమిదో తరగతి, పదో తరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్, డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి.
- ✦ **వయసు:** 17 1/2 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- ✦ **ఎంపిక:** ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్ట్, మెడికల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **ర్యాలీ నిర్వహణ తేదీ:** అక్టోబర్ 7 నుంచి 17 వరకు ఉంటుంది.
- ✦ **ర్యాలీ ప్రదేశం:** డాక్టర్.బీఆర్ అంబేద్కర్ స్టేడియం, కరీంనగర్.
- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు తేదీలు:** 2019, ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in


సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...
❖ ఎస్‌బీఐ పీవో, క్లరికల్ పరీక్షల మెటీరియల్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి


# సోషల్ మీడియా.. షైనింగ్!

**మీడియా రంగంలో ఉద్యోగాలు అనగానే.. గతంలో పత్రికా రంగంలో అవకాశాలు మాత్రమే గుర్తుకొచ్చేవి! ఆ తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతి కారణంగా అక్కడా ఉద్యోగాలు పెరిగాయి. తాజా ట్రెండ్.. సోషల్ మీడియా! యూట్యూబ్, ట్వీటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, లింక్డిన్ వంటి సోషల్ మీడియాలో.. కంటెంట్ క్రియేషన్, డిజైనింగ్, ఎస్‌ఈవో.. ఇలా రకరకాల కొలువులు!! స్మార్ట్ ఫోన్‌తోపాటు, తక్కువ ధరలకే డేటా అందుబాటులోకి రావడంతో.. డిజిటల్ కంటెంట్‌ను వీక్షించే వారి సంఖ్య పెరిగింది. ఫలితంగా ప్రముఖ మీడియా సంస్థలు కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వైపు అడుగులు వేస్తున్నాయి. సంప్రదాయక ప్రింట్ మీడియా కంటే సోషల్ మీడియా, వెబ్ మీడియాలో కొత్త ఉద్యోగాల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. సోషల్ మీడియా కొలువులు.. అవసరమైన నైపుణ్యాలు.. అందిపుచ్చుకునేందుకు మార్గాలను తెలుసుకుందాం...**




- » సోషల్, వెబ్ మీడియాల్లో పెరుగుతున్న కొలువులు
- » టెక్నికల్ నైపుణ్యాలతోపాటు సృజనాత్మకతకు పెద్దపీట
- » స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు ఆకర్షణీయ వేతనాలు

యూట్యూబ్, ట్వీటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, లింక్డిన్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌తోపాటు వెబ్‌మీడియా కూడా ఇటీవల కాలంలో దూసుకుపోతోంది. అంతేకాకుండా జాతీయంగా, ప్రాంతీయంగా పేరొందిన ప్రముఖ మీడియా సంస్థల దృష్టి సైతం డిజిటల్ వేదికలపై పడింది. ఫలితంగా నెట్టింట్లో అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. సంబంధిత విద్యార్హతలతోపాటు టెక్నికల్ నాలెడ్జ్, సృజనాత్మకత ఉన్న అభ్యర్థులు సోషల్ మీడియాలో దూసుకుపోవచ్చు. మరోవైపు వ్యాపార సంస్థలు, రాజకీయ పార్టీలే కాకుండా.. సెలబ్రిటీలు సైతం తమ బ్రాండింగ్ పెంచుకోవడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకోవడం తెలిసిందే.

### జాబ్ ప్రొఫైల్స్ ఇవే

సోషల్ మీడియాలో వివిధ రకాల జాబ్ ప్రొఫైల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి... » మార్కెటింగ్ నిపుణులు, » సోషల్ మీడియా మేనేజర్లు, » సోషల్ మీడియా స్పెషలిస్టులు, » సోషల్ మీడియా అసోసియేట్స్, » కాపీ రైటర్స్, » కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్, » గ్రాఫిక్ డిజైనర్, » ఫిల్మ్ అండ్ వీడియో ఎడిటర్, » పబ్లిక్ రిలేషన్స్ స్పెషలిస్ట్, » మార్కెట్ రీసెర్చ్ అనలిస్ట్, » ప్రమోషన్ మేనేజర్, » అకౌంట్స్ మేనేజర్.

### అర్హతలు

ఏదైనా డిగ్రీ అర్హతతో సోషల్ మీడియా ఉద్యోగం కోసం ప్రయత్నించొచ్చు. ఇంగ్లిష్ లిటరేచర్, జర్నలిజం నేపథ్యం ఉన్నవారిని నియమించుకునేందుకు సంస్థలు మొగ్గుచూపుతున్నాయి. దీంతోపాటు టెక్నికల్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్, సోషల్ మీడియా వేదికలపై అవగాహన కలిగిన అభ్యర్థులు సోషల్ మీడియా సంబంధిత ఉద్యోగాల్లో సులువుగానే రాణించవచ్చు.

### మార్కెటింగ్ నిపుణులకు డిమాండ్

ప్రైవేటు రంగంలోని చాలా సంస్థలు సోషల్ మీడియా మీద దృష్టిసారించాయి. దాంతో సోషల్ మీడియా మార్కెటింగ్ నిపుణులకు మంచి డిమాండ్ నెలకొంది. ట్వీటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి వాటి ద్వారా తమ బ్రాండ్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు వీరిని నియమించుకుంటున్నాయి. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టాలి? ఎటువంటి వాటికి లైకులు వస్తున్నాయి, పేమెంట్ యాడ్స్ పుష్ చేసి బ్రాండింగ్ పెంచడం వంటి నైపుణ్యాలున్న అభ్యర్థులు మెరుగైన అవకాశాలు అందుకోవచ్చు. సంస్థల మీడియా నిర్వహణ, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, గూగుల్ యాడ్ వర్డ్స్, సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవడం వంటివి వీరి ముఖ్య విధులు. వీరికి అన్నిరకాల సోషల్ మీడియా వేదికల గురించి అవగాహన ఉండాలి.

### సోషల్ మీడియా మేనేజర్లు

సంస్థకు, క్లైంట్‌లకు సోషల్ మీడియా ప్రతినిధిగా వ్యవహరిస్తూ.. వినియోగదారుల ఫిర్యాదులకు, కామెంట్లకు స్పందించడం.. సక్రమ పద్ధతుల ద్వారా సంస్థ వెబ్‌సైట్‌లకు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు ఎక్కువ మందిని ఆకర్షించడం.. సోషల్ మీడియా మేనేజర్ల ప్రధాన బాధ్యతలు. డిగ్రీతోపాటు ఆకర్షణీయమైన ట్వీట్లు రాయడం, పోస్టులు చేయడం, సోషల్ మీడియా ట్రెండ్స్‌ని ఎప్పటికప్పుడూ అనుసరించడం ఈ ఉద్యోగానికి కావల్సిన ప్రధాన అర్హతలు. వీరు సోషల్ మీడియా పోస్టులు, బ్లాగ్ పోస్టులు రాయడం.. బ్యానర్లు డిజైన్ చేయడం.. ఫొటోలు, వీడియోలు సెలెక్ట్ చేసి ఎడిట్ చేయడం.. కాపీ రైటింగ్, యాడ్ మేనేజ్‌మెంట్, ఆప్టిమైజేషన్ వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

### సోషల్ మీడియా స్పెషలిస్టులు

సోషల్ మీడియా స్పెషలిస్టులకు మార్కెటింగ్ స్కిల్స్‌తోపాటు కంటెంట్ రైటింగ్, ఫొటో ఎడిటింగ్, వీడియో ఎడిటింగ్, టెక్స్ట్ ఎడిటింగ్ నైపుణ్యాలు ఉండాలి. వీటితో పాటు వెబ్ డిజైనింగ్, వెబ్ డెవలప్‌మెంట్, ఎస్‌ఈవో స్కిల్స్ అదనపు అర్హత. ప్రైవేటు సంస్థలు, కార్పొరేట్ కంపెనీల సోషల్ మీడియా స్పెషలిస్టు విభాగాల్లో పనిచేసే వారికి ప్రొఫెషనల్ స్కిల్స్ ఉండాలి. కంటెంట్ రైటింగ్‌తోపాటు టెక్నికల్ రైటింగ్ స్కిల్స్ తప్పనిసరి. కార్పొరేట్ సంస్థలు టెక్నికల్ రైటింగ్ స్కిల్స్ ఉన్న అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నాయి. కాంపిటీటివ్ రీసెర్చ్ స్కిల్స్ వీరి కెరీర్ ప్రగతికి దోహదపడతాయి. సదరు సంస్థకు పోటీదారులుగా ఉన్న సంస్థల కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ.. వాటి వ్యూహాలకు అనుగుణంగా ప్రతివ్యూహాలు రచించాలి. క్లైయింట్‌లను, సరైన వీక్షకులను గుర్తించడం కూడా వీరి విధుల్లో ముఖ్యమైనవి. ఎప్పటికప్పుడు సోషల్ మీడియా గణాంకాలను విశ్లేషిస్తూ మెరుగైన ప్రతిభ కనబరుస్తూ ఉండాలి.

### సోషల్ మీడియా మార్కెటర్లు

సంస్థలు సోషల్ మీడియా మార్కెటర్లను నియమించుకుంటున్నాయి. సంస్థ బ్రాండింగ్‌ను, వ్యాపారాన్ని పెంచేందుకు వీరు కృషి చేయాల్సి ఉంటుంది. సంస్థకు సంబంధించిన ప్రొఫైల్స్‌ను సోషల్ మీడియాలో నమోదు చేయడం, వాటి నిర్వహణ బాధ్యత కూడా వీరిదే! సంస్థ అవసరాన్ని బట్టి వినియోగదారులను గుర్తించి వారితో వ్యాపార బంధాలను పటిష్టం చేసుకోవాలి. అందుకోసం లింక్డిన్, ట్వీటర్, ఇన్‌స్టాగ్రాం, పిన్ ఇంట్రెస్ట్, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితరాల ఆధారంగా కంపెనీ వెబ్‌సైట్స్‌కు ట్రాఫిక్ వచ్చేలా చూసుకోవాలి. ఫాలోవర్స్, సభ్యుల కోసం వేర్వేరు కమ్యూనిటీలు క్రియేట్ చేయడం, గ్రూపుల నిర్వహణ తోపాటు పేజీలు నిర్వహించాలి. సోషల్ మీడియాలో ప్రమోషనల్ యాక్టివిటీస్ సక్రమంగా ఉండేలా చూడాలి. సోషల్ వేదికల మీద సంస్థ పేజీలు క్రియేట్ చేసి.. వాటిని సమర్థంగా నిర్వహిస్తూ యాక్టివిటీస్‌ను ఎప్పటికప్పుడూ అప్‌డేట్ చేయాలి. కంటెంట్ పబ్లిషింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి. కంటెంట్ సృజనాత్మకంగా, ఆకర్షణీయంగా ఉండేలా చూడాలి. మూస పద్ధతిలో కాకుండా.. కొత్తగా, సృజనాత్మకంగా ప్రమోషన్స్ చేయాల్సి ఉంటుంది.

### వివిధ రకాల కొలువులు

సోషల్ మీడియా విభాగంలో వివిధ పేర్లతో రకరకాల ఉద్యోగాలు ఉన్నాయి. వీటిల్లో మీడియా మార్కెటింగ్, మీడియా ఎగ్జిక్యూటివ్, మార్కెటర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ స్పెషలిస్టు, డిజిటల్ మార్కెటింగ్, మేనేజర్, ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ అనలిస్ట్, మార్కెటింగ్ అసోసియేట్, మార్కెటింగ్ మేనేజర్, మీడియా స్ట్రాటజిస్ట్, రైటర్ వంటి విభిన్న పేర్లతో ఉద్యోగాల్లో నియమించుకుంటారు. అనుభవం, పనితీరు ఆధారంగా వివిధ హోదాలు లభిస్తాయి. సోషల్ మీడియాలో ఉద్యోగాలను ఆన్‌లైన్ జాబ్ పోర్టల్స్‌తోపాటు వివిధ మీడియాలో వచ్చే ఉద్యోగ ప్రకటనలు, నెట్‌వర్కింగ్ ద్వారా అందిపుచ్చుకోవచ్చు.

### వేతనాలు

అర్హతలు, పని అనుభవం ఆధారంగా వేతనాలు లభిస్తాయి. ప్రారంభంలో రూ.15,000 నుంచి జీతాలు మొదలవుతాయి. ఏడాది, రెండేళ్ల అనుభవంతో రూ.30,000 నుంచి రూ. 40,000 వరకు జీతం అందుతుంది. ఈ రంగంలో ఫ్రీలాన్సింగ్ చేసుకోవడానికి చక్కటి అవకాశముంది.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
12-8-2019

## అండర్-19 ముక్కోణపు క్రికెట్ టోర్నీ విజేత భారత్

హోవ్ (ఇంగ్లండ్): బ్యాట్స్‌మెన్ బాధ్యతాయుతంగా ఆడటంతో... ఇంగ్లండ్‌లో జరిగిన అండర్-19 ముక్కోణపు క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. హోవ్ నగరంలో ఆదివారం జరిగిన ఫైనల్లో యువ భారత్ ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. తొలుత బంగ్లాదేశ్ సరిగ్గా 50 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. హసన్ జాయ్ (109; 9 ఫోర్లు, సిక్స్) సెంచరీ చేశాడు. భారత బౌలర్లలో కార్తీక్ త్యాగి, సుశాంత్ మిశ్రా రెండేసి వికెట్లు తీశారు. అనంతరం భారత్ 48.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి గెలిచింది. యశస్వి జైస్వాల్ (50), దివ్యాంశ్ సక్సేనా (55), కెప్టెన్ ప్రియమ్ గార్గ్ (73), ధ్రువ్ జురెల్ (59 నాటౌట్) అర్ధ సెంచరీలు చేశారు. హైదరాబాద్ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ (10 బంతుల్లో 16 నాటౌట్; 3 ఫోర్లు) రాణించాడు. ధ్రువ్‌తో కలిసి తిలక్ వర్మ అజేయ ఐదో వికెట్‌కు 29 పరుగులు జోడించాడు.

# కోహ్లి కొట్టాడు... అయ్యర్ ఆకట్టుకున్నాడు

- వెస్టిండీస్‌తో రెండో మ్యాచ్‌లో భారత్ 279/7
- వన్డే కెరీర్‌లో 42వ సెంచరీ చేసిన టీమిండియా కెప్టెన్




**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** మొదట్లో, చివర్లో తడబడినా... మధ్యలో కెప్టెన్ విరాట్ కోహ్లి (125 బంతుల్లో 120; 14 ఫోర్లు, సిక్స్) సెంచరీ, యువ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ (68 బంతుల్లో 71; 5 ఫోర్లు, సిక్స్) చక్కటి అర్ధ సెంచరీలతో మెరవడంతో ఆదివారం ఇక్కడ జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్‌పై టీమిండియా మెరుగైన స్కోరు సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా... ఓపెనర్లు విఫలమైనా కోహ్లి, అయ్యర్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 279 పరుగులు చేసింది. వన్డేల్లో కోహ్లి 42వ శతకం సాధించాడు. విండీస్ బౌలర్లలో బ్రాత్‌వైట్ (3/53) రాణించగా, కాట్రెల్, హోల్డర్, చేజ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.
కడపటి వార్తలు అందేసరికి... వర్షం వల్ల ఆట నిలిచే సమయానికి వెస్టిండీస్ 12.5 ఓవర్లలో రెండు వికెట్లకు 55 పరుగులు చేసింది. భువనేశ్వర్ బౌలింగ్‌లో క్రిస్ గేల్ (24 బంతుల్లో 11; ఫోర్) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగ్గా... ఖలీల్ బౌలింగ్‌లో షై హోప్ (1) బౌల్డయ్యాడు. వ్యక్తిగత స్కోరు 7 పరుగుల వద్ద క్రిస్ గేల్ విండీస్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. బ్రియాన్ లారా (10,348 పరుగులు) పేరిట ఉన్న రికార్డును గేల్ అధిగమించాడు.

### వారే నిలిపారు...

ఓపెనర్ ధావన్ (2) పరుగుల ప్రయాస కొనసాగడంతో భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ మూడో బంతికే అతడు కాట్రెల్‌కు వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ ఔటివ్వకున్నా విండీస్ రివ్యూ కోరి ఫలితం రాబట్టింది. మరో ఓపెనర్ రోహిత్ శర్మ (34 బంతుల్లో 18; 2 ఫోర్లు)... 11వ బంతికి ఖాతా తెరిచాడు. ఆ తర్వాతా ఇబ్బందిగానే కనిపించాడు. సమన్వయ లోపంతో రెండుసార్లు రనౌటయ్యే ప్రమాదం ఎదుర్కొన్నాడు. ఎక్కువగా స్ట్రయికింగ్ తీసుకున్న కోహ్లి తనదైన శైలిలో సాధికారికంగా ఆడాడు. చకచకా అర్ధసెంచరీ (57 బంతుల్లో) అందుకున్నాడు. ఈ దశలో చేజ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి రోహిత్ పెవిలియన్ చేరాడు. వీరి మధ్య రెండో వికెట్‌కు 74 పరుగులు జతకూడితే ఇందులో విరాట్‌వే 50 ఉండటం గమనార్హం. నాలుగో స్థానంలో పంత్ (35 బంతుల్లో 20; 2 ఫోర్లు) ప్రయోగం ఈసారీ విఫలమైంది. శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి బౌలర్లు వేసిన బంతులకు పంత్ ఇబ్బంది పడ్డాడు. బ్రాత్‌వైట్ స్లో డెలివరీని ఫైన్ లెగ్‌లోకి స్కూప్ చేసే యత్నంలో బౌల్డయ్యాడు. అప్పటికి స్కోరు 22.2 ఓవర్లలో 101/3. మరో వికెట్ పడకుండా చూసుకుంటూ కోహ్లి, అయ్యర్ స్వేచ్ఛగా ఆడారు. శ్రేయస్ సింగిల్స్‌తో స్ట్రయిక్ రొటేట్ చేస్తూ వీలుచూసుకుని బౌండరీలు బాదాడు. మొదటి నుంచి అతడి స్ట్రయిక్ రేట్ 100పైనే నిలిచింది. హోల్డర్ బౌలింగ్‌లో సింగిల్‌తో కోహ్లి సెంచరీ (112 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే అయ్యర్ అర్ధ శతకం (49 బంతుల్లో) అందుకున్నాడు. థామస్ ఓవర్లో నాలుగు బంతుల వ్యవధిలో మూడు ఫోర్లు బాది స్కోరు పెంచే యత్నం చేసిన కోహ్లి అదే ఊపులో బ్రాత్‌వైట్ బౌలింగ్‌లో భారీ షాట్ కొట్టబోయి వెనుదిరిగాడు. కోహ్లి-అయ్యర్ నాలుగో వికెట్‌కు 115 బంతుల్లోనే 125 పరుగులు జోడించారు. భారత ఇన్నింగ్స్ 42.2వ ఓవర్ వద్ద ఉండగా వర్షం 25 నిమిషాలు ఆటంకం కలిగించింది. తిరిగి ప్రారంభమయ్యాక రోచ్ ఓవర్లో చక్కటి సిక్స్ కొట్టిన అయ్యర్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించేలా కనిపించాడు. కానీ, అతడిని హోల్డర్ పెవిలియన్ చేర్చాడు. జాదవ్ (16), భువనేశ్వర్ (1) విఫలమైనా జడేజా (16 నాటౌట్) కాసిన్ని పరుగులు జోడించాడు.


అయ్యర్


పంత్ బౌల్డ్

### నాలుగులో అయ్యర్ కాదు.. పంత్

ఈ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగో స్థానంలో నిఖార్సైన బ్యాట్స్‌మన్ కోసం ఎదురుచూస్తూ, అందుకే అన్నట్లుగా ఎంపిక చేసిన అయ్యర్‌ను కాదని పంత్‌ను ముందుగా పంపారు. రోహిత్ ఔటైన ఆ సమయానికి ఇంకా 34.3 ఓవర్లున్నాయి. కెప్టెన్ కోహ్లితో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించేందుకు, నాణ్యమైన నంబర్-4 బ్యాట్స్‌మన్ దిగేందుకు ఇది అనువైన పరిస్థితి. భారత్ భవిష్యత్ అవసరాలరీత్యా చూసినా శ్రేయస్‌నే దింపాలి. కానీ, ఊహించని విధంగా పంత్ వచ్చాడు. వస్తూనే రెండు ఫోర్లు కొట్టిన రిషభ్ ఆ తర్వాత జోరు చూపలేకపోయాడు. అతడు ఎదుర్కొన్న చివరి 14 బంతుల్లో 12 బంతులకు పరుగే రాలేదు. అయ్యర్,పంత్ బ్యాటింగ్ చేసిన తీరును పోల్చి చూసినా నంబర్-4లో ఎవరు సరైనవారో తెలిసిపోతుంది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** శిఖర్ ధావన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కాట్రెల్ 2; రోహిత్ శర్మ (సి) పూరన్ (బి) చేజ్ 18; విరాట్ కోహ్లి (సి) రోచ్ (బి) బ్రాత్‌వైట్ 120; రిషభ్ పంత్ (బి) బ్రాత్‌వైట్ 20; శ్రేయస్ అయ్యర్ (బి) హోల్డర్ 71; కేదార్ జాదవ్ (రనౌట్) 16; జడేజా (నాటౌట్) 16; భువనేశ్వర్ (సి) రోచ్ (బి) బ్రాత్‌వైట్ 1; షమీ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 279.**
**వికెట్ల పతనం:** 1-2, 2-76, 3-101, 4-226, 5-250, 6-258, 7-262.
**బౌలింగ్:** కాట్రెల్ 10-0-49-1, రోచ్ 7-0-54-0, హోల్డర్ 9-0-53-1, థామస్ 4-0-32-0, చేజ్ 10-1-37-1, బ్రాత్‌వైట్ 10-0-53-3.

### కోహ్లి శతక నిరీక్షణ తీరింది...

ప్రపంచ కప్ నుంచి సాగుతున్న కోహ్లి సెంచరీల నిరీక్షణకు తెరపడింది. కప్‌లో 9 మ్యాచ్‌ల్లోనూ సెంచరీ చేయలేకపోయిన విరాట్ విండీస్‌పై రెండో వన్డేలో అవకాశాన్ని వదల్లేదు. మార్చిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో కోహ్లి శతకం (123) బాదాడు. ఆ సిరీస్‌లో మిగతా రెండు మ్యాచ్‌లు, తర్వాత ప్రపంచ కప్‌లో 9 మొత్తం 11 మ్యాచ్‌ల్లోనూ సెంచరీ కొట్టలేకపోయాడు. గతంలో ఓసారి అతడు వరుసగా 18 మ్యాచ్‌ల్లో శతకం అందుకోలేకపోయాడు. ఓవరాల్‌గా వెస్టిండీస్‌పై అతడికిది 8వ సెంచరీ. ఆసీస్, శ్రీలంకపైనా ఎనిమిదేసి సెంచరీలు చేశాడు.

### గంగూలీని దాటిన కోహ్లి...

**కో**హ్లి అరుదైన రికార్డుకు రెండో వన్డే వేదికైంది. భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ జాబితాలో మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ (311 మ్యాచ్‌ల్లో 11,363)ని అధిగమించి అతడు రెండో స్థానానికి చేరాడు. దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ (463 మ్యాచ్‌ల్లో 18,426 పరుగులు) టాప్‌లో ఉన్నాడు. సరిగ్గా పదకొండేళ్ల క్రితం ఆగస్టులో శ్రీలంకపై తొలి వన్డే ఆడిన కోహ్లి... ఇప్పటివరకు 238 మ్యాచ్‌లు, 229 ఇన్నింగ్స్‌ల్లో 11,406 పరుగులు చేశాడు. వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన వారిలో అతను ఎనిమిదో స్థానంలో ఉన్నాడు.

# విజేత సౌరభ్ వర్మ

## హైదరాబాద్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ సొంతం

## మహిళల డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన సిక్కి రెడ్డి–అశ్విని జోడీ


సౌరభ్



**సాక్షి, హైదరాబాద్:** జాతీయ చాంపియన్ సౌరభ్ వర్మ ఈ ఏడాది రెండో అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిసిన హైదరాబాద్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-100 టోర్నమెంట్‌లో సౌరభ్ వర్మ పురుషుల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా నిలిచాడు. 52 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో సౌరభ్ వర్మ 21-13, 14-21, 21-16తో లో కీన్ యె (సింగపూర్)పై విజయం సాధించాడు. మేలో సౌరభ్ వర్మ స్లొవేనియా ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలోనూ విజేతగా నిలిచాడు. 'ఈ టోర్నీలో నా ప్రదర్శన పట్ల చాలా సంతృప్తిగా ఉన్నాను. పలు హోరాహోరీ మ్యాచ్‌ల్లో విజయాన్ని అందుకున్నాను. ఫైనల్లో తొలి గేమ్ గెలిచాక రెండో గేమ్‌లో ఆధిక్యంలో ఉన్న దశలో ఏకాగ్రత కోల్పోయాను. తొందరగా మ్యాచ్‌ను ముగించాలనే ఉద్దేశంతో అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాను. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో మళ్లీ వ్యూహం మార్చి ప్రత్యర్థిపై పైచేయి సాధించాను' అని మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల సౌరభ్ వర్మ వ్యాఖ్యానించాడు. విజేతగా నిలిచిన సౌరభ్ వర్మకు 5,625 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 లక్షల 98 వేలు)తోపాటు 5,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మహిళల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ నేలకుర్తి సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జంటకు నిరాశ ఎదురైంది. బేక్ హా నా-జుంగ్ క్యుంగ్ యున్ (దక్షిణ కొరియా) జోడీతో జరిగిన ఫైనల్లో సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప ద్వయం 17-21, 17-21తో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. రన్నరప్‌గా నిలిచిన సిక్కి-అశ్విని జోడీకి 2,850 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 2 లక్షలు)తోపాటు 4,680 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

# సెమీస్‌లో ఓడిన బోపన్న జంట

**న్యూఢిల్లీ:** మాంట్రియల్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నమెంట్‌లో అన్‌సీడెడ్ రోహన్ బోపన్న (భారత్)-డెనిస్ షపోవలోవ్ (కెనడా) జంట పోరాటం ముగిసింది. కెనడాలో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న-షపోవలోవ్ ద్వయం 6-7 (3/7), 6-7 (7/9)తో రాబిన్ హాస్-వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. గంటా 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట నాలుగు ఏస్‌లు సంధించింది. రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి, తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన బోపన్న జంటకు 76,300 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 54 లక్షల 11 వేలు)తోపాటు 360 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.




# జెర్సీ మారింది... బోణీ కొట్టింది

## ఎట్టకేలకు గెలిచిన తెలుగు టైటాన్స్ • రాణించిన సిద్ధార్థ్, విశాల్ • ప్రొ కబడ్డీ లీగ్

**అహ్మదాబాద్:** మారిన జెర్సీ రంగు తెలుగు టైటాన్స్ జట్టుకు అదృష్టాన్ని తీసుకొచ్చింది. ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో అందని ద్రాక్షలా ఉన్న గెలుపు ఎట్టకేలకు తెలుగు టైటాన్స్‌ను పలకరించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 30-24తో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌ను ఓడించి ఈ లీగ్‌లో తొలి విజయాన్ని అందుకుంది. టైటాన్స్ తరఫున సిద్ధార్థ్ దేశాయ్, విశాల్ భరద్వాజ్‌లు చెరో ఏడు పాయింట్లతో జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. మ్యాచ్ మొత్తంలో 16 టాకిల్ పాయింట్లు, 11 రైడ్ పాయింట్లతో ప్రత్యర్థిని రెండుసార్లు ఆలౌట్ చేసిన తెలుగు జట్టు గెలుపు బోణీ కొట్టింది.

సీజన్‌లో ఇప్పటి వరకు ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పసుపు రంగు జెర్సీతో బరిలో దిగిన టైటాన్స్... గుజరాత్‌తో మ్యాచ్‌లో మాత్రం నల్ల రంగు జెర్సీతో ఆడింది. కొత్త జెర్సీ రంగు ఏం అదృష్టం తెచ్చిందో ఏమో కానీ.. ప్రత్యర్థి జట్టును ఆట ఆరంభమైన ఏడో నిమిషంలోనే ఆలౌట్ చేసింది. మొదటి అర్ధ భాగంలో సిద్ధార్థ్ రైడింగ్‌లో చెలరేగితే... రెండో అర్ధ భాగంలో విశాల్ భరద్వాజ్ తన పట్టుతో ప్రత్యర్థి రైడర్లను పట్టేశాడు. దీంతో గుజరాత్ సొంత మైదానంలో వరుసగా రెండో ఓటమిని నమోదు చేసింది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 30-33తో హరియాణా స్టీలర్స్ చేతిలో ఓడింది. హరియాణా రైడర్ వికాస్ ఖండోలా 12 పాయింట్లతో రాణించాడు. నేటి మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో తెలుగు టైటాన్స్; యూపీ యోధతో బెంగళూరు బుల్స్ తలపడతాయి.



# రన్నరప్ యువ భారత్



**న్యూఢిల్లీ:** తొలిసారి ఆసియా అండర్-23 పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవాలని ఆశించిన భారత జట్టు తుది మెట్టుపై తడబడింది. మయన్మార్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 21-25, 20-25, 25-19, 23-25తో చైనీస్ తైపీ చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఈ టోర్నీలో భారత్ మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడింది. చైనా, న్యూజిలాండ్, కజకిస్తాన్, ఆస్ట్రేలియా, పాకిస్తాన్ జట్లపై గెలిచి జపాన్, థాయ్‌లాండ్, చైనీస్ తైపీ జట్ల చేతిలో ఓడింది. ఈ టోర్నీలో విజేత చైనీస్ తైపీ, రన్నరప్ భారత్ జట్లు అండర్-23 ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాయి.

# వినేశ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** ఈ సీజన్‌లో వరుసగా నాలుగో స్వర్ణ పతకం సాధించాలని ఆశించిన భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు నిరాశ ఎదురైంది. బెలారస్‌లో ఆదివారం ముగిసిన మెద్వెద్ ఓపెన్ టోర్నమెంట్‌లో వినేశ్ రన్నరప్‌గా నిలిచింది. రష్యా రెజ్లర్ మలిషెవాతో జరిగిన ఫైనల్లో వినేశ్ 0-10తో ఓడింది. ఈ సీజన్‌లో వినేశ్ స్పెయిన్ గ్రాండ్‌ప్రి, యాసర్ డొగో టోర్నీ, పోలాండ్ ఓపెన్ టోర్నీల్లో పసిడి పతకాలు సాధించింది. మెద్వెద్ టోర్నీలోనే ఇతర భారత మహిళా రెజ్లర్లు కూడా ఆకట్టుకున్నారు. పింకీ (55 కేజీలు), సరిత (57 కేజీలు) కూడా రజతాలు గెలిచారు. సాక్షి మలిక్ (62 కేజీలు), నవ్‌జ్యోత్ కౌర్ (68 కేజీలు), రాణి (72 కేజీలు), కిరణ్ (76 కేజీలు) కాంస్య పతకాలు నెగ్గారు.

### సుశీల్‌కు నిరాశ... రవికి కాంస్యం

ఇదే టోర్నీలో భారత స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 74 కేజీల విభాగంలో జరిగిన కాంస్య పతక పోరులో సుశీల్ 7-8తో కడిమగమెదోవ్ (రష్యా) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో అబ్దురఖమనోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో సుశీల్ 90 సెకన్లలో ఓటమి పాలయ్యాడు. అయితే అబ్దురఖమనోవ్ ఫైనల్‌కు చేరడంతో సుశీల్‌కు రెపిచేజ్ పద్ధతి ద్వారా కాంస్య పతక పోరులో ఆడే అవకాశం దక్కింది. పురుషుల 57 కేజీల విభాగంలో భారత్‌కే చెందిన రవి దహియాకు కాంస్యం లభించింది. కాంస్య పతక బౌట్‌లో రవి 9-4తో అరాబిడ్జె (రష్యా)పై గెలిచాడు.

# టి20ల్లో థాయ్ అమ్మాయిల ప్రపంచ రికార్డు

## వరుసగా 17వ విజయం




**దుబాయ్:** థాయ్‌లాండ్ మహిళల క్రికెట్ జట్టు అంతర్జాతీయ టి20ల్లో కొత్త రికార్డు సృష్టించింది. వరుసగా 17వ విజయంతో ఆసీస్ పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. నెదర్లాండ్స్‌లో జరుగుతున్న నాలుగు దేశాల టి20 టోర్నీలో థాయ్ జట్టు ఆతిథ్య జట్టును 54 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం స్వల్పలక్ష్యాన్ని కేవలం 8 ఓవర్లలోనే ఛేదించింది. ఇది థాయ్‌లాండ్ అమ్మాయిలకు వరుసగా 17వ విజయం. ఈ నాలుగు దేశాల టోర్నీలో ఐర్లాండ్, స్కాట్లాండ్ మిగతా జట్లు... కాగా గత ఏడాది జూలైలో యూఏఈని ఓడించడం ద్వారా థాయ్‌లాండ్ జైత్రయాత్ర మొదలైంది. ఇప్పటి వరకు ఆసీస్ మహిళలు 2014-15 సీజన్‌లో 16 వరుస విజయాలతో రికార్డు సృష్టించగా ఇప్పుడు థాయ్ జట్టు ఆ రికార్డును చెరిపేసింది. అత్యధిక వరుస విజయాల జాబితాలో థాయ్, ఆసీస్ తర్వాత ఇంగ్లండ్, జింబాబ్వే మహిళల జట్లు 14 విజయాలతో నిలువగా, న్యూజిలాండ్ 12 విజయాలతో టాప్-5లో ఉంది.

# సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం
12-8-2019


## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 255 ▲ | 77 ▲ |
| 37,582 | 11,110 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,959 | ▽ 80 |
| డోజోన్స్ | 26,287 | ▽ 91 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,254 | ▽ 32 |
| డాక్స్ | 11,694 | ▽ 152 |
| షాంఘై | 2,775 | ▽ 20 |
| నికాయ్ | 20,685 | ▲ 91 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|
| యూఎస్ డాలర్ | 69.75 | 71.39 |
| బ్రిటన్ పౌండ్ | 84.12 | 87.17 |
| యూరో | 77.56 | 80.46 |
| జపాన్ ఎన్ (100) | 65.34 | 67.83 |
| ఆస్ట్రేలియా డాలర్ | 47.01 | 49.19 |
| సింగపూర్ డాలర్ | 50.2 | 51.96 |
| సౌదీ రియాల్ | 18.10 | 19.87 |
| యూఏఈ దిర్హామ్ | 18.53 | 20.10 |
| చైనా యువాన్ | 9.41 | 10.76 |

# 'పన్ను'కు టైమైంది..

- ఈ నెలాఖరు వరకు ఐటీఆర్ దాఖలు గడువు
- ఒక నెలపాటు పొడిగించిన కేంద్రం
- గడువులోపు దాఖలుతో జరిమానాల భారం లేదు
- ఆదాయంలో ఎన్నో భాగాలు
- కొన్నింటిపైనే పన్ను
- మినహాయింపులు పోను మిగతా ఆదాయంపై పన్ను
- ఆన్‌లైన్‌లోనే సులభంగా రిటర్నులు దాఖలు
- అందరికీ ఒకటే ఫామ్ కాదు
- ఒక్కో వర్గానికి ఒక్కోరకమైన ఐటీఆర్




**గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటర్నులు దాఖలు చేసేందుకు పెద్దగా సమయం లేదు. వాస్తవానికి జూలై చివరి నాటికే ఆదాయపన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఆగస్ట్ చివరి వరకు గడువును పొడిగించింది. దీంతో ఈ నెల చివరి వరకు అవకాశం లభించినట్టు అయింది. కనుక వెంటనే ఐటీఆర్ దాఖలును ప్రారంభించడం మంచిది. బేసిక్ పన్ను మినహాయింపు అయిన రూ.2.5 లక్షలు (60 ఏళ్లు దాటిన వారికి రూ.3 లక్షలు) దాటి ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరూ నిబంధనల మేరకు ఐటీఆర్ తప్పనిసరిగా దాఖలు చేయాల్సి ఉంటుంది. ఐటీఆర్ దాఖలు చేయాలంటే, అందులో ఉండే పన్ను అంశాలు, వాటికి సంబంధించి ఇవ్వాల్సిన వివరాలు అన్నింటినీ సిద్ధం చేసుకోవాలి. అంతేకాదు అందరికీ ఒకటే ఐటీఆర్ వర్తించదు. వేతన జీవులు, వ్యాపారులు, ఉమ్మడి కుటుంబాల వారు... ఇలా వారి ఆదాయ మార్గాలను బట్టి ఐటీఆర్ కూడా మారిపోతుంది. కనుక ఐటీఆర్ ప్రక్రియ గురించి అవగాహన కలిగి ఉంటే, సులభంగా దాఖలు చేయవచ్చు. ఆ వివరాలే ఈవారం ప్రాఫిట్ ప్లస్ కథనం...**

గడువులోపు ఐటీఆర్ దాఖలు అన్నది మంచి చర్య అవుతుంది. లేదంటే పెనాల్టీలు, ఇతర వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తుంది. ఐటీఆర్ దాఖలు కోసం ముందుగా మీరు మీ ఆదాయ వనరులు అన్నింటిపై అవగాహన కలిగి ఉండాలి. వేతనం, ఇంటి అద్దె, ఏవైనా రాయల్టీలు (ప్రతిఫలాలు) ఇలా అన్ని ఆదాయ వనరుల సమాచారం సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత మీ ఆదాయంలో దేనిపై పన్ను వర్తిస్తుందన్నది తెలుసుకోవాలి. ఆదాయ పన్ను అన్నది బేసిక్ శాలరీ, కరువుభత్యం (డీఏ), బోనస్‌లపై అమలవుతుంది. సొంతిల్లు ఉండి, అందులో మీరు నివసిస్తుంటే తప్ప ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) పన్ను పరిధిలోకి రాదు. ఇక ఆదాయంలో పన్ను మినహాయింపులు వేటికన్నది గుర్తించాల్సి ఉంటుంది. సేవింగ్స్ పథకాలు, బీమా పాలసీలు, ఈపీఎఫ్, పీపీఎఫ్ వంటివన్నీ సెక్షన్ 80సీ కింద మినహాయింపులోకి వస్తాయి. పన్ను వర్తించే ఆదాయం అన్నది స్థూల ఆదాయంలో ఒక భాగం కాగా, మిగిలినది మినహాయింపులకు అర్హమైనది. పన్ను వర్తించే ఆదాయంపై పన్నును చెల్లించాల్సి ఉంటుంది. ఇలా పన్ను ఆదాయం ఉన్న వారి వేతనం నుంచి టీడీఎస్‌ను సంస్థలు మినహాయిస్తుంటాయి. ఈ వివరాలను ఫామ్-16 రూపంలో సంస్థ నుంచి పొందొచ్చు. ఐటీ చట్టం ప్రకారం పలు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. మీకు పన్ను వర్తించే ఆదాయం ఏ శ్లాబు పరిధిలోకి వస్తే, అందులో వర్తించే రేటు మేరకు పన్ను చెల్లించాలి. ఐటీఆర్‌లో అన్ని వివరాలు పొందుపరిచి మినహాయింపుల ఆదాయం పోను మిగిలిన ఆదాయంపై పన్ను చెల్లించిన తర్వాత... ఏవైనా వ్యత్యాసం ఉంటే.. ఆ మేరకు పన్ను చెల్లింపుదారుడు రిఫండ్ కోరొచ్చు. తనే అదనంగా చెల్లించాల్సి ఉంటే పన్ను కట్టాల్సి ఉంటుంది.

### ఆదాయ వనరులు...

మీరు ఉద్యోగి అయితే, నెలవారీ ఆదాయం లేదా వార్షికాదాయంతోపాటు.. ఇతర మార్గాల నుంచి వచ్చే ఆదాయం (అంటే ఇంటిపై అద్దె, ఉన్న ఆస్తిని విక్రయించగా వచ్చిన ఆదాయం వంటివి). పన్ను పరంగా అన్ని రకాల ఆదాయం సంబంధిత ఆర్థిక సంవత్సరంలో మీ మొత్తం ఆదాయం కిందకు వస్తుంది. బేసిక్ సాలరీ, బోనస్‌లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఇతర అలవెన్స్‌ను వేతనంలో భాగంగా పొందుతుంటే అది పన్ను వర్తించే ఆదాయమే. అలాగే, ఇంటిపై వచ్చే ఆదాయంపైనా పన్ను ఉంటుంది. ఏదైనా ఆస్తిని విక్రయించగా వచ్చిన మూలధన లాభం లేదా నష్టం. వ్యాపారంపై వచ్చే ఆదాయం. ఫిక్స్‌డ్ డిపాజిట్, సేవింగ్స్ బ్యాంకు ఖాతాపై వడ్డీ ఆదాయం, గిఫ్ట్, కుటుంబ పెన్షన్‌ను సైతం ఐటీఆర్‌లో చూపించాల్సి ఉంటుంది.

### మినహాయింపులు...

ఆదాయపన్ను చట్టంలోని పలు సెక్షన్లు ఆదాయంలో కొంత వరకు పన్ను మినహాయింపులు పొందేందుకు వీలు కల్పిస్తున్నాయి. సెక్షన్ 80సీ, 80సీసీసీ, 80సీసీడీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల ఆదాయానికి పన్ను మినహాయింపు ఉంటుంది. పెన్షన్ ప్లాన్లు, బీమా పాలసీలు, ఈపీఎఫ్, పీపీఎఫ్, ఎన్‌ఎస్‌సీ, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్, ఈఎల్‌ఎస్‌ఎస్ పథకాల్లో పెట్టుబడులు, పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజు చెల్లింపులు ఈ సెక్షన్ల కింద పన్ను మినహాయింపునకు అర్హమైనవి. అందుబాటులో ఉన్న సాధనాల్లో మీకు అనుకూలమైన వాటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఈ మేరకు ఆదాయంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. కాకపోతే ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ చేసుకోవడం సౌకర్యవంతం.

ఇవి కాకుండా ఇతర పన్ను మినహాయింపులు కూడా ఉన్నాయి. ఇంటి కొనుగోలు కోసం తీసుకున్న రుణానికి చేసే అసలు (ప్రిన్సిపల్) మొత్తంపై సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల పరిమితి మేరకు పన్ను మినహాయింపు పొందొచ్చు. రుణంపై సమకూర్చుకున్న ఇంటిని సొంత వినియోగానికి ఉంచుకుంటే గరిష్టంగా సెక్షన్ 24 కింద ఓ ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల వడ్డీ చెల్లింపులకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ ఇంటిని అద్దెకు ఇచ్చినట్టయితే, ఆ ఇంటి రుణంపై చేసే వడ్డీ చెల్లింపులు మొత్తంపైనా పరిమితి లేకుండా పన్ను మినహాయింపు పొందొచ్చు. ఇక మొదటి సారి ఇంటిని కొనుగోలు చేసిన వారు సెక్షన్ 80ఈఈ కింద రూ.2 లక్షలకు అదనంగా మరో రూ.50,000 వరకు వడ్డీ చెల్లింపులపై మినహాయింపు చూపించుకోవచ్చు. బ్యాంకు సేవింగ్స్ ఖాతాపై వార్షికంగా వడ్డీ ఆదాయం రూ.10,000 వరకు వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలకు (హెచ్‌యూఎఫ్) సెక్షన్ 80టీటీఏ కింద పన్ను మినహాయింపు ఉంది. సెక్షన్ 80సీసీజీ ఈక్విటీ సేవింగ్ స్కీమ్‌లో పెట్టుబడులపై 50 శాతం, గరిష్టంగా 25,000కు... దీర్ఘకాలిక ఇన్‌ఫ్రా బాండ్లలో రూ.20,000 పెట్టుబడులకు సెక్షన్ 80సీసీఎఫ్ కింద పన్ను మినహాయింపులు ఉన్నాయి. సెక్షన్ 80డీ కింద వ్యక్తులు అయితే రూ.25,000 వరకు హెల్త్ ప్రీమియంపై, వృద్ధులకు రూ.30,000 ప్రీమియంకు పన్ను మినహాయింపు ఉంది. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంపై చేసే వడ్డీ చెల్లింపులు పరిమితి లేకుండా ప్రయోజనం పొందొచ్చు.

**అన్ని వివరాలపై అవగాహన తెచ్చుకున్న తర్వాత ఐటీఆర్ దాఖలు చేయడం ద్వారా సమగ్రంగా ఉండేలా చూసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో స్వయంగా ఐటీఆర్ దాఖలు చేయడం లేదంటే నిపుణుల సాయం తీసుకోవచ్చు. మీ సమక్షంలో వారు ఐటీఆర్ దాఖలు చేస్తారు. ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్ నుంచి ఆదాయపన్ను రిటర్నుల దాఖలు పత్రం సహజ్‌ను పొందొచ్చు. ఆదాయపన్ను ఈఫైలింగ్ వెబ్‌పోర్టల్‌లో తమ పేరిట అకౌంట్ క్రియేట్ చేసుకుంటే, ఆన్‌లైన్‌లోనే ఈ ఫామ్‌ను పూర్తి చేసి దాఖలు చేయవచ్చు. ఇలా రిటర్నులు దాఖలు చేసే ముందు ఆదాయం, పెట్టుబడుల వివరాలను, సంబంధిత డాక్యుమెంట్లను, ఫామ్ 16ను రెడీగా ఉంచుకోవాలి. రిటర్నుల సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఐటీఆర్ దాఖలును సులభంగా పూర్తి చేయవచ్చు. ఆన్‌లైన్ టూల్‌ను గతంలో వినియోగించినట్టయితే, లాగిన్ అయి ప్రీఫిల్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. వీటికి అదనంగా ఇతర వివరాలను నమోదు చేసి దాఖలు ప్రక్రియను పూర్తి చేయడం**

### ఐటీఆర్ దాఖలు ఇలా...

సులభం. అన్ని వివరాలను నమోదు చేసిన తర్వాత మీపై పన్ను చెల్లింపు బాధ్యత ఎంతన్నది లెక్కించుకోవాలి. అంతిమంగా చెల్లించాల్సిన పన్ను, అప్పటికే టీడీఎస్ రూపంలో చెల్లించినది పోను మిగిలిన మేర చెల్లించాలి. ఐటీఆర్‌ను దాఖలు చేసిన తర్వాత ఐటీఆర్-వీ ఫామ్ అన్నది జనరేట్ అవుతుంది. దీనిపై డిజిటల్‌గా సంతకం చేసుకునే ఆప్షన్‌ను ఎంచుకుని ఐటీఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయవచ్చు. లేదంటే ఐటీఆర్-వీ పత్రాన్ని ప్రింట్ తీసుకుని, సంతకం చేసి, ఐటీ కార్యాలయానికి పోస్ట్ ద్వారా పంపుకోవచ్చు.



## ఏ సెక్షన్ ఏం చెబుతోంది...

| సెక్షన్ | అనుమతించిన మినహాయింపు | ఇన్వెస్ట్‌మెంట్/ఆదాయం/విరాళం | అర్హులు |
|---|---|---|---|
| 80సీ | గరిష్టంగా రూ.1.5 లక్షలు | పీపీఎఫ్, ఈపీఎఫ్, బ్యాంకు ఎఫ్‌డీ, ఎన్‌ఎస్‌సీ, జీవిత బీమా ప్రీమియం, ట్యూషన్ ఫీజు | వ్యక్తులు, హెచ్‌యూఎఫ్ |
| 80సీసీసీ | | పెన్షన్ బాండ్లు | వ్యక్తులు |
| 80సీసీడీ | | కేంద్ర ప్రభుత్వ పెన్షన్ ఫండ్ (ఎన్‌పీఎస్) | వ్యక్తులు |
| (80సీ, 80సీసీసీ, 80సీసీడీ మూడింటికీ కలిపి గరిష్ట మినహాయింపు రూ.1,50,000 మాత్రమే) | | | |
| 80టీటీఏ | రూ.10,000 | బ్యాంకు సేవింగ్స్ ఖాతా వడ్డీ | వ్యక్తులు, హెచ్‌యూఎఫ్ |
| 80సీసీజీ | ఇన్వెస్ట్‌మెంట్‌లో 50 శాతం. గరిష్టంగా రూ.25వేలు | | వ్యక్తులు |
| 80సీసీఎఫ్ | రూ.20,000 వరకు | దీర్ఘకాల ఇన్‌ఫ్రా బాండ్లు | వ్యక్తులు, హెచ్‌యూఎఫ్ |
| 80డీ | వ్యక్తులు అయితే రూ.25,000వేలు, వృద్ధులకు రూ.30,000 | వైద్య బీమా ప్రీమియం, హెల్త్‌చెకప్ | వ్యక్తులు, హెచ్‌యూఎఫ్ |
| 80ఈ | పరిమితి లేదు | విద్యా రుణంపై చెల్లించే వడ్డీ | వ్యక్తులు |
| 80జీ | విరాళాలు | గుర్తింపు పొందిన సొసైటీకి ఇచ్చేవి | వ్యక్తులు, హెచ్‌యూఎఫ్, కంపెనీలు, సంస్థలు |
| 80జీజీఏ | విరాళాలు | సైంటిఫిక్ పరిశోధన లేదా గ్రామీణ అభివృద్ధికి | వ్యాపారం లేదా వృత్తి రూపంలో ఆదాయం లేని వారు |
| 80జీజీబీ | విరాళాలు | రాజకీయ పార్టీలకు విరాళాలు | కంపెనీలు |

# ఎవరు.. ఏ ఫారం దాఖలు చేయాలి..

ఒక వ్యక్తి ఏయే ఫారంల ద్వారా రిటర్నులు దాఖలు చెయ్యాలో ఈ వారం తెలుసుకుందాం. గతంలో వేతన జీవులకొక ఫారం, ఇతరులకొక ఫారం అంటూ రెండే ఉండేవి. కాలక్రమంలో ఎన్నో మార్పు.. ఎన్నో ఫారాలు.. మొత్తం వాడుకలో ఉన్న ఏడు ఫారాలలో నాలుగు ఫారాలు వ్యక్తులకు వర్తిస్తాయి. వివరాల్లోకి వెళితే..

ప్రస్తుతం ప్రీఫిల్డ్ ఫారాలు అమల్లో ఉన్నాయి. ఐటీ సైట్‌లోకి వెళ్లి my account ఆప్షన్‌లోకి వెడితే.. Prefilled XML ఉంటుంది. ఫారం 26 Aలోని వివరాలు కనిపిస్తాయి. జీతం, పెన్షన్, వడ్డీ.. తదితరసమాచారం ఇందులో ఉంటుంది. ఐటీ ట్యాక్స్ వివరాలు ఉంటాయి.

### ఐటీఆర్1

వ్యక్తులు.. రెసిడెంట్ అయి ఉండి, నికర ఆదాయం రూ. 50 లక్షలు దాటని వారు ఈ ఫారం వేయాల్సి ఉంటుంది. విదేశీ ఆదాయం ఉండకూడదు. ఏదేని సంస్థలో డైరెక్టర్ అయి ఉండకూడదు. వ్యాపారం, క్యాపిటల్ గెయిన్స్ ఉండకూడదు. ఏ వనరు ద్వారా కూడా నష్టం ఉండకూడదు. ఒక ఇంటి నుంచే ఆదాయం ఉండాలి. మరో విధంగా చెప్పాలంటే.. కేవలం జీతం, వడ్డీ, ఒక ఇంటి మీద ఆదాయం (నష్టం కాదు) ఉన్న వారు ఈ ఫారం దాఖలు చేయాలి. వ్యవసాయం మీద ఆదాయం, డివిడెండ్లు రూ. 5,000 దాటకపోతే కూడా వేయొచ్చు.

### ఐటీఆర్ 2

వ్యక్తులు మరియు ఉమ్మడి కుటుంబాలు ఈ ఫారం దాఖలు చేయొచ్చు. జీతం, ఇంటి మీద ఆదాయం (నష్టం ఉన్నా ఫర్వాలేదు), ఇతర ఆదాయాలు, క్యాపిటల్ గెయిన్స్ ఉన్న వారు మాత్రమే దీన్ని ఉపయోగించవచ్చు. నాన్ రెసిడెంట్లు కూడా ఈ ఫారం వేయొచ్చు. అయితే, వారు తమ ట్యాక్స్ ఐడెంటిటీ నంబరు ఇవ్వాలి. నికర ఆదాయం రూ. 50 లక్షలు దాటిన వారు దీన్ని దాఖలు చేయాల్సి ఉంటుంది. స్థిరాస్తుల వివరాలు, షేర్లు, బంగారం, ఆభరణాలు, వాహనాలు, పెయింటింగ్, కళాత్మక వస్తువులు, బ్యాంకు డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పాలసీలు, రావల్సిన అప్పులు, నగదు మొదలైన వివరాలు ఇందులో పొందుపర్చాలి. ఆస్తులను కొన్న ధర చూపాలే తప్ప ప్రస్తుత మార్కెట్ విలువ కాదు. నష్టం, సర్దుబాటు చూపొచ్చు.

### ఐటీఆర్ 3

ట్యాక్స్ క్రెడిట్ పరిధిలోకి రానివారు, పలు వనరుల నుంచి ఆదాయం ఉన్నవారు.. అంటే జీతం, ఇంటద్దె, క్యాపిటల్ గెయిన్స్, ఇతరత్రా వ్యాపారం.. వృత్తిగత ఆదాయాలు ఉన్నవారు దీన్ని దాఖలు చేయొచ్చు. ఇది పెద్ద ఫారం. చాలా వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. నాన్ రెసిడెంట్లు, వ్యక్తులు, ఉమ్మడి కుటుంబాలు దీన్ని వేయొచ్చు. ఆస్తులు.. అప్పుల పట్టీ, స్థూల ఆదాయం, ఖర్చుల వివరాలు, నగదు, బ్యాంకు నిల్వల వివరాలు ఇందులో పొందుపర్చాలి.

### ఐటీఆర్ 4

ఇది రెసిడెంట్లు మాత్రమే ఉపయోగించగలిగే ఫారం. వ్యక్తులు, హిందు ఉమ్మడి కుటుంబాలు దీన్ని దాఖలు చేయొచ్చు. వ్యాపారం మీద స్థూల ఆదాయం/టర్నోవరు రూ. 2 కోట్లు దాటకూడదు. వృత్తి నిపుణుల స్థూల ఆదాయం రూ. 50,00,000 దాటకూడదు. ఒక ఇంటి మీద మాత్రమే ఆదాయం ఉండాలి. నికర ఆదాయం రూ. 50 లక్షలు దాటకూడదు. ఊహాజనిత ఆదాయాలున్న వారు దీన్ని వేయొచ్చు. ఈ ఫారాన్ని ఒకసారి వేస్తే.. వరుసగా అయిదేళ్ల పాటు ఇదే ఫారం దాఖలు చేయడం కొనసాగించాల్సి ఉంటుంది. ఏదైనా కారణం వల్ల ఫారం 3 వేస్తే రాబోయే అయిదు సంవత్సరాలు కూడా ఫారం 3 మాత్రమే వేయాల్సి ఉంటుంది.

ఇంకా సందేహాలు ఉంటే వృత్తి నిపుణులను సంప్రతించండి. ఐటీ రిటర్నులను మీరే స్వయంగా దాఖలు చేసుకోవచ్చు. అయితే, ఈ విషయంలో కొంత జాగ్రత్త వహించండి. తప్పులు చేయొద్దు. ఆదాయాన్ని చూపించడం మానొద్దు. లేకపోతే 50-200% దాకా జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయని గుర్తుంచుకోవాలి.




కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు





## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (ఆగస్టు-9-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1-2 ఏళ్లు | 3-5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.75 | 7.2 | 7 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.25 | 6.6 | 6.45 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.5 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.7 | 6.7 | 6.4 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.6 | 6.45 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.75 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.75 | 7 | 7.25 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.1 | 6.85 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7 | 7.5 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 7 | 7 | 6.5 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.25 | 6.8 | 6.7 |
| పీఎన్‌బీ | 6.3 | 6.75 | 6.5 |
| ఎస్‌బీఐ | 6.25 | 6.8 | 6.6 |
| సిండికేట్ బ్యాంక్ | 6 | 6.7 | 6.5 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.75 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# పెట్టుబడుల వృద్ధికి... రిలయన్స్ గ్రోత్ ఫండ్




డి.జయంత్‌కుమార్
కార్వీ థర్డ్‌పార్టీ ప్రొడక్ట్స్ హెడ్


రిలయన్స్ గ్రోత్ ఫండ్ అన్నది ఓపెన్ ఎండెడ్ మిడ్‌క్యాప్ తరహా పథకం. అధికంగా వృద్ధిని సాధించే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో సంపద సృష్టించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం నిర్వహణ వ్యవహారాలను (మేనేజర్) మనీష్ గున్వానీ 2017 నుంచి చూస్తున్నారు. ఆర్థిక సేవల రంగంలో ఆయనకు 17 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది.

### పెట్టుబడుల విధానం

బోటమ్ అప్ విధానాన్ని ఈ పథకం ఎక్కువగా అనుసరిస్తుంది. లేదా స్టాక్ వారీగా పెట్టుబడుల విధానాన్ని ఆచరిస్తుంది. సరైన విలువ, మార్కెట్ విలువ మధ్య ఉన్న అంతరం ఆధారంగా పెట్టుబడుల కోసం ఓ షేరును ఎంచుకుంటుంది. సహేతుక విలువ వద్ద లభిస్తూ, వృద్ధికి అవకాశాలున్న స్టాక్స్‌ను ఎంపిక చేసుకోవడాన్ని గమనించొచ్చు. ప్రధానంగా మిడ్‌క్యాప్ కంపెనీలపై ఈ పథకం దృష్టి సారిస్తుంటుంది. మిడ్‌క్యాప్ స్టాక్స్ కోసం మొత్తం పెట్టుబడుల్లో 65-70 శాతం వరకు పెట్టుబడులను కేటాయిస్తుంటుంది. మిగిలిన మేర నిధులను లార్జ్‌క్యాప్, స్మాల్ క్యాప్‌నకు సమానంగా కేటాయించడాన్ని గమనించొచ్చు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా 3-8 శాతం మధ్య నగదు నిల్వలను కూడా ఈ పథకం కొనసాగిస్తుంటుంది. మిడ్, స్మాల్‌క్యాప్ కౌంటర్లలో లిక్విడిటీని దృష్టిలో ఉంచుకుని పోర్ట్‌ఫోలియోలో చక్కని వైవిధ్యాన్ని కూడా పాటిస్తుంది. టాప్ 40 స్టాక్స్‌లో పెట్టుబడులు 75-80 శాతం వరకు ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ పథకం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ రంగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. ఈ విభాగంలోని కంపెనీల్లో 23 శాతానికి పైగా పెట్టుబడులు ఉన్నాయి. ఆ తర్వాత హెల్త్‌కేర్, కన్స్యూమర్ డిస్క్రెషనరీ, సేవల రంగానికి చెందిన కంపెనీల్లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టింది.

**రాబడుల పనితీరు..:** ఈ పథకం నిర్వహణలో పెట్టుబడులు జూలై చివరికి 6,257 కోట్లుగా ఉన్నాయి. మంచి పనితీరు చరిత్ర కూడా ఉంది. గత రెండు దశాబ్దాల కాలంలో మంచి సంపద సృష్టించడంలో ఈ పథకం ముందున్నది. 1995 అక్టోబర్ నెలలో ఈ పథకం ఆరంభం కాగా, నాడు ఇన్వెస్ట్ చేసి ఉంటే, అప్పటి నుంచి ఇప్పటి వరకు 113 రెట్ల మేర పెట్టుబడులు వృద్ధి చెందేవి. ఆరంభం నుంచి చూస్తే వార్షిక రాబడుల రేటు 21.55%. ఈ పథకం రాబడులకు ప్రామాణికంగా పరిగణించే బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ టీఆర్‌ఐ రాబడులు ఇదే కాలంలో 18.01%గానే ఉన్నాయి. పథకం ప్రారంభమైన నాటినుంచి ప్రతీ నెలా రూ.5,000 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వచ్చి ఉంటే రూ.3.75 కోట్ల సంపద జూన్ చివరికి సమకూరి ఉండేది. ఇందులో అసలు పెట్టుబడి రూ.14.20 లక్షలు కాగా, మిగతాదంతా రాబడులే. గత ఏడాది కాలంలో మిడ్‌క్యాప్ స్టాక్స్ తీవ్రంగా నష్టపోవడంతో ఈ పథకం గతేడాది పనితీరు 6% నష్టాల్లో ఉంది. మూడేళ్లలో 6.30%, ఐదేళ్లలో 10.44%, పదేళ్లలో 11.71% చొప్పున వార్షిక రాబడుల రేటు ఈ పథకంలో ఉంది.




## టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| వరుణ్ బెవరేజెస్ | 5.07 |
| చోళ మండలం ఫైనాన్షియల్ | 3.07 |
| ఆదిత్య బిర్లా ఫ్యాషన్ | 2.80 |
| ఇండియన్ హోటల్స్ | 2.37 |
| వర్ధమాన్ టెక్స్‌టైల్స్ | 2.36 |
| సిటీ యూనియన్‌బ్యాంకు | 2.33 |
| ఓబెరాయ్ రియాలిటీ | 2.33 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 2.32 |
| టాటా పవర్ | 2.31 |
| ఏసీసీ | 2.27 |


epaper.sakshi.com



ఆశయం లేని మేధస్సు...
రెక్కలు లేని పక్షితో సమానం
- సాల్వడర్ డాలి, స్పెయిన్ రచయిత, పెయింటర్

## బొమ్మ-బొరుసు



# బాకీల వేటలో బీఎస్ఎన్ఎల్

**రూ. 3,000 కోట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నాలు**



**న్యూఢిల్లీ:** నిధుల సంక్షోభంలో ఉన్న ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ ప్రస్తుతం కార్పొరేట్ క్లయింట్ల నుంచి బాకీల వసూళ్ల పనిలో పడింది. దాదాపు రూ. 3,000 కోట్ల మేర పేరుకు పోయిన బకాయిల్లో సింహభాగం మొత్తాన్ని వచ్చే రెండు, మూడు నెలల్లో వసూలు చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలని భావిస్తోంది. కంపెనీ సీఎండీ పి.కె. పుర్వార్ ఈ విషయాలు వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు జీతాలను కూడా సకాలంలో చెల్లించలేని పరిస్థితులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పుర్వార్ వెల్లడించిన విషయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ఎంటర్‌ప్రైజ్ కస్టమర్స్ నుంచి దాదాపు రూ. 3,000 కోట్ల బకాయిలు రావాలి. వాటిని రాబట్టుకునేందుకు రోజువారీ చర్యలు మరింత ముమ్మరం చేశాం. కచ్చితంగా రాబట్టుకుంటాం' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎప్పట్లోగా మొత్తం రికవర్ అవుతుందన్నది చెప్పడం కష్టమని, అయితే వచ్చే రెండు, మూడు నెలల్లో అధిక భాగాన్ని రాబట్టుకోగలమని తెలిపారు. మరోవైపు, భవంతులు మొదలైనవి లీజుకివ్వడం ద్వారా ఈ ఏడాది కనీసం రూ. 1,000 కోట్లు అద్దెల రూపంలో ఆదాయాలను పెంచుకోవాలనేది బీఎస్ఎన్ఎల్ యోచన. గతంలో ఈ మొత్తం రూ. 200 కోట్లు. వీటితో పాటు అవుట్‌సోర్సింగ్ కార్యకలాపాల క్రమబద్ధీకరణ ద్వారా ఏటా రూ. 200 కోట్లు ఆదా చేసుకోవాలని, విద్యుత్ బిల్లుల భారాన్ని 15 శాతం మేర తగ్గించుకోవాలని సంస్థ ప్రయత్నిస్తోంది.

# స్థూల ఆర్థికాంశాలే కీలకం.!

- ఈ వారంలో ట్రేడింగ్ 3 రోజులకే పరిమితం
- సోమ (బక్రీద్), గురు (స్వాతంత్ర్య దినోత్సవం) వారాల్లో సెలవు
- ఎఫ్‌పీఐ ట్యాక్స్ అంశంపై దృష్టిసారించిన మార్కెట్ వర్గాలు
- రిటైల్, టోకు ద్రవ్యోల్బణం ఈ వారంలోనే వెల్లడి



**ముంబై:** గతవారం దేశీ ప్రధాన స్టాక్ సూచీలు ఒక టిన్నర శాతం వరకు లాభాలను నమోదుచేసి ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. అంతక్రితం వరుసగా నాలుగు వారాల పాటు నష్టాల్లో ట్రేడయ్యి.. ఆరు శాతానికి మించి నష్టాల్లో కొనసాగిన సూచీలు గతవారాంతాన కాస్త సానుకూల వాతావరణాన్ని నింపాయి. ఒక్కసారిగా జరిగిన షార్ట్ కవరింగ్‌కు.. ఈవారంలో కొనుగోలు మద్దతు జతయ్యి మార్కెట్ ఇక్కడ నుంచి ర్యాలీ చేస్తుందా..? లేదంటే, మళ్లీ నేల చూపులు చూస్తుందా అనే అంశానికి, సూపర్ రిచ్ ట్యాక్స్ నుంచి ఎఫ్‌పీఐలకు మినహాయింపు లభిస్తుందా లేదా అనేది అత్యంత కీలకంగా ఉందని దలాల్ స్ట్రీట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పీఐ) అధిక సర్‌చార్జి నుంచి మినహాయింపు ఇవ్వడం, మూడేళ్లు దాటిన పెట్టుబడులకు దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను (ఎల్‌టీసీజీ) నుంచి ఉపసమనం, డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ)ను సులభతరం చేయడం వంటి మార్కెట్ సానుకూల నిర్ణయాలను త్వరలోనే ప్రభుత్వం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే అంశాలు, సూపర్ రిచ్ ట్యాక్స్‌పై ప్రభుత్వ తుది నిర్ణయం వంటి కీలక అంశాలు మార్కెట్‌ను ఈవారంలో ప్రభావితం చేయనున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. నెమ్మదించిన ఆర్థిక వ్యవస్థలో జవసత్వాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటుందనే అంశం ఆధారంగానే మార్కెట్ దిశా నిర్దేశం ఉందని యాక్సిస్ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ అరుణ్ తుక్రాల్ విశ్లేషించారు.

**సోమ, గురువారాల్లో మార్కెట్‌కు సెలవు**

ఈ వారంలో ట్రేడింగ్ 3 రోజులకే పరిమితం కానుంది. సోమవారం బక్రీద్, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం కారణంగా మార్కెట్లకు సెలవు ప్రకటించారు. మార్కెట్ పనిదినాలు తక్కువగా ఉన్న కారణంగా ఈవారంలో ఒడిదుడుకులకు ఆస్కారం ఉందని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ పేర్కొన్నారు.

**ఆర్థికాంశాలపై దృష్టి..**

శుక్రవారం మార్కెట్ ముగిసిన తరువాత జూన్ నెల పారిశ్రామిక ఉత్పత్తి డేటా విడుదలకాగా, ఏడాది ప్రాతిపదికన కేవలం 2 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. పారిశ్రామికరంగం వృద్ధి రేటు మందగమన ప్రభావం మంగళవారం మార్కెట్ ట్రేడింగ్‌పై ఉండేందుకు అవకాశం ఉందని దలాల్ స్ట్రీట్ పండితులు అంచనావేస్తున్నారు. ఇక సోమవారం రిటైల్ ద్రవ్యోల్బణం, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం బుధవారం వెల్లడికానున్నాయి. ఈవారంలో 2,140 కంపెనీల జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు వెల్లడికానున్నాయి. జాబితాలో సన్ ఫార్మా, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, భారత్ ఫోర్జ్, గ్లెన్‌మార్క్ ఫార్మా, బాష్ వంటివి ఉన్నాయి.

### రూ.9,197 కోట్లు వెనక్కి..

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఆగస్టు 1–9 కాలానికి ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.11,135 కోట్లను ఉపసంహరించుకున్నట్లు డిపాజిటరీల డేటా ద్వారా వెల్లడయింది. సూపర్ రిచ్ ట్యాక్స్ అంశం కారణంగా ఈస్థాయిలో భారీ అమ్మకాలకు పాల్పడ్డారని మార్నింగ్‌స్టార్ సీనియర్ విశ్లేషకులు హిమాన్షు శ్రీవాస్తవ విశ్లేషించారు. ఈక్విటీ మార్కెట్ నుంచి పెట్టుబడులు వెనక్కు తగ్గినప్పటికీ.. డెట్ మార్కెట్‌లో రూ.1,937 కోట్లను పెట్టుబడి పెట్టడం ద్వారా క్యాపిటల్ మార్కెట్లో వీరి నికర పెట్టుబడి ఉపసంహరణ ఈనెల్లో ఇప్పటివరకు రూ.9,197 కోట్లకు పరిమితమైంది.

# రియల్టీ సమస్యలపై కేంద్రం దృష్టి

**రియల్టర్లు, గృహ కొనుగోలుదారులతో ఆర్థిక మంత్రి భేటీ**



**న్యూఢిల్లీ:** రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఇటు రియల్టర్లు, అటు గృహ కొనుగోలుదారులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. నిధుల కొరత, డిమాండ్ మందగించడం, ప్రాజెక్టులు నిల్చిపోవడం తదితర సమస్యల గురించి వివరంగా చర్చించారు. తొలి సమావేశంలో రియల్టర్ల తరపున పరిశ్రమ సమాఖ్యలైన క్రెడాయ్, నారెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు. నిధుల కొరత, అమ్మకాలు పడిపోవడం వంటి అంశాల కారణంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని వారు వివరించారు. ప్రాజెక్టులకు రుణాలిచ్చేలా బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) సూచించాలంటూ మంత్రిని కోరారు. ఇక, ప్రాజెక్టుల జాప్యం కారణంగా 5 లక్షల మందికి పైగా కస్టమర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని మరో సమావేశంలో పాల్గొన్న గృహాల కొనుగోలుదారుల ఫోరం ఎఫ్‌పీఎస్ఈ ప్రెసిడెంట్ అభయ్ ఉపాధ్యాయ్ తెలిపారు. నిలిచిపోయిన ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రభుత్వం రూ. 10,000 కోట్ల స్ట్రెస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, గృహాల కొనుగోలుదారులకు ఊరటనివ్వాలని ఆయన కోరారు. 'ఈ సమావేశాల్లో చాలా ఉపయోగకరమైన అంశాలను చర్చించడం జరిగింది. దీనితో రియల్ ఎస్టేట్ రంగాన్ని పీడిస్తున్న సమస్యల్లో కొన్నింటినైనా పరిష్కరించే ప్రక్రియ ప్రారంభమైంది' అని భేటీలో పాల్గొన్న గృహ, పట్టణ ప్రాంత వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్, పన్నుల విభాగం తదితర శాఖల అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. నిల్చిపోయిన ప్రాజెక్టులను గట్టెక్కించేందుకు ప్రత్యేక నిధిని రూపొందించేలా రాబోయే వారాల్లో ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని ఈ సందర్భంగా సంబంధిత వర్గాలు తెలిపాయి.

# వంట నూనెను బయోడీజిల్‌గా మార్చే పథకం ఆరంభం



**న్యూఢిల్లీ:** వాడేసిన వంటనూనె నుంచి ఉత్పత్తి చేసిన బయోడీజిల్‌ను కొనుగోలు చేసే పథకాన్ని ప్రభుత్వరంగ ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రారంభించాయి. ప్రపంచ బయోడీజిల్ దినోత్సవ సందర్భంగా పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అధికారికంగా ప్రారంభించిన ఈ పథకం కింద... 100 పట్టణాల్లో వినియోగించిన మిగిలిన వంట నూనె నుంచి బయోడీజిల్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఆహ్వానించనున్నాయి. ప్రారంభ సంవత్సరంలో లీటర్‌ను రూ.51కు కొనుగోలు చేస్తారు. రెండో సంవత్సరంలో లీటర్‌కు రూ.52.7, మూడో సంవత్సరంలో రూ.54.5కు ధరను పెంచుతారు.

# కాంట్రాక్టు తయారీలో 100% ఎఫ్‌డీఐలు

**విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు కేంద్రం ప్రతిపాదన**



**న్యూఢిల్లీ:** కాంట్రాక్ట్ తయారీ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించే ప్రతిపాదనపై కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తయారీ రంగంలో ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతులు ఉన్నాయి. భారత్‌లో తయారైన ఉత్పత్తులను హోల్‌సేల్, రిటైల్ మార్గాల్లో ప్రభుత్వ అనుమతుల అవసరం లేకుండా తయారీదారు విక్రయించుకునేందుకు ఇది వెసులుబాటు కల్పిస్తోంది. అయితే ఇందులో కాంట్రాక్ట్ ప్రతిపాదికన ఇతర సంస్థలకు ఉత్పత్తులు తయారు చేసి ఇచ్చే సంస్థల గురించి స్పష్టత లేదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా బడా టెక్నాలజీ కంపెనీలు ఇలా కాంట్రాక్టు తయారీపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో దీనిపై స్పష్టతనివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తోందని సంబంధిత వర్గాలు వివరించాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఈ ప్రతిపాదనపై కసరత్తు చేస్తోందని, త్వరలోనే ఖరారు చేసి కేంద్ర క్యాబినెట్ ఆమోదానికి పంపనుందని పేర్కొన్నాయి. ఒకవేళ ఈ ప్రతిపాదనకు గానీ ఆమోదం లభిస్తే తయారీ రంగానికి మరింత ఊతం లభించగలదని కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ రజత్ వాహి అభిప్రాయపడ్డారు. 'యాపిల్ వంటి టెక్నాలజీ సంస్థలకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది' అని చెప్పారు.

## బోర్డ్‌మీటింగ్స్

వర్ల్‌పూల్ ఇండియా, గుడ్ ఇయర్ ఇండియా, జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రా, టీటీకే ప్రెస్టీజ్, హిందుజా వెంచర్స్, ముత్తూట్ ఫైనాన్స్, రామ్‌కీ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్, టీబీజెడ్, వాటెక్ వాబాగ్, విశాక ఇండస్ట్రీస్, జువారీ ఆగ్రో, బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్, సెంచురీ టెక్స్‌టైల్స్, హెచ్ఎమ్‌టీ, అబన్ ఆఫ్‌షోర్, బ్లిస్ జీవీఎస్ ఫార్మా, ఇమామి పేపర్, శక్తి పంప్స్, టీడీ పవర్

## కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-8-2019

| | |
|---|---|
| విశాఖ | 352–00 |
| చిత్తూరు | 348–00 |
| వరంగల్ | 331–00 |
| విజయవాడ | 339–00 |
| నమక్కల్ | 350–00 |
| గోదావరి | 334–00 |
| చెన్నై | 355–00 |
| ముంబై | 381–00 |
| 11-8-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 328–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.90 |
| బెంగళూరు | 340–00 |
| ఢిల్లీ | 330–00 |
| కోల్‌కతా | 380–00 |

స్టాక్స్ వ్యూ

## మారుతీ సుజుకీ

**బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్**

**కొనొచ్చు**



**ప్రస్తుత ధర:** రూ.6,101 **టార్గెట్ ధర:** రూ. 6,950

**ఎందుకంటే:** వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమ్మకాలు సాధారణ స్థాయికి వస్తాయని కంపెనీ భావిస్తోంది. దీని కోసం ఉత్పత్తి సామర్థ్యం, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాల పెంపు కోసం సేల్స్, సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సిద్ధం చేస్తోంది. విద్యుత్ వాహనాలు, హైబ్రిడ్ వాహనాల కోసం టెక్నాలజీ నిమిత్తం టయోటా కంపెనీతో మారుతీ సుజుకీ కుదుర్చుకున్న ఒప్పందం సానుకూల ప్రభావం చూపనున్నది. ఈ ఒప్పందం కారణంగా టెక్నాలజీ చౌకగా మారుతీ కంపెనీకి అందనున్నది. దీంతో మారుతీ సుజుకీ తక్కువ ధరకు విద్యుత్, హైబ్రిడ్ వాహనాలను అందించగలుగుతుంది. ఫలితంగా ధరలు కీలకమైన భారత విపణిలో మారుతీ కంపెనీకి మేలు కలుగుతుంది. వచ్చే ఏడాది ఎలక్ట్రిక్ వాహనాలను అందించనున్నది. సీఎన్‌జీ, హైబ్రిడ్ వాహన విక్రయాలు ఈ ఆర్థిక సంవత్సరంలో 50 శాతం వృద్ధి చెందగలవన్న అంచనాలతో ఈ వాహనాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 8 శాతం పెరిగినా, నికర లాభం 7 శాతం తగ్గింది. 2011–12 ఆర్థిక సంవత్సరం తర్వాత నికర లాభం తగ్గడం ఇదే మొదటిసారి. మొత్తం పెట్టుబడుల్లో మూడో వంతు నగదు రూపంలో ఇన్వెస్ట్ చేసినప్పటికీ, కంపెనీ ఆర్‌ఓసీఈ(రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్–పెట్టిన పెట్టుబడిపై వచ్చే రాబడి) 22.1 శాతం స్థాయిలో ఆరోగ్యకరంగానే ఉంది. ఆర్థిక పరిస్థితులు సాధారణ స్థితికి రాగానే అధికంగా లాభపడే వాహన కంపెనీల్లో ఇది కూడా ఒకటి కానున్నది. మోడల్స్ పరంగా పటిష్టంగా ఉండటం, వాహన తయారీలో స్థానిక విడిభాగాల వినియోగం అధికంగా ఉండటం, ఒడిదుడుకులు అధికంగా ఉండే విదేశీ కరెన్సీపై ఆధారపడటం తక్కువగా ఉండటం ఇవన్నీ సానుకూలాంశాలు.

## ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్

**బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్స్**

**కొనొచ్చు**



**ప్రస్తుత ధర:** రూ.501 **టార్గెట్ ధర:** రూ. 570

**ఎందుకంటే:** దేశంలో నాలుగవ అతి పెద్ద మోర్ట్‌గేజ్ ఫైనాన్స్ కంపెనీ ఇది. గృహ రుణాలు, నిర్మాణ రంగ కార్యకలాపాలకు, కార్పొరేట్ హౌసింగ్ స్కీమ్‌లకు రుణాలందిస్తోంది. ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. రుణ వ్యయం అధికంగా ఉండటం, నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్) తక్కువగా ఉండటం వల్ల నికర లాభం అంచనాలను అందుకోలేక రూ.610 కోట్లకు పరిమితమైంది. కార్పొరేట్ రంగానికి చెందిన తాజా మొండి బకాయిల కారణంగా స్థూల మొండి బకాయిలు 1.98 శాతానికి పెరిగాయి. (గత క్యూ1లో ఇవి 1.53 శాతంగా ఉన్నాయి) నికర వడ్డీ మార్జిన్ 2.35 శాతంగా నమోదైంది. రుణ వృద్ధి నిలకడగా 17 శాతంగా ఉన్నప్పటికీ, ఆదాయం అంచనాలను అందుకోలేకపోయింది. సీక్వెన్షియల్‌గా చూస్తే, డెవలపర్లకు ఇచ్చిన రుణాలు 4 శాతం పెరిగాయి. మాతృసంస్థ జీవిత బీమా సంస్థ, ఎల్ఐసీ అండదండలు ఉండటం, నగదు నిల్వలు పుష్కలంగా ఉండటం వంటి కారణాల వల్ల... ఒడిదుడుకులను అధిగమించగలిగిన సత్తా ఈ కంపెనీకి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలం చివరినాటికి ఈ కంపెనీ మొత్తం రుణాలు రూ.1,97 లక్షల కోట్లకు పెరిగాయి. రుణ నాణ్యతలో ఒడిదుడుకులు, నికర వడ్డీ మార్జిన్ అంతంతమాత్రంగానే ఉండటం ఒకింత ప్రతికూల ప్రభావం చూపించే అంశాలు. పోటీ తీవ్రత తగ్గడం, లిక్విడిటీ స్థితిగతులు సౌకర్యవంతంగా ఉండటం... సానుకూలాంశాలు.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

# దివీస్ సీఎండీ వేతనం రూ.58.8 కోట్లు



**హైదరాబాద్:** గత ఆర్థిక సంవత్సరంలో భారత ఔషధ రంగంలో అత్యధికంగా రూ.58.8 కోట్ల వేతనం అందుకున్న వ్యక్తిగా దివీస్ ల్యాబరేటరీస్ సీఎండీ మురళి కె దివి నిలిచారు. ఇదే కంపెనీకి చెందిన ఈడీ ఎన్వీ రమణ రూ.30 కోట్లు, హోల్ టైం డైరెక్టర్ కిరణ్ ఎస్ దివి రూ.20 కోట్లు వేతనం పొందారు. సిప్లా ఎండీ ఉమాంగ్ వోరా రూ.15.03 కోట్లు, అరబిందో ఎండీ ఎన్.గోవిందరాజన్ రూ.14.6 కోట్లు, డాక్టర్ రెడ్డీస్ కో–చైర్మన్ జి.వి.ప్రసాద్ రూ.12.4 కోట్లు వేతనం అందుకున్నారు. దేశంలో అతి పెద్ద ఫార్మా సంస్థ సన్ ఫార్మా ఫౌండర్ దిలీప్ సంఘ్వి రూ.1 వేతనంతోపాటు రూ.2,62,800లు ప్రోత్సాహకాల కింద స్వీకరించారు.

# సెన్సెక్స్ 37,810 స్థాయిని అధిగమిస్తే...

**మార్కెట్ పంచాంగం**

**బడ్జెట్** ప్రతిపాదనల్లో విదేశీ ఇన్వెస్టర్లను బాధించిన ఆదాయపు పన్ను సర్‌ఛార్జ్ ఎత్తివేత, టర్నోవర్‌తో సంబంధం లేకుండా అన్ని కంపెనీలకు కార్పొరేట్ టాక్స్ తగ్గింపు, మూడేళ్లకు పైబడిన దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను, డివిడెండు పంపిణీ పన్ను మినహాయింపులు వంటి స్నేహపూరిత చర్యల్ని ప్రభుత్వం ప్రకటించనున్నదనే వార్తలతో గతవారం నాటకీయంగా మార్కెట్ ర్యాలీ జరిపింది. శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత ప్రధాన విదేశీ ఫండ్స్ ప్రతినిధులతో ఆర్థికమంత్రిత్వ శాఖ అధికారులు సమావేశం కూడా జరిపారు. మరోవైపు చైనాతో ఇప్పట్లో వాణిజ్య అంగీకారం కుదరబోదంటూ అదేరోజు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అలాగే అమెరికా టారీఫ్‌లను ఎదుర్కొనేందుకు చైనా...తన కరెన్సీ యువాన్‌ను తీవ్రంగా క్షీణింపచేయడంతో ఇతర ఆసియా కరెన్సీల్లానే మన రూపాయి విలువ కూడా తగ్గిపోతున్నది. గత వారం ద్వితీయార్థంలో భారత్ స్టాక్ సూచీలు పెరిగినా, రూపాయి మాత్రం పుంజుకోలేదు. ఇటువంటి అంతర్జాతీయ అనిశ్చితస్థితిలో కేంద్రం పన్ను మినహాయింపు ప్రతిపాదనలు వెల్లడిస్తే....వాటిపై మార్కెట్ సానుకూలంగా స్పందిస్తుందా..లేదా?. ఈ అంశమే మధ్యకాలిక మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశించవచ్చు. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...,

### సెన్సెక్స్ సాంకేతికాంశాలు...




ఆగస్టు 9తో ముగిసిన వారంలో తొలిరోజున బలహీనంగా ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన 36,450 పాయింట్ల దిగువకు పడిపోయింది. అటుతర్వాత వారంలో చివరి రెండు రోజుల్లో పెద్ద ర్యాలీ సాగించి 37,807 పాయింట్ల గరిష్టస్థాయిని తాకింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 464 పాయింట్ల లాభంతో 37,582 పాయింట్ల వద్ద ముగిసింది. గత నాలుగువారాల్లో సెన్సెక్స్ లాభంతో ముగిసిన వారమిదే. ఈ వారంలో తొలి ట్రేడింగ్ రోజైన మంగళవారం సెన్సెక్స్ రిలీఫ్‌ర్యాలీని కొనసాగిస్తే మరోదఫా 37,810 పాయింట్ల వద్దకు చేరవచ్చు. ఈ స్థాయిని దాటితే వేగంగా 37,950 పాయింట్ల వద్దకు , అటుపైన 38,170–38,330 పాయింట్ల శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం తొలి నిరోధాన్ని దాటలేకపోయినా, బలహీనంగా మొదలైనా 37,405 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే వేగంగా 37.100 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఆ లోపున 36,650 పాయింట్ల వరకూ క్షీణత కొనసాగే అవకాశం వుంది.

### నిఫ్టీ కీలక స్థాయి 11,165




క్రితం వారం తొలిరోజున ఎన్ఎస్ఈ గత కాలమ్‌లో ప్రస్తావించిన 61.8 శాతం రిట్రేస్‌మెంట్ స్థాయి అయిన 10,805 పాయింట్ల దిగువకు తగ్గినప్పటికీ, ముగింపులో ఆ స్థాయిని పరిరక్షించుకోగలిగింది. ఆపైన గతవారం ద్వితీయార్థంలో వేగంగా పెరిగి 11,181 పాయింట్ల గరిష్టస్థాయిని అందుకుంది. ఇదేస్థాయికి 11,165 పాయింట్ల సమీపాన కదులుతున్న 200 రోజుల చలన సగటు రేఖను ఇంట్రాడేలో ఛేధించినా, ఆ దిగువనే 11,110 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీకి 11,165 స్థాయి కీలకమైనది. ఈ లోపున బలహీనంగానూ, ఆపైన బలంగానూ ట్రేడ్‌కావొచ్చు. ఈ వారం మార్కెట్ పెరిగితే 11,180 పాయింట్ల సమీపంలో తొలి నిరోధం కలగవచ్చు. అటుపైన వేగంగా 11,265 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తే క్రమేపీ 11,310–11,360 శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం మార్కెట్ క్షీణిస్తే తొలుత నిఫ్టీకి 11,055 పాయింట్ల వద్ద మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే వేగంగా 10,975 పాయింట్ల వరకూ క్షీణించవచ్చు. ఈ లోపున 10,840 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు,

– పి. సత్యప్రసాద్

# నష్టాలొస్తున్నాయి.. సిప్‌లు ఆపేయాలా?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నేను 2017 నుంచి కొన్ని మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా పోర్ట్‌ఫోలియోలో సుందరమ్ రూరల్ అండ్ కంజప్షన్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మిడ్–క్యాప్ ఆపర్చునిటీస్ ఫండ్, ఎల్ అండ్ టీ ఇండియా వేల్యూ ఫండ్, టాటా ఈక్విటీ పీఈ ఫండ్‌లు ఉన్నాయి. ఈ ఫండ్స్‌లో 2017 నుంచి సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)లు ప్రారంభించాను. అయితే ఈ ఫండ్స్ నష్టాలు చూపడంతో 2018లో సిప్‌లు ఆపేశాను. ఈ ఏడాది కూడా ఈ ఫండ్స్ నష్టాల్లోనే ఉన్నాయి. ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగించమంటారా ? లేకుంటే నా ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వేరే ఫండ్స్‌కు మళ్లించమంటారా ?**

–కళ్యాణి, విజయవాడ

మీ పోర్ట్‌ఫోలియోలో ఉన్నవన్నీ మంచి ఫండ్సే, పైగా ఇది మంచి కాంబినేషన్ కూడా. ఒక్కొక్క ఫండ్‌ది ఒక్కొక్క ప్రత్యేకమైన థీమ్. సుందరమ్ రూరల్ అండ్ కంజప్షన్ ఫండ్.. ప్రామిసింగ్ సెక్టోరియల్ ఫండ్. సాధారణంగా సెక్టోరియల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవద్దని చెప్తుంటాను. కానీ సుందరమ్ ఫండ్ దానికి మినహాయింపు. 2017లో మార్కెట్ మంచి స్థాయిలో ఉంది. ఇలాంటప్పుడు ఫండ్స్ పనితీరు బాగా ఉంటుంది. 2018లో మార్కెట్ అంతంతమాత్రంగానే ఉంది. ఫలితంగా దాదాపు ఫండ్స్ అన్నీ ఆశించిన స్థాయి పనితీరు కనబరచలేకపోయాయి. ఇక ఈ ఏడాది ఇప్పటివరకూ పరిస్థితుల్లో పెద్దగా మార్పులేదు. మీరు ఎంచుకున్న ఫండ్స్ బాగా ఉన్నాయి. వీటన్నింటి పనితీరు పూర్తిగా మార్కెట్ పనితీరును బట్టే ఉంటుంది. అందుకే ఇప్పుడు నష్టాలు కనిపిస్తున్నాయి. నష్టాలు వస్తున్నా మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను సిప్‌ల రూపంలో కొనసాగించండి. మార్కెట్లో పరిస్థితులు కుదుటపడితే, ఈ ఫండ్స్ మీకు లాభాలను చూపిస్తాయి. అసలు సిప్‌ల ద్వారా ఇన్వెస్ట్ చేయడానికి ఉన్న పరమార్థం కూడా ఇదే. మార్కెట్ పెరుగుతున్నప్పుడే కాకుండా మార్కెట్ పతనబాటలో ఉన్నప్పుడు కూడా అధైర్యపడకుండా ఇన్వెస్ట్ చేస్తే, దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందగలరు.

**ఆల్ట్రా షార్ట్ డ్యురేషన్, లిక్విడ్ ఫండ్స్‌కు మధ్య తేడా ఏమిటి? వేటిల్లో రాబడులు అధికంగా వస్తాయి.?**

–దామోదర్, విశాఖపట్టణం

ఆల్ట్రా షార్ట్ డ్యురేషన్, లిక్విడ్ ఫండ్స్‌లు రెండు వేర్వేరు రకాలు. వీటి మధ్య చాలా సన్నని విభజన రేఖ మాత్రమే ఉంటుంది. చట్ట ప్రకారం, లిక్విడ్ ఫండ్... 91 రోజుల మెచ్యూరిటీ ఉండే మనీ మార్కెట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. అయితే సాధారణంగా చాలా మంది లిక్విడ్ ఫండ్ మేనేజర్లు 55 రోజుల నుంచి 60 రోజుల మెచ్యూరిటీ ఉండే మనీ మార్కెట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. మరోవైపు మూడు నుంచి ఆరు వారాల మెచ్యూరిటీ ఉండే సాధనాల్లో ఆల్ట్రా–షార్ట్–డ్యురేషన్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తాయి. ఇక తాజా సెబీ నిబంధనల ప్రకారం, లిక్విడ్ ఫండ్స్ తమ నిధుల్లో కనీసం 20 శాతం వరకూ నగదు, ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లుల వంటి లిక్విడ్ అసెట్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయాలి. డిజైన్ పరంగా చూస్తే, ఆల్ట్రా–షార్ట్–డ్యురేషన్ ఫండ్స్ కంటే లిక్విడ్ ఫండ్స్ ఒకింత సురక్షితమనైవని చెప్పవచ్చు. తాజా సెబీ నిబంధనల కారణంగా లిక్విడ్ ఫండ్స్ మరింత సురక్షితంగా మారాయి. ఆల్ట్రా–షార్ట్–డ్యురేషన్ ఫండ్స్‌తో పోల్చితే లిక్విడ్ ఫండ్స్ రాబడులు ఒకింత తక్కువగా ఉంటాయని చెప్పవచ్చు.

**మదుపు మొదలు పెట్టడానికి ముందుగా మ్యూచువల్ ఫండ్స్‌నే పరిగణించాలా? నేరుగా షేర్లలో ఇన్వెస్ట్ చేయకూడదా?**

–అబ్దుల్లా, హైదరాబాద్

మదుపు మొదలు పెట్టడానికి మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవడం తెలివైన నిర్ణయం. దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం మ్యూచువల్ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయాలి. దీర్ఘకాలంలో ఫండ్స్ మంచి రాబడులనే ఇస్తాయి. ఇక నేరుగా ఈక్విటీలో ఇన్వెస్ట్ చేస్తే, ఒడిదుడుకులు తీవ్రంగా ఉంటాయి. తగిన అనుభవం, అవగాహన లేకపోతే నష్టాలు వస్తాయి. ఇన్వెస్ట్ చేయడానికి ఏ షేర్‌ను ఎంచుకోవాలి ? ఆ కంపెనీ ఫండమెంటల్స్ ఎలా ఉన్నాయి ? తదితర అంశాలపై సాధారణ ఇన్వెస్టర్ కంటే కూడా మ్యూచువల్ ఫండ్ మేనేజర్‌కు అధిక అవగాహన ఉంటుంది. మార్కెట్ సంబంధిత సాధనాల్లో గతంలో ఇన్వెస్ట్ చేసిన అనుభవం లేకుంటే, ముందుగా మ్యూచువల్ ఫండ్స్‌నే ఇన్వెస్ట్‌మెంట్స్ కోసం పరిగణించండి. మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తే, ముఖ్యంగా రెండు ప్రయోజనాలు లభిస్తాయి. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందవచ్చు. ఫండ్ మేనేజర్లు ప్రొఫెషనల్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు. కాబట్టి వారి అనుభవం మంచి ఫలితాలనిస్తుంది. ఇక రెండవది...మ్యూచువల్ ఫండ్స్‌లో చిన్న చిన్న మొత్తాల్లో కూడా ఇన్వెస్ట్ చేసే వీలుంటుంది. మీరు కనీసం నెలకు రూ.1,000తో మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మొదలు పెట్టవచ్చు. కనీసం ఐదు అంతకు మించిన కాలానికి ఇన్వెస్ట్ చేయాలనుకుంటే, మ్యూచువల్ ఫండ్స్‌కు మించిన ఇన్వెస్ట్‌మెంట్ సాధనం మరొకటి లేదు. ఫండ్స్‌లో ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయకూడదు. నెలకు కొంత మొత్తం చొప్పున సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయాలి. మీకు జీతం పెరిగినా, ఇంక్రిమెంట్ వచ్చినా ఈ పెరిగిన మొత్తంలో కొంత మొత్తాన్ని సిప్‌లకు జత చేయండి. ఒకవేళ మీరు స్వయం ఉపాధి లేదా వ్యాపారం చేస్తున్నట్లయితే, ఏడాదికి సిప్ మొత్తాన్ని కనీసం 5–10 శాతం చొప్పున పెంచండి. కనీసం ఏడాదికొకసారైనా మీ పోర్ట్‌ఫోలియోలోని ఫండ్ల పనితీరును సమీక్షించి, వాటి పనితీరు ఆధారంగా నిర్ణయాలు తీసుకోండి.



## మేమూ లోకలే!

హైదరాబాద్ నగరానికి సమీపంలోని అమీన్‌పూర్ (సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు) చెరువులో సందడి చేస్తున్న ఈ ఫ్లెమెంగో పక్షులను ఇకపై 'విదేశీ' అనకూడదట. ఎందుకంటే.. ఏటా వేసవిలో ఇక్కడకొచ్చి.. వర్షాలు ప్రారంభం కాగానే స్వస్థలాలకు వెళ్లిపోతుంటాయి. ఇప్పుడు మాత్రం ఇక్కడే స్థిరపడిపోయాయట!. అందుకే ఇకపై మేమూ లోకలే అంటున్నాయ్.

- రాజేశ్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్



# అక్రమ బ్లో అవుట్లు!

**రాజధాని శివార్లలో అడ్డగోలుగా రియల్ వెంచర్లు**
**అనుమతులు లేకుండానే నిర్మాణాలు.. విక్రయాలు**
**యథేచ్ఛగా 111 జీఓ ఉల్లంఘన**

**సాక్షి, హైదరాబాద్:** నగర శివార్లలో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్‌లు పుట్టుకొస్తున్నాయి. రియల్ రంగం జోరు మీద ఉండటంతో కొందరు రియల్టర్లు, బ్రోకర్లు తక్కువ ధరకు ప్లాట్ల పేరిట ప్రజలను మోసగిస్తున్నారు. డీటీసీపీ, హెచ్‌ఎండీఏ అనుమతులు లేకుండానే హైదరాబాద్ శివార్లతోపాటు జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీల్లో వ్యవసాయ భూములను ప్లాట్లుగా మలిచి అమ్మేస్తున్నారు. చిన్నపాటి లొసుగులను సాకుగా చూపుతూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ అవుతున్న ప్లాట్లలో దాదాపు 85 శాతం అక్రమ లేఅవుట్లే కావడం గమనార్హం.

### నిబంధనలివి...

- సాధారణంగా లేఅవుట్ ఏర్పాటుకు డీటీసీపీ, హెచ్‌ఎండీఏ తదితర పట్టణాభివృద్ధి సంస్థల అనుమతి తప్పనిసరి. పంచాయతీలకు లేఅవుట్ జారీ అధికారం లేదు.
- పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, ప్లేగ్రౌండ్స్ తదితర వాటికి పక్కాగా స్థలాలను కేటాయించాలి.
- తారు రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, కరెంటు సౌకర్యాన్ని ప్రతి ప్లాటుకు కల్పించాలి.
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల చుట్టూరా 10 కి.మీ మేర నిర్మాణాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది.
- ఈ జలాశయాల పరిరక్షణకు 111 జీఓను తెచ్చి కాలుష్య పరిశ్రమలను నిషేధించింది.
- గృహ, ఇతర అవసరాలకు మాత్రం భూ విస్తీర్ణంలో 10 శాతం మాత్రమే వినియోగించుకునేలా షరతు విధించింది.



ఈ చిత్రంలో రోడ్డు, ఓ భవన నిర్మాణం ఉన్న ప్రాంతం ఓ కుంట అంటే నమ్ముతారా! కానీ ఇది నిజం.. శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంటలో అక్రమంగా వెలిసిన వెంచర్ ఇది. ఇక్కడ జీఓ 111 నిబంధనలు అమలులో ఉన్నాయి. దీని ప్రకారం ఎలాంటి లే-అవుట్‌లు, నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ రియల్టర్లు ఏకంగా కుంటలోనే ప్లాట్లు చేసి అమ్మేసుకున్నారు. కుంట సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగి కాలువ కూడా రియల్టర్ల కబంధ హస్తాల్లో చిక్కి కనుమరుగైంది. ఈ జీఓ పరిధిలోకి వచ్చే 84 గ్రామాల్లోనూ ఇలాంటి అక్రమాలే కనిపిస్తాయి.

కొత్తగా ఏర్పాటు చేసే లే-అవుట్ల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖతో అనుసంధానించాలని మున్సిపల్ అధికారులు సూచించారు. అనుమతి పొందిన లేఅవుట్లలోని స్థలాలనే రిజిస్ట్రేషన్ చేసేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ కమిషనర్

### అనుసంధానానికి అడ్డు...

అర్విండ్ కుమార్ సబ్ రిజిస్ట్రార్లకు లేఖ రాసినా రిజిస్ట్రేషన్ల శాఖ మాత్రం దీన్ని పట్టించుకోవడం లేదు. అలాగే 111 జీవో క్షేత్రస్థాయిలో అమలు కావట్లేదు. అక్రమ లేఅవుట్లను తొలగించాల్సిన పంచాయతీరాజ్, హెచ్‌ఎండీఏ విభాగాలు చోద్యం చూస్తుండగా, వాటర్‌బోర్డు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

## అక్టోబర్‌లో
# ఓటర్ల జాబితా సవరణ

- 2020 జనవరి 1 అర్హత తేదీగా కార్యక్రమం
- అక్టోబర్ 15న ముసాయిదా జాబితా ప్రకటన
- నవంబర్ 30 వరకు ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం–2020 షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రస్తుత ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఓటర్లను తొలగించి, ఇతర లోపాలను సరిదిద్దిన తర్వాత ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించింది. అక్టోబర్ 15 నాటికి ఓటర్ల జాబితాలోని లోపాలను సరిచేయాలని, అదే రోజు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరింది. 2020 జనవరి 1 అర్హత తేదీగా ఓటర్ల జాబితా సవరణ జరపాలని సూచించింది. అంటే, 2020 నాటికి 18 ఏళ్ల వయసుకు చేరే యువతీయువకులు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి అర్హులు కానున్నారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తును నవంబర్ 30 వరకు స్వీకరించనున్నారు. ఓటర్ల నమోదును ప్రోత్సహించేందుకు నవంబర్ 2, 3, 9, 11 తేదీల్లో పెద్ద ఎత్తున ప్రచారోద్యమాన్ని నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరింది. ఓటర్ల నమోదు దరఖాస్తులతో పాటు అభ్యంతరాలను పరిష్కరించి వచ్చే ఏడాది జనవరి 15 నాటికి తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

**లోపాలపై ప్రత్యేక దృష్టి..**

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితాలో లోపాలపై సర్వత్రా విమర్శలు చెలరేగిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అప్రమత్తమైంది. ఓటర్ల జాబితాలో లోపాలను సరిచేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించింది. ఓటర్ల జాబితా నుంచి డూప్లికేట్ ఓటర్ల ఏరివేత, ఇతర లోపాలను సరిదిద్దడంతో పాటు ఓటర్ల ఫొటోల నాణ్యతను పరీక్షించే కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను (సీఈఓ) ఇటీవల ఆదేశించింది. ప్రస్తుత ఓటర్ల జాబితాలోని ఓటర్లు తమ పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, రేషన్ కార్డు వంటి ఏదైనా గుర్తింపు కార్డు జిరాక్స్‌ని స్వచ్ఛందంగా సమర్పించి తమ ఓటు హక్కును ధ్రువీకరించుకునేలా ప్రోత్సహించాలని కోరింది.

**ఇంటింటికీ తిరిగి..**

బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాలను సరిచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ క్రమంలో చనిపోయిన ఓటర్లు, ఇంకా ఓటరుగా నమోదు కాని పౌరులు, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల వివరాలను సేకరించాలని కోరింది. బీఎల్‌ఓలు సేకరించిన సమాచారాన్ని ఏఈఆర్‌వో/ఈఆర్‌వో/డీఈవోలు/రోల్ అబ్జర్వర్లు అక్టోబర్ 15లోగా పరీక్షించాలని సూచించింది.

**ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్..**

| | |
|---|---|
| ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన | 15.10.2019 |
| అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ | 15.10.2019 నుంచి 30.11.2019 |
| ప్రత్యేక ప్రచారోద్యమం తేదీలు | నవంబర్ 2, 3, 9, 11 |
| అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారం | 15.12.2019 |
| ఓటర్ల జాబితాలో లోపాల పరిశీలన, తుది జాబితా ప్రచురణకు అనుమతి స్వీకరణ | 25.12.2019 |
| డేటా బేస్ నవీకరణ, అనుబంధ జాబితాల ప్రచురణ | 31.12.2019 |
| తుది ఓటర్ల జాబితా | 01.01.2020 నుంచి 15.01.2020 |

# కాంక్రీట్ నుంచి ఇసుక!

పది బ్లాకులతో కూడిన సచివాలయ పాత భవనాలను కూలిస్తే వందల టన్నుల్లో కాంక్రీట్ వ్యర్థాలు ఉత్పన్నం కాబోతున్నాయి. వాటిని ఏం చేస్తారు?

కొత్త సచివాలయ నిర్మాణానికి భారీ స్థాయిలో ఇసుక అవసరం. ఇసుక కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో దానిని ఎక్కడ నుంచి తెస్తారు?

ఆ వ్యర్థాలనే ఇసుకగా మారిస్తే.. రెండు సమస్యలూ పరిష్కారమవుతాయి కదా? ఇప్పుడు ఆ దిశగానే అధికారులు ఆలోచనలు చేస్తున్నారు.

- సచివాలయ కూల్చివేత వ్యర్థాలను పునర్వినియోగించే యోచన
- కాంక్రీట్ శిథిలాలను ఆధునిక పద్ధతుల్లో పొడిగా మార్పు
- సాధారణ ఇసుకలో 20 శాతం మేర కలిపి వినియోగం
- పలు నగరాల్లో ఇప్పటికే కాంక్రీట్ వ్యర్థాల రీసైక్లింగ్
- కొత్త సచివాలయ నిర్మాణంలో ఈ విధానం అనుసరించాలని ప్రణాళికలు

**సాక్షి, హైదరాబాద్:** కొత్త సచివాలయ నమూనా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ఆకృతిలో ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆది నుంచి ఇష్టపడే అరబ్ నిర్మాణ శైలిలో కనిపించే గుమ్మటం డిజైన్‌తో అది ఉంటుందని దాదాపుగా స్పష్టమైంది. 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితం కాబోయే కొత్త సచివాలయ భవన సముదాయం ఆధునిక హంగులతో ఉండనుంది. భవనంలో ఆధునికత ఉండటంతోపాటు నిర్మాణంలో కూడా ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించబోతున్నారు. ఇందులో భాగంగా పాత భవనాలను కూల్చివేయగా వచ్చే వ్యర్థాలను పునర్వినియోగించాలని యోచిస్తున్నారు.

**వ్యర్థాలను పొడి చేసి...**

ప్రపంచవ్యాప్తంగా ఇసుకకు కొరత ఏర్పడుతోంది. కాంక్రీట్ నిర్మాణాలు శరవేగంగా తీవ్ర మవుతుండటంతో ఇసుక వాడకం బాగా పెరిగింది. ఇష్టం వచ్చినట్టు ఇసుకను తోడేస్తుండటంతో నదీగర్భం దెబ్బతిని నదుల ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే ఇసుకకు ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురాగా, మన దేశంలో ఇప్పటివరకు ఆ దిశగా పూర్తిస్థాయి ప్రయత్నాలు మొదలుకాలేదు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కొన్ని నగరాల్లో మాత్రం ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరిస్తున్నారు. భవనాలను కూల్చివేసినప్పుడు వచ్చే కాంక్రీట్ వ్యర్థాలను ఇసుకగా మార్చడం వీటిలో ఒకటి. ఈ వ్యర్థాలను ఇసుకలాగా పొడి చేస్తారు. కొత్త నిర్మాణాల్లో దానినే ఇసుకగా వినియోగిస్తారు. అయితే పూర్తిగా దాన్నే ఇసుకకు బదులు వాడితే నిర్మాణాలు అంత పటుత్వంగా ఉండవన్న అభిప్రాయాలున్నాయి. దీంతో 15 శాతం నుంచి 20 శాతం వరకు అసలు ఇసుకను తగ్గించి ఈ పొడిని వాడొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. కొత్త సచివాలయ నిర్మాణంలో కూడా ఈ విధానాన్ని అనుసరించాలని అధికారులు యోచిస్తున్నారు.

**ఫ్లోరింగ్ వంటి పనులకు పూర్తిగా వినియోగం..**

ప్రధాన నిర్మాణంలో 20 శాతానికి మించకుండా పాత కాంక్రీట్ వ్యర్థాల పొడిని ఇసుకలో కలిపి వాడుతున్నా, ఇతర పనులకు మాత్రం వంద శాతం ఆ వ్యర్థాల పొడినే ఉపయోగిస్తున్నారు. ఫ్లోరింగ్, టైల్స్ వేసేచోట, ఫుట్‌పాత్‌లు, బయటి గోడల నిర్మాణం తదితర పనుల్లో ఈ పొడినే వాడుతున్నారు. దీనివల్ల మొత్తం నిర్మాణ వ్యయంలో దాదాపు 40 శాతం వరకు ఇసుక వాడకం తగ్గుతుంది. అంతమేర ఖర్చు ఆదా కావడంతోపాటు నదులకు కూడా రక్షణ ఏర్పడుతుంది. కొత్త సచివాలయ నిర్మాణంలో కూడా ఈ పద్ధతిని అనుసరిస్తే ఈ రెండు లాభాలు కలగనున్నాయి. ప్రస్తుతం పాత సచివాలయంలో పది భారీ భవనాలున్నాయి. వాటిని కూల్చివేస్తే వందల టన్నుల కాంక్రీట్ వ్యర్థాలు వస్తాయి. అంత భారీ మొత్తంలో వచ్చే వ్యర్థాలను ఏమీ చేయలేమని, వాటితో నగర శివార్లలో ఉన్న భారీ క్వారీ గుంతలను పూడుస్తామని గతంలో ఓ అధికారి వివరించారు. కానీ కొంతకాలంగా హైదరాబాద్‌లో కూడా భవన వ్యర్థాలను పునర్వినియోగించేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు ప్రారంభించింది. చెన్నై, బెంగళూరు, కొచ్చి వంటి దక్షిణ భారతదేశంలోని నగరాలతోపాటు ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, పుణె, అహ్మదాబాద్, గాంధీనగర్, వడోదర వంటి చోట్ల భవనాల వ్యర్థాల రీసైక్లింగ్ ముమ్మరంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త సచివాలయ నిర్మాణంలోనూ ఈ విధానం అవలంబించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ సమాయత్తమవుతోంది.

### సోషల్ మీడియా ప్రభావంతో తగ్గిన స్టాంపుల ఆదాయం

**ఇండోర్:** పోస్టల్ సేవల ఆదాయ వనరుల్లో సింహభాగమైన పోస్టల్ స్టాంపుల ఆదాయం క్రమంగా తగ్గుతోంది. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలు, సంప్రదాయ ఉత్తరాల వాడకాన్ని తగ్గించడంతో స్టాంపుల ఆదాయానికి గండి పడుతోంది. పోస్టల్ స్టాంపుల కొనుగోలులో గతేడాదితో పోలిస్తే 2018–19లో 78.66 శాతం తగ్గుదల ఉన్నట్లు అందులో వెల్లడించారు.






## బలగం కోసం
# కమలం పావులు

- రాష్ట్రంలో బలోపేతం కోసం చేరికల వ్యూహానికి బీజేపీ పదును
- నిన్న మోత్కుపల్లి.. నేడు నందీశ్వర్‌గౌడ్‌తో చర్చలు
- పార్టీలో చేరాలని ఇళ్లకు వెళ్లి మరీ ఆహ్వానం
- అధిష్టానం ఆదేశాలతో రంగంలోకి రాష్ట్ర బీజేపీ నాయకత్వం
- పార్టీలో చేరాక కూడా ఇదే గౌరవం కొనసాగుతుందని హామీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో బలపడేందుకు కమలదళం వేగంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా చేరికలను ముమ్మరం చేసింది. పార్టీ జాతీయ నాయకత్వం ఆదేశాలతో రాష్ట్ర నాయకత్వం వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నేతలను, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి నాయకులను పార్టీలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా టీడీపీ, కాంగ్రెస్ నేతలను టార్గెట్ చేసుకొని పార్టీలో చేర్చుకుంటోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు టీడీపీ బహిష్కృత నేత మోత్కుపల్లి నర్సింహులు ఇంటికి శనివారం రాత్రి వెళ్లి మరీ ఈ మేరకు మాట్లాడగా లక్ష్మణ్ తదితరులు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ ఇంటికి ఆదివారం వెళ్లి మరీ ఆయన్ను బీజేపీలోకి ఆహ్వానించారు. త్వరలోనే మరికొంత మంది టీడీపీ ముఖ్య నేతలను బీజేపీలో చేర్పించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, చాడ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులను బీజేపీలో చేర్చుకోగా తాజాగా పెద్దపల్లి మాజీ ఎంపీ జి.వివేక్‌ను చేర్చుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ స్వయంగా వివేక్‌ను షా వద్దకు తీసుకెళ్లారు. భవిష్యత్తులో పార్టీలో వారికి ఇదే గౌరవం కొనసాగుతుందన్న హామీలను ఇస్తూ చేరికలను వేగవంతం చేస్తున్నారు.



**గ్రేటర్‌లో టీడీపీ నేతలు పూర్తిగా బీజేపీలోకి వచ్చేలా**

రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయం అని పదే పదే చెబుతున్న బీజేపీ... గ్రేటర్ హైదరాబాద్‌పై దృష్టి సారించింది. ఇందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని టీడీపీ నేతలను అందరినీ బీజేపీలో చేర్పించేందుకు కార్యక్రమాలను నిర్వహించేందుకు బీజేపీ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈ నెల 18న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు 25 వేల మందిని తరలించాలని భావిస్తోంది. ఇదే సమావేశంలో టీడీపీ ముఖ్య నాయకుల్లో ఒకరైన గరికపాటి మోహన్‌రావు బీజేపీలో చేరనున్నారు. అలాగే సామ రంగారెడ్డి, మొవ్వ సత్యనారాయణ, మాజీ మంత్రి జగన్నాయక్, శ్రీకళారెడ్డి వంటి టీడీపీ నాయకులను చేర్చుకునేలా బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది.






Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792